
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం
సోమవారం 20, మే 2024




# కాయ్ రాజా కాయ్

## జిల్లాలో బెట్టింగ్‌ల జోరు

- రాష్ట్రంలో కూటమి వైపు పెరిగిన పందేలు
- ఇక్కడ కూడా మెజారిటీ స్థానాలపై గురి
- రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలకు లభించే సీట్లపై చేతులు మారుతున్న డబ్బు
- దర్శి, చీరాల, కందుకూరు.. ఆతర్వాత ఒంగోలుపైనే అధికం
- ఇప్పటికే రూ.వందల కోట్లు దాటిన వైనం



**ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. ఇటు టీడీపీ కూటమి, అటు వైసీపీ రాష్ట్రస్థాయి నేతల స్పందనలు కూడా అందుకు దోహదపడ్డాయి. రెండు రోజుల నుంచి జిల్లాలో పందేల జోరు పెరిగింది. ఇప్పటికే వందల కోట్ల బెట్టింగ్ జరిగింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేజిక్కించుకుంటుందన్న వైపు అధికంగా పందేలు నడుస్తున్నాయి. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు లభించే స్థానాలపైనా బెట్టింగ్‌లు పెరిగాయి. జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయన్న విషయంపైనా పందేలు కాస్తున్నారు. కింది స్థాయిలో దర్శి, కందుకూరు, ఒంగోలు, చీరాల లాంటి స్థానాల్లో ఎవరు విజయం సాధిస్తారన్న దానిపై బెట్టింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో గెలుపోటములకన్నా ఆధిక్యతలపైనే పందేలు కడుతున్నారు. కొన్నిచోట్ల డబ్బుతోపాటు వారిచేతిలో ఉన్న పదవులపైనా పందేలు నడుస్తుండటం విశేషం. ఒంగోలు లోక్‌సభ స్థానంలో గెలుపోటములపై కూడా బెట్టింగ్‌లు పెరిగాయి.**



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)
ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు జోరుగా నడుస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో గెలుపోటములపై సీఎం జగన్ ప్రకటన అనంతరం ఇవి మరింత ఊపందుకున్నాయి. ఎన్నికల సమరం ప్రారంభానికి ముందు రాష్ట్రంలో టీడీపీ కూటమికి 88 స్థానాలు కూడా రావని వైసీపీ అనుకూల బెట్టింగ్ సాగింది. ఒంగోలు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు కొందరు ముందుకొచ్చి రూ.కోటి పందెం కాశారు. అనంతరం వైసీపీ అనుకూల బెట్టింగ్‌లు తగ్గాయి. తిరిగి జగన్ సిద్ధం సభల నిర్వహణ తర్వాత వైసీపీ అనుకూల పందేలు పెరిగాయి. నామినేషన్‌ల దాఖలు కార్యక్రమం అనంతరం వారివైపు నుంచి తగ్గాయి. ఎన్నికల ప్రచార కార్యక్రమం ముమ్మరంగా జరిగేటప్పుడు వైసీపీ శ్రేణులు మరోసారి బెట్టింగ్‌లకు ముందుకొచ్చాయి. పోల్ చివరికొచ్చేసరికి వెనకడుగు వేశారు. పోలింగ్ రోజు కూడా ఇదే పరిస్థితి కనిపించింది. అయితే ఐప్యాక్ ప్రతినిధులతో సీఎం జగన్ సమావేశం అనంతరం రాష్ట్రంలో వైసీపీ గెలుస్తుందన్న సంకేతాలతో పందేలు పెరిగాయి. టీడీపీ కూటమి వైపు పందెంరాయుళ్లు వెనక్కి తగ్గకపోవడంతో మళ్లీ వారిలో ఆలోచన ప్రారంభమైంది. తాజాగా రాష్ట్రస్థాయిలో గెలుపోటములను పక్కనపెట్టి కూటమిలో టీడీపీకి వచ్చే సీట్ల కన్నా వైసీపీకి అదనంగా వస్తాయంటూ వైసీపీ అనుకూలురు బెట్టింగ్‌లు ప్రారంభించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఈ వ్యవహారం సాగుతోంది. మొత్తం రాష్ట్రస్థాయి గెలుపోటములపై టీడీపీ కూటమి గెలిస్తే రూ.లక్షకు లక్ష, వైసీపీ గెలిస్తే లక్షకు లక్షన్నర పందెం నడుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వైసీపీ అనుకూల బెట్టింగ్‌దారులు పంథాను మార్చి కూటమితో సంబంధం లేకుండా టీడీపీ కన్నా వైసీపీకి ఒక్క సీటైనా అధికంగా వస్తుందంటూ పందేలు కట్టడం ప్రారంభించారు. ఈ విషయంలోనూ బెట్టింగ్‌లు జోరందుకోవడంతో రాష్ట్రస్థాయిలో అధికారం ఎవరిదన్న విషయంలో కూటమి వైపే ఎక్కువ బెట్టింగ్‌లు జరుగుతున్న విషయం తేటతెల్లమైంది.

### జిల్లాలో మెజారిటీ స్థానాలపై ఎక్కువగా పందేలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలుండగా వాటిలో మెజారిటీ స్థానాలు ఎవరికి వస్తాయన్న దానిపై ఎక్కువగా పందేలు జరుగుతున్నాయి. పోలింగ్‌కు ముందు ఉమ్మడి జిల్లాలో టీడీపీకి 7 స్థానాలు వస్తాయా? రావా? అన్న దానిపై బెట్టింగ్‌లు సాగాయి. టీడీపీ అనుకూలురు లక్ష పందెం కాస్తే వైసీపీ అనుకూలురు కూడా సమాన స్థాయిలో పెట్టేందుకు ముందుకు వచ్చారు. తాజాగా టీడీపీకి ఉమ్మడి జిల్లాలో 7 స్థానాలు రావు అన్న విషయంలో వైసీపీ వారు బెట్టింగ్‌లకు రాకపోతుండటం గమనార్హం. అయితే ఆదివారం మధ్యాహ్నం నుంచి వైసీపీ అనుకూలురు జిల్లాలో అత్యధిక స్థానాలను పక్కనపెట్టి వైసీపీకి ఐదు స్థానాలు వస్తాయన్న విషయంపై బెట్టింగ్‌లకు దిగారు. ఆప్రకారం టీడీపీకి 7, వైసీపీకి 5 అన్న స్థాయిలో వారి పందెం కనిపించింది.

### నియోజకవర్గాల వారీ ఇలా..



జిల్లాలో నియోజకవర్గాల వారీ చూస్తే దర్శి, కందుకూరు, చీరాల, ఒంగోలు లాంటి అసెంబ్లీ స్థానాలపైనే గెలుపోటములపై బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఒంగోలులో వైసీపీ అభ్యర్థి బాలినేని గెలుస్తారని గతంలో ముందుకు వచ్చిన వారు తాజాగా ఒకటికి ఒకటిన్నర పెడితేనే బెట్టింగ్ కాస్తామని చెప్తున్నారు. దర్శిలో ఇరుపార్టీల మధ్య గెలుపోటములపై పందేలు జోరుగా సాగుతున్నాయి. అందులో దర్శి మండలంపై పెరిగాయి. తొలి రెండురోజుల్లో వైసీపీకి 10వేల మెజారిటీ వస్తుందని బెట్టింగ్‌లు కాసినవారు తాజాగా 2వేల మెజారిటీపై పందెం కడుతున్నారు. టీడీపీ అనుకూల బెట్టింగ్‌లు కాసేవారు మాత్రం ఆరంభం నుంచి ఇప్పటి వరకు విజయంపై మాత్రమే బెట్టింగ్ కాస్తున్నారు. కందుకూరు, చీరాలలో గెలుపోటములపై కూడా స్థానికంగా పందేలు అధికంగా జరుగుతున్నాయి. పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు, కొండపి, కనిగిరి నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి గెలుపు ఖాయమని తేలడంతో ఆధిక్యతలపైన మాత్రమే బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. వెలిగండ్ల మండలంలో ఎన్నడూ లేనివిధంగా ఇరు పార్టీలకు చెందిన నాయకులు గెలుపోటములపై తమ పదవులకు సైతం రాజీనామా చేయడానికి అగ్రిమెంట్లు రాసుకున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీ గెలుపునకు అనుకూలంగా ఎక్కువగా పందెం కడుతున్నారు. గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో పోటాపోటీ బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. గిద్దలూరు విషయంలో మాత్రం విభిన్న రకాల బెట్టింగ్‌లు సాగుతున్నాయి. కింది స్థాయిలో మండలాల వారీ, గ్రామాల వారీ కూడా బెట్టింగ్ రాయుళ్ల పందేల జోరు పెంచడం కనిపిస్తోంది.

## డీసీఎంఎస్ పాలకవర్గం రద్దు

- అధికార పీఐసీగా జేసీ
- అకౌంటెంట్ సస్పెన్షన్

ఒంగోలు (విద్య), మే 19 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) పాలకవర్గాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. అధికార పీఐసీగా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను నియమించింది. ఈమేరకు రాష్ట్ర సహకార శాఖ కార్యదర్శి ఎ.బాబు ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఎంఎస్‌లో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. రైతులకు ఎరువులు సరఫరా చేసినందుకు ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) కంపెనీకి చెల్లించేందుకు పొగాకు బోర్డు విడుదల చేసిన రూ.3.5 కోట్లను డీసీఎంఎస్ అకౌంటెంట్ రామచంద్రరావు విడతల వారీగా తన బ్యాంకు సేవింగ్స్ ఖాతాకు మళ్లించారు. ఆతర్వాత ఐపీఎల్ కంపెనీ నుంచి ఒత్తిళ్లు రావడంతో ఆయన దశల వారీగా రూ.2.26 కోట్లను ఆకంపెనీ ఖాతాకు జమ చేశారు. మిగిలిన మొత్తాన్ని ఐపీఎల్‌కు చెల్లించాల్సి ఉంది. ఈనేపథ్యంలో డీసీఎంఎస్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పాలకవర్గాన్ని ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని కలెక్టర్ సంజాయిషీ నోటీసులు ఇచ్చారు. మరోవైపు నిధుల దుర్వినియోగంపై అప్పటి డీసీవో వి.రాజశేఖర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈనేపథ్యంలో ఏడుగురు సభ్యుల డీసీఎంఎస్ పాలకవర్గంపై ప్రభుత్వం వేటు వేసింది. ప్రస్తుతం సొసైటీ చైర్మన్‌గా రావి పద్మావతి, సభ్యులుగా సూరసాని మోహన్‌రెడ్డి, స్వర్ణ వంశీకృష్ణ, షేక్ హుస్సేన్, సారె వెంకటనాయుడు, గంగవరపు శౌరమ్మ, వేమిరెడ్డి చెన్నారెడ్డిలు వ్యవహరిస్తున్నారు. వీరంతా సొసైటీ నిర్వహణలో విఫలమైనందున ప్రభుత్వం పాలకవర్గాన్ని రద్దు చేసింది. సొసైటీలో నిధుల స్వాహాకు ప్రధాన కారకుడైన అకౌంటెంట్ బి.రామచంద్రరావును సస్పెండ్ చేసినట్లు జిల్లా సహకార అధికారి బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.



## జల..జల..జలపాతం

సీఎస్‌పురం మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన భైరవకోన వద్ద జలపాతం కనువిందు చేస్తోంది. వేసవి కావడంతో నిన్నటి వరకూ నీరు కనిపించని ఇక్కడ శనివారం రాత్రి కురిసిన వర్షానికి జలకళ సంతరించుకుంది. జలపాతాన్ని చూసేందుకు ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి భైరవకోనకు వస్తున్నారు. దీంతో భక్తుల తాకిడి పెరిగింది. జలపాతం వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా దేవస్థాన నిర్వాహకులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.
- సీఎస్‌పురం(పామూరు)

## డేర్ డ్రిల్!



గాలిలోకి డమ్మీ బుల్లెట్లతో ఫైరింగ్ చేస్తున్న పోలీసులు



మంటలను ఆర్పుతున్న కానిస్టేబుళ్లు



రాళ్లదాడిని అడ్డుకుంటున్న బలగాలు

ఒంగోలు క్రైం, మే 19 : ఒంగోలు ఆర్టీసీ డిపో సెంటర్‌కు ఆదివారం సాయంత్రం కొందరు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం రాళ్లు రువ్వడం ప్రారంభించారు. అంతలోనే పోలీసులు అక్కడికి వచ్చారు. వాటర్ కెనాన్‌ను ఉపయోగించారు. అల్లరి మూకలు వెనక్కి తగ్గకపోవడంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. అనంతరం లాఠీచార్జి చేశారు. పరిస్థితి అదుపుకాకపోవడంతో గాలిలోకి కాల్పులు జరిపారు. దీంతో కొద్దిసేపు ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అనంతరం అదంతా నిజం కాదని.. పోలీసుల మాక్ డ్రిల్ అని తెలుసుకొని ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తవడం, త్వరలో కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో అసాంఘిక శక్తులు అల్లర్లకు పాల్పడితే అదుపు చేసే విధానాన్ని ఎస్పీ గరుడ్ సుమిత్ ఆధ్వర్యంలో పోలీసులు కళ్లకుకట్టినట్లు చూపించారు. గాలిలోకి కాల్పుల సమయంలో డమ్మీ బుల్లెట్లను వినియోగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల్లో ధైర్యం కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించామని తెలిపారు. ప్రజల శాంతియుత జీవనానికి ఎవరు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏఆర్ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు పాల్గొన్నారు.

## విషాదం

- వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం
- నెల్లూరు జిల్లాలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- వెలిగండ్ల మండల వాసులు ఇద్దరు మృత్యువాత
- శుభకార్యాలకు వచ్చి వెళ్తుండగా దుర్ఘటన
- కనిగిరి వద్ద ఆటోను కారు ఢీకొట్టడంతో ఇరువురి మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం



కనిగిరి సమీపంలో ఆటోను కారు ఢీకొట్టిన ప్రమాదంలో మృతిచెందిన విష్ణునారాయణ

వెలిగండ్ల/కనిగిరి, మే 19 : అర్ధరాత్రి.. అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా దడేల్‌మని పెద్దశబ్దం.. కళ్లు తెరిచి చూసేలోపు కేకలు, అరుపులు.. కాపాడామని ఆర్తనాదాలు.. బస్సు నిండా క్షతగాత్రులు.. నెల్లూరు జిల్లా కోవూరు మండల పరిధిలోని గంగవరం రోడ్డు సమీపంలో ఆర్టీసీ బస్సు టైరు పక్చర్ అయి అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొన్న సమయంలో అక్కడ నెలకొన్న పరిస్థితి ఇదీ. ఈ ప్రమాదంలో వెలిగండ్ల మండలానికి చెందిన ఇద్దరు వలస కూలీలు మృతి చెందారు. గన్నవరం గ్రామానికి చెందిన వేమవరపు మరియమ్మ (46), కంకణంపాడుకు చెందిన వేమవరపు డేవిడ్ (50), ఆయన భార్య విశ్రాంతమ్మ చెన్నైకు వలస వెళ్లి అక్కడ కూలీలుగా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం గ్రామాల్లో జరిగిన వేర్వేరు శుభకార్యాలకు వీరు హాజరయ్యారు. శనివారం చెన్నైకు తిరుగుప్రయాణమయ్యారు. రాత్రి 8 గంటలకు వెలిగండ్లలో ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సు నెల్లూరు జిల్లా గంగవరం రోడ్డు సమీపంలోకి వెళ్లే సరికి రాత్రి ఒంటి గంట సమయంలో టైరు పక్చర్ అయ్యింది. దీంతో అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మరియమ్మ, డేవిడ్ అక్కడికక్కడే మృతి చెందారు. డేవిడ్ భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మరో 10 మందికి గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 47 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది.



ప్రమాదంలో గుల్లయిన బస్

### ఇద్దరు ప్రాణాలు తీసిన అతివేగం..

కనిగిరి : కారు డ్రైవర్ అతివేగం ఇద్దరి ప్రాణాలను తీసింది. మరో ఇద్దరి పరిస్థితిని విషమంగా మార్చింది. ఆదివారం తెల్లవారుజామున కనిగిరి సమీపంలోని దేవాంగనగర్ వద్ద ఆటోను కారు ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. పట్టణ సమీపంలోని కాశిరెడ్డికాలనీకి చెందిన బత్తుల విష్ణునారాయణ (57), అమ్మనబ్రోలు కస్తూరి (25)తోపాటు రామకృష్ణ, గుండ్లతోటి గురవమ్మలు ఆటోలో కనిగిరి నుంచి పొదిలి రోడ్డులో తమ ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈక్రమంలో పొదిలి వైపు నుంచి కనిగిరి వస్తున్న కారు డ్రైవర్ మలుపు వద్ద అతివేగాన్ని నియంత్రించలేక ఎదురుగా రోడ్డుకు రెండో వైపు వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విష్ణునారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. కస్తూరి రెండు కాళ్లూ విరిగిపోయాయి. ఛాతిపైన తీవ్రంగా ఒత్తిడై ఆమె పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు రామకృష్ణ, గురవమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. కారులో ఉన్న బెలూన్‌లు తెరుచుకోవడంతో డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డారు. కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు.



విష్ణునారాయణ (ఫైల్)



డేవిడ్(ఫైల్)



మరియమ్మ(ఫైల్)

# కొండెక్కిన కోడి ధర !

**ఒంగోలులో కిలో రూ.310**

**ఎండల తీవ్రతతో తగ్గిన కోళ్ల ఉత్పత్తి**

**ముందు ముందు ఇంకా ధరలు పెరిగే అవకాశం**

ఒంగోలు (కలెక్టరేట్), మే 19 : కోడి మాంసం ధర కొండెక్కింది. కిలో రూ.310కి చేరింది. గత ఆదివారం స్కిన్ లెస్ కిలో రూ.270 వరకూ ఉండగా ఇప్పుడు రూ.40 పెరిగింది. ఎండల తీవ్రతతో ఫారాల్లో కోళ్ల పెంపకం తగ్గిపోయింది. అదేసమయంలో కోడి పిల్లలు చనిపోతున్నాయి. ఉత్పత్తి తగ్గిపోవడం, కొనుగోళ్లు పెరగడం ధరల పెరుగుదలకు కారణమైంది. మన జిల్లాకు నెల్లూరు, చిలకలూరిపేట, గుంటూరు నుంచి ఎక్కువగా కోళ్ల దిగుమతి అయ్యేవి. ప్రస్తుతం అక్కడ నుంచి సరఫరా తగ్గిపోయింది. రాజమండ్రి, విజయవాడ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణా ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. ఇది కూడా ధరల పెరుగుదలకు ఒక కారణమని వ్యాపారులు అంటున్నారు. మరో పక్షం రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని, ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వారు చెప్తున్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో రాణించిన శ్రీప్రతిభ విద్యార్థులు



విద్యార్థినులను అభినందిస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

ఒంగోలు(విద్య), మే 19: ఆలిండియా జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించి తమ సత్తా చాటారు. ఆదివారం విడుదలైన ఈ ఫలితాల్లో వెన్నా జయానందరెడ్డి 14వ ర్యాంకు, ఘట్టమనేని వీణహితసాయి 37వ ర్యాంకు, కండ్లగుంట పూజ 56, తోట వెంకటఅవినాష్‌నాయకుడు 70, పుట్లూరి గోవర్ధన్ 71, డి.శ్రీవర్ధన్‌రెడ్డి 81, ఉండేల నాగేంద్రరెడ్డి 82వ ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. అలాగే 143, 182, 290, 299, 310, 384, 411, 440, 453, 479 ర్యాంకులతో పాటు 23 మంది 500లోపు ర్యాంకులు, 50 మంది వెయ్యిలోపు ర్యాంకులు, 49 మంది 2వేలలోపు ర్యాంకులు, 177 మంది మూడువేల లోపు, 212 మందికి నాలుగువేల లోపు, 237 మంది 5వేలలోపు ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్‌నారాయణ అభినందించారు.

## టీఎస్ ఎంసెట్‌లో సత్తా చాటిన 'శ్రీప్రతిభ'

ఒంగోలు(విద్య), మే 19 : తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీప్రతిభ విద్యా సంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఎంపీసీ విభాగంలో వడ్లమూరి నందినిచౌదరి 3,203 ర్యాంకు, ఆర్.మహేష్‌చౌదరి 3,670, ఎస్.వెంకటతరుణ్‌కృష్ణ 3,934, జి.మోహితసాయి 4,978, టి.వెంకటఅవినాష్‌నాయకుడు 6,465, కె.ప్రణతి 8,523 ర్యాంకులు సాధించారు. తొమ్మిది మంది పదివేల లోపు, 15 మంది 15వేలలోపు, 23 మంది 20వేలలోపు, 43 మంది 30వేలలోపు, 55 మంది 40వేల లోపు ర్యాంకులు సాధించారు. బైపీసీ విభాగంలో సీహెచ్.హరిబాబు 3084, బి.పూర్ణిమ 9,542 ర్యాంకు సాధించగా, మరో ఇద్దరు 10వేల లోపు, ఆరుగురు 15వేల లోపు, ఏడుగురు 20వేల లోపు ర్యాంకులు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదివారం స్థానిక శ్రీప్రతిభ విద్యాసంస్థలో చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్‌నారాయణ అభినందించారు.

## ఘనంగా ఆరాధనోత్సవాలు

నాగులుప్పలపాడు, మే 19: నాగులుప్పలపాడులోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆరాధనోత్సవాలలో భాగంగా ఆదివారం నాగేంద్రస్వామి వారికి పలు అభిషేకాలు చేశారు. రాత్రికి వీరబ్రహ్మేంద్రస్వామి వార్లను పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తుల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

టంగుటూరు, మే 19 : వారంతా మూడు దశాబ్దాల నాడు విడిపోయిన బాల్యమిత్రులు, ఎక్కడెక్కిడికో వెళ్లారు. ఉన్నత చదువుల చదివారు. కొందరు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇంకొందరు వ్యాపారాల్లో ఉన్నారు. అలాంటి వారందరూ చదువులమ్మ ఒడికి ఆదివారం మళ్లీ చేరారు. టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1991-96 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సుమారు 180 మందిలో 100మంది విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. వీరంతా గత ఏడాది ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఒక ఆలోచనకు వచ్చారు. తమలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆరోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ఉమ్మడి వేదిక తరపున రూ.25వేలు సాయం అందించాలని నిర్ణయించారు. అలాగే టంగుటూరులోనే ఒక కంప్యూటర్ సెంటర్ ప్రారంభించి నిరుద్యోగులకు అండగా నిలిచారు. ఆదివారం నాటి కలయిక సందర్భంగా ఆ కంప్యూటర్ సెంటర్లో కోర్సులు నేర్చుకున్న వారందరికీ ఉమ్మడి వేదిక తరపున సర్టిఫికెట్లు అందించారు. మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులందరూ తీర్మానించుకున్నారు.

## రైల్వే ట్రాక్‌పైకి పశువులు రాకుండా చూడాలి

మార్కాపురం రూరల్, మే 19: రైల్వే ట్రాక్‌పైకి పశువులు రాకుండా పశువుల యజమానులు జాగ్రత్తలు తీసు కోవాలని నరసరావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పశువుల యాజమానులకు సూచించారు. ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ సత్యహరి ప్రసాద్ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వేట్రాక్‌పై సంచరిస్తూ రైలు కింద పశువులు పడితే యజమానులపై రైల్వే యాక్ట్ ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సీఐ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. పశువుల యజమానులకు పలు సూచనలు చేశారు. పశుపోషకుల నిర్లక్ష్యంతో గత వారం రోజుల్లో 20 గేదెలు మృతి చెందాయన్నారు. కార్యక్రమంలో మార్కాపురం ఆర్పీఎఫ్ కానిస్టేబుల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చెస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

పొదిలి, మే 19: ఒంగోలులో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో పొదిలికి చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచారు. అండర్-7 ఓపెన్ విభాగంలో ఏపీజీబీ మేనేజర్ సునీల్‌గుప్త కుమార్తె పాన్యశ్రీవల్లి, కుమారుడు విఙ్ఞేష్‌గుప్తలు రజిత పతకాలను సాధించారు. గతంలోనూ వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో చిన్నారులు జిల్లాస్థాయిలో పతకాలు సాధించినట్లు తండ్రి సునీల్‌గుప్త తెలిపారు. పతకాలు సాధించిన చిన్నారులను అభినందించారు.

## ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా శ్రీనివాసులు

గిద్దలూరు, మే 19 : ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా గిద్దలూరుకు చెందిన వై.శ్రీనివాసులు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే జిల్లా అదనపు కార్యదర్శిగా ఎస్.హెచ్.కబీర్‌ను జిల్లాశాఖ ఉపాధ్యక్షులుగా టి.పాండురంగ స్వామి, జిల్లా కార్యదర్శిగా జి.పాండు, జిల్లా అకాడమిక్ కమిటీ సభ్యులుగా డి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారని ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షులు బి.దేవసహాయం, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీనివాసులు తెలిపారు.

## ధ్యానయోగాతో రుగ్మతలు దూరం

పొదిలి, మే19: ప్రతిరోజు ధ్యానయోగా సాధన చేయడం ద్వారా అనేక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని ధ్యాన గురువు సౌజన్య చెప్పారు. పొదిలిలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తూరు, పాతూరులలోని సాయిబాబా దేవాలయంలో ఉచిత ధ్యానయోగ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ధ్యానంతో మనసు ఉత్తేజమవుతుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసులు, వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

# చెత్త తయారీ కేంద్రాలకు గ్రహణం

**పలు గ్రామాల్లో నిరుపయోగంగా మారిన వైనం ● తుప్పుపట్టిన ఆటో రిక్షాలు ● పట్టించుకోని అధికారులు, స్థానిక పాలకులు**



మద్దిపాడులో నిరుపయోగంగా మారిన చెత్తసంపద కేంద్రం



ఎంపీడీవో కార్యాలయం వద్ద తుప్పుపట్టిన ఆటో రిక్షాలు

మద్దిపాడు, మే 19: మద్దిపాడు మండలంలోని చెత్త తయారీ కేంద్రాలకు గ్రహణం పట్టింది. గత ఐదేళ్లుగా ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా ట్రై సైకిళ్లు, చెత్తను సేకరించే ఆటోలు నిరుపయోగంగా మారాయి. ఉన్నత లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించిన చెత్త సంపద కేంద్రాలను గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోటంతో అవి దుస్థితికి చేరుకున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కావడంతో పాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరాలనే లక్ష్యంతో గత తెలుగుదేశం ప్రభుత్వం వీటిని ప్రారంభించింది. ఈ మేరకు మండలంలో 10 కేంద్రాలను ఏర్పాటుచేసి శరవేగంగా పనులు జరిపారు. ఇప్పటి వరకు 6 కేంద్రాలు పూర్తికాగా మిగతావి నిర్మాణంలో ఉన్నాయి. చెత్త తయారీ కేంద్రాలకు గ్రీన్ వలంటీర్లను నియమించారు. గ్రామాల్లో ఉన్న చెత్తను రిక్షాలకు వేసుకొని చెత్త సంపద కేంద్రాల్లో వర్మి కంపోస్ట్ తయారీ చేయడం ప్రధాన లక్ష్యం. కాగా ప్రస్తుతం నందిపాడు గ్రామంలో చెత్త సంపద కేంద్రాలు పిచ్చి మొక్కలు మొలిచి నిరుపయోగంగా ఉండగా, గుండ్లాపల్లిలో చెత్త సంపద కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మరికొన్ని గ్రామాల్లో కేంద్రాలు అసలు వినియోగంలో లేవు. ఫలితంగా అవి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. చెత్త సంపద కేంద్రాల్లో పనిచేసే సిబ్బందికి గత ఆరు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా కేంద్రాలకు లక్షలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన ట్రైసైకిళ్లు, ఆటో రిక్షాలు నిరుపయోగంగా మారి మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయం దగ్గర తుప్పుపట్టి పోతున్నాయి.

**వర్మీ కంపోస్ట్ తయారు చేయాలి**
**- బాపట్ల వెంకటేశ్వర్లు, మద్దిపాడు**



సేకరించిన చెత్తతో చెత్త సంపద కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్ట్ తయారు చేసి కిలో రు.10కి రైతులకు అందజేయాలి. తద్వారా వచ్చిన ఆదాయాన్ని గ్రామ అభివృద్ధికి ఉపయోగించాలి. ఇందుకోసం ప్రభుత్వం తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలి.

**ఆటో రిక్షాలకు మరమ్మతులు చేయాలి**
**-దేవబత్తిన ప్రసాద్, కొలచనకోట**



చెత్త సంపద కేంద్రాలకు తెలుగుదేశం ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆటోలు ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రస్తుతం మూలనపడి ఉన్నాయి. వాటిని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి. దాదాపు రూ.30లక్షలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన ఆటోలను ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూలన పడేశారు. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

# సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి : సీపీఎం



ఒంగోలులో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కూనంనేనివారిపాలెంలో నాయకుల నివాళి

ఒంగోలు(కలెక్టరేట్), మే 19: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాలా అంజయ్య పిలుపునిచ్చారు. ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో ఆదివారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంజయ్య మాట్లాడుతూ చిన్న వయస్సులోనే కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చి సైమన్ కమిషన్‌కు వ్యతిరేకగా మద్రాసులో జరిగిన పోరాటంలో సుందరయ్య పాల్గొని జైలుకు కూడా వెళ్ళారన్నారు. జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్ మాట్లాడుతూ సుందరయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జీవీ.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, టి.తిరుపతిరావు, బి.రఘురాం, పి.కల్పన, కె.రమాదేవి, జి.రమేష్, తంబి శ్రీను, దామా శ్రీనివాసరావు, మహేష్, హుస్సేన్, ఎల్వీ.ప్రసాదరావు, కేఎఫ్.బాబు, వినోద్ పాల్గొన్నారు.

**ఉప్పుగుండూరులో..**

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జయంత్‌బాబు, తూబాటి శ్రీకాంత్, జి.బసవపున్నయ్య, యు.వెంకటేశ్వరు, కె.సుబ్బారావు, కోటేశ్వరరావు, రావెళ్ళ వెంకటరావు, యు.శ్రీను, రామాంజనేయులు పాల్గొన్నారు.

**కూనంనేనివారిపాలెంలో..**

చీమకుర్తి: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆయనకు కూనంనేనివారిపాలెంలో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న రహదారుల మలుపుల వద్ద సీపీఎం నాయకులు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, బెజవాడ శ్రీనివాసరావు, రావూరి వెంకట్రావు, పమిడి రామారావు, సుబ్బారావు, కొల్లూరి అక్కయ్య, నల్లూరి కృష్ణయ్య, కొల్లూరి వెంకటేశ్వర్లు, పొత్తూరి సురేష్, బసవయ్య పాల్గొన్నారు. అలాగే చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన వేడుకల్లో సుందరయ్యకు ఘనంగా నివాళులర్పించారు. మండల కార్యదర్శి పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**టంగుటూరులో..**

టంగుటూరు : నిరంతరం ప్రజా పోరాటాలలో నిమగ్నమై, ప్రజలే తన జీవితంగా బతికిన ప్రజల మనిషి పుచ్చలపల్లి సుందరయ్యని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాము చెప్పారు. సుందరయ్య వర్ధంతి టంగుటూరులో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో నాయకులు ఏసుపోగు మోజెస్, టి. వెంకట్రావు, కొల్లాబత్తిన శ్రీను, ఎం. యానాది, ముక్క శ్రీను, టి.పాపారావు, గడ్డం సాల్మన్, సిహెచ్. మాధవ, కాలేషాబేగ్, ప్రభాకర్ పాల్గొన్నారు.



టంగుటూరులో మాట్లాడుతున్న రాము

సమసమాజ స్థాపనకు పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని అంకితం చేశారని సీపీఎం మండల కన్వీనర్ ఏసుపోగు మోజెస్ చెప్పారు. సుందరయ్య 39వ వర్ధంతిని మండలంలోని పొందూరులో ఆదివారం సీపీఎం ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. తొలుత నాయకుడు బాలకోటయ్య ఎర్రజండా ఎగురవేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ కార్యదర్శి వేజండ్ల సింగయ్య, నాయకులు వెంకటేశ్వర్లు, ప్రసాద్, యేసుదాస్, సుధాకర్ సాగర్, నాగరాజు, పిచ్చిబాబు పాల్గొన్నారు.





నగర శివారు ప్రాంతంలో కనువిందు చేస్తున్న తెల్లటి మేఘాలు

## వేసవిలో..వెండి మబ్బులు..!



మండు వేసవిలో ఎండల తీవ్రతతో ప్రజలు అల్లాడిపోగా, ఇటీవల కురుసిన కొద్దిపాటి వర్షాలకు ప్రజలు కాస్త సేద తీరారు. దీంతో వాతావరణం కూడా ఆహ్లాదంగా మారింది. అయితే గత రెండు రోజులుగా పగటి సమయంలో కాసేపు ఎండ కాసినా, ఆకాశంలో తెల్లటి మబ్బులు పరుగులు తీస్తూ నగరవాసులను కనివిందు చేస్తున్నాయి.

- ఒంగోలు, ఆంధ్రజ్యోతి

# యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

**● చోద్యం చూస్తున్న అధికారులు**

గిద్దలూరు, మే 19 : నియోజకవర్గంలో మట్టి మాఫియా చెలరేగుతోంది. వారు విదిల్చే కాసుల కు ప్రభుత్వ అధికారులు కక్కుర్తి పడుతున్నారు. దీంతో మట్టిని అక్రమంగా తరలించే అక్రమార్కులకు బ్రేకులు వేసేవారే కనిపించడం లేదు. రాచర్ల మండలంలోని యడవల్లి పెద్దచెరువు నుంచి ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వి తీసుకొని వెళుతున్నారు. ఇటుకల బట్టీలలో వాడేందుకు, రియల్‌ఎస్టేట్ వెంచర్లలో రోడ్లు వేసేందుకు ఈ మట్టి ఉపయోగ పడుతుండడంతో చెరువులోని మట్టిని ఎక్కడపడితే అక్కడ ఎక్సకవేటర్లతో తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే కొమరోలు మండలంలోని పలు చెరువుల నుంచి కూడా అక్రమార్కులు మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. రెడ్డిచెర్ల చెరువులో కూడా ఇటీవల అక్రమ మట్టి తవ్వకాలు విపరీతంగా జరిగాయి. గిద్దలూరు ప్రాంతంలో కొండలను కొల్లగొట్టి గ్రావెల్‌ను బయటకు తీసి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి అందులో వీఆర్‌వోలు, వీఆర్ఏలు, గ్రామ కార్యదర్శులు, పోలీసులు గ్రామస్థాయలోనే ఉంచినప్పటికీ మట్టి తవ్వకాలు మాత్రం బహిరంగంగా జరుగుతున్నప్పటికీ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఫిర్యాదులు వస్తే ఒకటిరెండు ట్రాక్టర్లను సీజ్ చేసి ఫైన్ వేసి చేతులు దులుపుకుంటున్నారు. అక్రమార్కులకు స్థానిక వైసీపీ నేతల అండదండలు ఉండడంతో ప్రభుత్వ సిబ్బంది కూడా ఇచ్చిన కాడికి పుచ్చుకొని తమకెందుకులే అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. దానికి తోడు ఎన్నికల వేళ కావడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రెవిన్యూ అధికారులు ఎన్నికలు కాగానే తాము ఎలాగూ బదిలీ అవుతారు కాబట్టి ఈ సమయం లో ఇటువంటి పంచాయతీలు మనకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. తమకు ఎన్నికల విధులు ఉన్నాయంటూ ఫిర్యాదులను దాటవేస్తున్నారు. ఇదే అదునుగా మట్టి మాఫియా రెచ్చిపోయి విచ్చలవిడిగా చెరువుల్లో, కొండ తిప్పల్లో మట్టిని అక్రమంగా తవ్వుతూ అమ్ముకుంటూ సొమ్ము చేసుకొంటోంది.



యడవల్లి పెద్దచెరువులో మట్టిని తవ్వుతున్న ఎక్సకవేటర్



చెరువులోని మట్టిని తీసుకుని వెళుతున్న ట్రాక్టర్

## అవీ..ఇవీ..

### న్యాయం చేయండి సారూ..!

**● ఎస్పీకి మొరపెట్టుకున్న బాధితుడు**



ఎస్పీకి సమస్యను వివరిస్తున్న బాధితుడు

ఒంగోలు (క్రైం), మే 19 : తనకు పోలీసులే అన్యాయం చేశారని, న్యాయం చేయాలని ఎస్పీ గరుడ్ సుమిత్ వద్ద బాధితుడు వాపోయాడు. ఆదివారం సాయంత్రం స్థానిక సాగర్ సెంటర్‌లో మాక్ డ్రిల్ జరుగుతున్న సందర్భంగా వినుకొండ సుబ్బయ్య అనే బాధితుడు ప్లకార్డు పట్టుకొని ప్రత్యక్షమయ్యాడు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ వద్దకు వెళ్లి 2021లో కనిగిరి పోలీసులు తనకు అన్యాయం చేశారని, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. టింబర్ డిపోను లీజుకు తీసుకొని నడుపుతుండగా యజమానికి మద్దతుగా పోలీసులు వ్యవహరించారని, ఇప్పుడైనా తనకు న్యాయం చేయాలని సుబ్బయ్య కోరారు. పరిశీలించి న్యాయం చేస్తా నని ఎస్పీ హామీ ఇచ్చారు.

### 140మందికి వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాగులుప్పలపాడు, మే 19: ఈదుముడిలో ఆదివారం మన ఈదుముడి సేవా సంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ మల్టీస్పెషాలిటీ వైద్యశాల సహకారంతో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మౌనికారెడ్డి, కుట్టుబోయిన వెంకటేష్, సరయు, పల్లవి 140మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం కావూరి వాసు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ప్రతి నెలా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి మేనేజర్ దాసరి సుధాకర్‌యాదవ్, ఎస్.నాగరాజు, శ్రీనివాసరావు, సభ్యులు మేడా బ్రహ్మయ్య, ఉప్పల వెంకట్రామయ్య, ప్రసాద్, కుర్రా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### క్రిష్ణసాయిలో రక్తదాన శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న శిద్దా వెంకటేశ్వరరావు

చీమకుర్తి, మే19 : క్రిష్ణసాయి గ్రూపు ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని గ్రానైట్ ఫ్యాక్టరీ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సంస్థ అధినేత శిద్దా వెంకటేశ్వరరావు ఈ శిబిరాలను ప్రారంభించారు. రక్తదానం చేసిన వారిని అభినందించారు. తన పుట్టినరోజును పురస్కరించుకొని కంపెనీ ఉద్యోగులకు బోనస్‌ని ప్రకటించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రహదారి వెంట చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శిద్దా భరత్, ఉదయ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

### మోటార్‌సైకిలిస్టుకు గాయాలు

మద్దిపాడు, మే 19: మోటార్‌సైకిల్ అదుపుతప్పి ఒకరికి గాయాలైన సంఘటన ఆదివారం మద్దిపాడు మండలం గుండ్లాపల్లి బ్రిడ్జి సమీపంలో జరిగింది. అద్దంకి వైపు నుంచి ఒంగోలు వెళ్తున్న మోటార్‌సైకిల్ కారును అధిగమించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్ నడుపుతున్న పి.శ్రీనివాసరెడ్డికి గాయాలు కాగా చికిత్స కోసం ఒంగోలులోని వైద్యశాలకు తరలించారు.

### వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మద్దిపాడు, మే 19: మల్లవరంలోని శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అర్చకులు అగ్నిప్రతిష్టాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే పుణ్యాహవచనం, వాస్తు శుద్ధి, నిత్యహోమం, ధ్వజారోహణ, గరుడప్రసాదం కార్యక్రమాలను అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖర్‌ఆచార్యులు, కొండూరి శ్రీనివాసరాఘవ అయ్యంగార్‌లు చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ ఈవో దామా నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

### సీసాలకు, క్యాన్లకు పెట్రోల్ పోస్తే చర్యలు : ఎస్ఐ

మద్దిపాడు, మే 19: పెట్రోల్ బంకు యజమానులు ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు సీసాలకు, క్యాన్లకు పెట్రోల్, డీజిల్ ప్రత్యేకంగా పోస్తే ఆయా బంకుల లైసెన్సులు రద్దు చేస్తామని ఎస్ఐ మహేష్ ఆదివారం పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని ఆయన చెప్పారు. అంతేకాకుండా పౌరసరఫరాల శాఖ సైతం మండలంలోని అన్ని పెట్రోల్ బంకులకు నోటీసులు జారీ చేసిందన్నారు. మండలంలో కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నలుగురు కన్నా ఎక్కువ గుమికూడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ఎన్నికలపై బెట్టింగ్‌లకు పాల్పడిన వారి మీద సైతం కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

### భక్తురాలికి ప్రశంస



జ్ఞాపికను అందజేస్తున్న గణపతి సచ్చిదానందస్వామి

ఒంగోలు (కల్చరల్), మే 19 : ఒంగోలుకు చెందిన యక్కల కళ్యాణిని మైసూర్ దత్తపీఠం శ్రీగణపతి సచ్చిదానంద స్వామి ప్రశంసించి గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని ఆదివారం అందజేశారు. ఒంగోలు మాజీ మున్సిపల్ చైర్మన్ యక్కల తులసీరావు తమ్ముడు యక్కల హరనాథ్‌బాబు భార్య కళ్యాణి స్వామీజీ సన్నిధిలో భగవద్గీత 18 అధ్యాయాలు కంఠస్తంగా చెప్పారు. ఇందుకు ఆనందించిన స్వామీజీ ఆమెకు ఆశీస్సులను అందజేశారు.

### జవహర్ నవోదయలో నూరుశాతం ఉత్తీర్ణత

ఒంగోలు(విద్య), మే 19: ఒంగోలులోని పీఎం శ్రీజవహర్ నవోదయ విద్యాలయంలో పదో తరగతి, 12వ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రామిరెడ్డి ఆదివారం తెలిపారు. పదో తరగతిలో 76 మంది, 12వ తరగతిలో 34 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. పదవ తరగతిలో 500 మార్కులకు బి.ఝాన్సీలక్ష్మి ప్రథమ స్థానంలో నిలువగా, ఎస్.యశ్వస్విని, జహ్నవిలు తర్వాత స్థానంలో నిలిచారు. 12వతరగతిలో యామిని, నాగలక్ష్మి ప్రథమ స్థానం, గీతాంజలి, జయకర్‌లు తర్వాత స్థానాల్లో నిలిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాకులను రామిరెడ్డి అభినందించారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపులో 11వ తరగతిలో చేరేందుకు ఈనెల 20వతేదీ చివరి తేదీ అని ఆయన తెలిపారు. 11వ తరగతిలో మిగిలిన సీట్లను ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత సాధించిన వారితో భర్తీ చేస్తామన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సీనియర్ అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు అభినందించారు.

### సామాన్యులకు చట్టంపై పరిజ్ఞానం అవసరం



మాసపత్రికను ఆవిష్కరిస్తున్న సాహిత్యవేత్తలు

ఒంగోలు (కల్చరల్), మే 19 : దేశంలో ధనిక, పేద తారతమ్యం లేకుండా అమలులో ఉన్న చట్టాలపై సామాన్యులకు సైతం పరిజ్ఞానం కలిగి ఉండటం అవసరమని ఓపీడీఆర్ నాయకులు చావల సుధాకర్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా గ్రంథాలయంలో చట్టం న్యాయం మాసపత్రికను గ్రంథాలయ అధికారులు, ఇతర సాహిత్యవేత్తలతో కలిసి సుధాకర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పత్రిక ద్వారా ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన కల్పించటం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. విశ్రాంత న్యాయశాస్త్ర ప్రొఫెసర్ కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ నల్సా, సల్సా, జిల్లా న్యాయసేవ అధికార సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ పౌరవ్యవస్థ సైతం ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. విశ్రాంత సబ్‌కలెక్టర్ పి.పేరయ్య మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరణం రాఘవ రావు, ఐ.నరసింహారావు, ఆంజనేయులు, జాలాది మోహన్, బొమ్మల కోటేశ్వరి, మేడికొండ జార్జి, అంకయ్య, శ్రీకృష్ణ పాల్గొన్నారు. ఇక గ్రంథాలయ వేసవి శిక్షణ తరగతులలో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

# నిల్వ చేయలేం ..అమ్ముకోలేం..!

» తగ్గిన మిర్చి ధరలు

» గుంటూరు యార్డ్‌కు సెలవులు

» సిండికేట్ అవుతున్న వ్యాపారులు

» అకాల వర్షాలతో దిక్కుతోచని స్థితిలో రైతులు


ఓ కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసేందుకు ట్రాక్టర్‌లో తెచ్చిన మిర్చి టిక్కీలు

చీరాల, మే 19 : ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డ్ నడవడం లేదు. యార్డ్‌కు వార్షిక సెలవులు ప్రకటించారు. ఈ క్రమంలో ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా మారారు. ధరలను నియంత్రిస్తున్నారని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటను నిల్వ చేయలేం. విక్రయించలేమని వాపోతున్నారు. పర్చూరు, ఇంకొల్లు ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీలలో ఆర్థిక పరిపుష్టి ఉన్నవారు నిల్వ చేస్తున్నారు. మిగిలినవారు అయినకాడికి తెగనమ్ముతున్నారు. ఈ పరిస్థితులను ప్రైవేటు వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దీంతో అన్ని రకాల మిర్చి ధరలు సగానికి సగం దిగజారాయి. విక్రయించలేం.. నిల్వ ఉంచలేమని రైతులు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయం నిలకడగా ఉండటం లేదు. ఎప్పుడు ఏ పంటకు గిట్టుబాటు ధర ఉంటుందో అర్థం కాని పరిస్థితి. గతేడాది మిర్చి ధరలు ఒకింత ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది సుమారు 20వేల హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. సాగు తొలినాళ్లలో ప్రతికూల పరిస్థితుల ఎదురయ్యాయి. ఆ తరువాత తెగుళ్ల బెడదతో పెట్టుబడులు పెరిగాయి. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వేల ఎకరాల్లో మిర్చి పైరు దెబ్బతింది. మిగిలిన పైరుకు బెట్టకొచ్చిన సమయంలో తడులు ఇచ్చేందుకు సాగుదారులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. ఎండు మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండడంతో సాగుదారులు అప్పుచేసి మరీ పెట్టుబడులకు వెనకడుగు వేయకుండా ముందుకు సాగారు.

### కోతల తొలినాళ్లలో ఆశాజనకంగా ధరలు

ఎండు, పచ్చి మిర్చి ధరలు పంట చేతికొచ్చే సమయానికి ఆశాజనకంగా ఉన్నాయి. ప్రైవేటు వ్యాపారులు కూడా పోటీపడి కళ్లాల్లోనే ఎండుమిర్చిని కొనుగోలు చేశారు. తేజ, బాడిగ, సూపర్ టెన్ తదితర రకాలు రకాన్ని బట్టి క్వింటా రూ.10వేల నుంచి రూ.30వేల వరకు ధర పలికాయి. అయితే పూర్తిస్థాయిలో సరుకు చేలల్లో నుంచి వచ్చే సమయానికి ధరలు తగ్గుముఖం పట్టాయి.

### ఆగిన గుంటూరు మిర్చి యార్డ్

ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డ్ నడవటం లేదు. యార్డ్‌కు వార్షిక సెలవులు ప్రకటించారు. దీంతో మిర్చి ధరలు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుతం రకాన్ని బట్టి రూ.9వేల నుంచి రూ.12వేల ధరలు పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ ధరలకు విక్రయించలేక కోల్డ్ స్టోరేజీలలో నిల్వచేయలేక సతమతమవుతున్నారు. ఒకింత చేమెల్లా ఉన్న రైతులు కోల్డ్‌స్టోరేజీలకు తమ సరుకును తరలించారు. తరలిస్తున్నారు. అయితే ఆర్థిక పరిపుష్టి లేనివారు, ప్రస్తుత పెట్టుబడుదులకు డబ్బు అవసరమైనవారు విక్రయిస్తున్నారు.

### సిండికేట్‌గా మారిన వ్యాపారులు

కోల్డ్ స్టోరేజీలలో సరుకును నిల్వ చేసేందుకు అవకాశం లేనివారు, డబ్బు అవసరమైన రైతులు తమ సరకును ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను నియంత్రిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగుదారులకు గిట్టుబాటు ధర లభించేవిధంగా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం యంత్రాంగంపై ఎంతైనా ఉంది.


కోల్డ్ స్టోరేజీలో నిల్వచేసిన మిర్చి టిక్కీలు

### అకాల వర్షం .. అనుకోని నష్టం

నాలుగైదు రోజులుగా అడపాదడపా కురిసిన అకాల వర్షాలతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప చేలల్లో చివరి కోతులు జరుగుతున్నాయి. కళ్లాల్లో కొంత సరుకు ఉంది. అందులో కాయలను గ్రేడ్ చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో నష్టం మూటగట్టుకోవల్సి వచ్చిందని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కనీసం గిట్టుబాటు ధరలు ఉంటే నష్టాలు లేకుండా వచ్చే ఏడాది సాగు చేయగలతామని, లేదంటే సాగుకు స్వస్తి చెప్పాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


పట్టుబడిన మద్యంతో ఎస్ఐ

## రైలులో మద్యం అక్రమ రవాణా

» నిందితుల అరెస్టు

» తెలంగాణకు చెందిన 99 క్వార్టర్ సీసాలు స్వాధీనం

చీరాలటౌన్, మే 19 : రైళ్లల్లో అక్రమ రవాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జీఆర్పీ ఎస్సై కొండయ్య హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైళ్లల్లో ఆదివారం రాత్రి తనిఖీలు చేస్తుండగా చీరాల మరియమ్మ పేటకు చెందిన కొడాలి రాఘవ, కారంచేడుకు చెందిన కనికమళ్ల చిన్నబాబు తెలంగాణ కు చెందిన 99 క్వార్టర్ మద్యం సీసాలు చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో చీరాలకు తరలిస్తు ప్లాట్ ఫాం నెం.3పై పట్టుబడ్డారు. దీంతో వారి వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు. అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## వ్యక్తిపై మందుబాబుల దాడి

● ద్విచక్ర వాహనం లాక్కొని పరార్


చికిత్స పొందుతున్న అనిల్

కొత్తపేట(చీరాలటౌన్), మే 19 : మద్యం మత్తులో వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా ద్విచక్ర వాహనాన్ని కూడా లాక్కుని పరారైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చీరాల సమీపంలోని కొత్తపేట మూడు రోడ్లు సెంటర్‌లో జరిగింది. బాధితుడు రామిశెట్టి అనిల్ తెలిపిన వివరాల ప్రకారం ఇతను ఓ ప్రైవేటు వైద్యశాలలో ఉద్యోగి. లక్ష్మీశ్రీనివాస కాలనీ నివాసం. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మూడు రోడ్లు సెంటర్‌లో మద్యం మత్తులో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టారు. దీంతో కింద పడిన అనిల్ ముఖానికి రక్త గాయాలు అయ్యాయి. వెంటనే పైకి లేచి అనీనిల్ వారిని నిలదీయగా అతడిని బెదిరించి ద్విచక్ర వాహనాన్ని కూడా లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతుండగా పోలీసులు వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే వారిని ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాలటౌన్, మే 19 :గుర్తుతెలియని సుమారు 45 సంవత్సరాలు గల వ్యక్తి మండల పరిధిలోని జాండ్రపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు రైలు కింద పడి మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. అతని ఎడమ చేతిపై విశ్రాంతమ్మ అనే పేరుతో పచ్చబొట్టు ఉంది. ఇతర ఎలాంటి ఆధారాలు లభించలేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

## బాటిళ్లలో పెట్రోల్ నింపితే చర్యలు

పామూరు, మే, 19: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదివారం నుంచి వచ్చేనెల 10వ తేదివరకు వాహనాలకు మాత్రమే అవసరమైన మేరకు పెట్రోల్ నింపాలని పోలీసులు తెలిపారు. ఖాళీ వాటర్ బాటిళ్లు, క్యాన్‌ల్లో పెట్రోల్, డీజిల్ నింపారాదంటు ఎన్నికల కమిషన్ ఆదేశాలప్రకారం పెట్రోల్ బంకు యజమానులకు పోలీసులు హెచ్చరికలు జారిచేశారు. బంకుల నుంచి బాటిళ్లకు, డ్రమ్ములకు, పెట్రోల్ నింపితే చర్యలు తీసుకొంటామని హెచ్చరిస్తూ పెట్రోల్ బంకులవద్ద నోటీసులు అతికించారు. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో వాహనదారులు నిలిచిపోయిన తమ వాహనాల కోసం పెట్రోల్, డీజిల్ బాటిళ్లు తీసుకొని బంకుల వద్దకు వెళ్ళిన వారికి నిరాశ ఎదురవుతుంది. పోలీసుల నోటీసులు చూపిస్తూ పెట్రోల్ ను బాటిళ్లలో నింపబోమని స్పష్టం చేస్తున్నారు.


అయ్యప్పకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి, మిత్రులు

## శబరిమలలో గొట్టిపాటి పూజలు

అద్దంకి, మే 19 : శబరిమలలో అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ స్నేహితులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు రెండు నెలలుగా ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా ఉన్న గొట్టిపాటి మూడు రోజుల క్రితం శ్రీశైలం వెళ్లారు. అనంతరం స్నేహితులతో కలిసి శనివారం సాయంత్రం శబరిమల వెళ్లి అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

## చట్టం దృష్టిలో అందరూ సమానమే

» నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

» ఎస్పీ వకుల్ జిందాల్



చీరాలటౌన్, మే 19 : చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, నేరాలకు పాల్పడితే ఎవ్వరినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఆదివారం ఈపూరుపాలెం, టూటౌన్ పోలీస్ స్టేషన్లను ఎస్పీ జిందాల్ పరిశీలించారు. ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్లపై చర్చించారు. అంతేకాకుండా ఎన్నికల నేపథ్యంలో నమోదయిన కేసులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దాదాపుగా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అయితే ఆ సమయంలో కొన్నిచోట్ల ఏర్పడిన సమస్యలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. కౌంటింగ్ సమయంలో కూడా అల్లర్లు జరిగే అవకా శం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు. పదేపదే కేసుల్లో ఉన్నవారిని జిల్లా నుంచి బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ బేతపూడి ప్రసాద్, ఎస్పీ సిఐ మల్లికార్జునరావు, స్థానికల సీఐలు సోమశేఖర్, శేషగిరిరావు, సత్యనారాయణ, ఎస్సైలు ఇతర సిబ్బంది ఉన్నారు.

## గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మే 19: పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గుంటి గంగా భవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో భక్తులతో సందడిగా మారింది. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వర శర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మిలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎం.భాస్కర్ రెడ్డి కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఆలయంలో లలితాసహస్రనామ పూజలు జరుగనున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో కార్తిక్ కోరారు.


విశేష అలంకారంలో గంగమ్మ తల్లి

## ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

కనిగిరి, మే 19: బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు సందర్భంగా స్థానిక దొంతులమ్మ దేవాలయంలో ఆదివారం పోలేరమ్మ తిరునాళ్ల నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి పొంగళ్ల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విశేష అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి పోలేరమ్మకు పొంగళ్ళు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వీరబ్రహ్మేంద్ర స్వామి, పోలేరమ్మ ఉత్సవ విగ్రహాలను నగర పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, నృత్యభజనలు, వివిధ దేవతామూర్తుల వేషధారణలతో ఊరేగింపులో జరిగిన నృత్యరూపకాలు పురప్రజలను అలరించాయి. మేళతాళలతో, తప్పెట్లతో అమ్మవారి ఊరేగింపు రావటంతో ప్రజలు పారవేట పోసి హారతులిచ్చారు. ఆలయకమిటీ భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


విశేష అలంకారంలో గంగమ్మ తల్లి


కంకణాలపల్లిలో నేలమట్టమైన బొప్పాయి తోట


వర్షపు నీటితో కళకళలాడుతున్న కంకణాలపల్లి చెరువు

## త్రిపురాంతకంలో గాలివాన బీభత్సం

పడిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్

నేలమట్టమైన బొప్పాయి, అరటి తోటలు

రేకుల ఇల్లుపై కూలిన రైస్ మిల్లు ప్రహరీ గోడ

త్రిపురాంతకం, మే 19: మండలంలోని పలుగ్రామాల్లో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వీచిన గాలులకు, కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. బొప్పాయి, అరటి తోటలు నేలమట్టమయ్యాయి. త్రిపురాంతకంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని రైస్‌మిల్లు గోడకూలి పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడడంతో ఇళ్లు పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న వృద్ధురాలికి అదృష్టవశాత్తు ఏమీ కాలేదు. కంకణాలపల్లిలో ప్రధాన రహదారిపై విద్యుత్‌స్తంభం మధ్యలోకి విరిగి తీగలతో సహా రోడ్డుపై వాలింది. పొలాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలవాలాయి. సోమేపల్లి, కంకణాలపల్లి గ్రామాల పరిధిలో నేలవాలిన సుమారు 50 స్తంభాలు, ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లను ఇన్నటివరకు గుర్తించామని, వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని విద్యుత్ ఏఈఈ సురేష్‌రెడ్డి తెలిపారు. కంకణాలపల్లిలో వర్షం, గాలుల దాటికి తొమ్మిది ఎకరాలలోని బొప్పాయి తోటలు పూర్తిగా నేలవాలాయని రైతులు బత్తుల గురవయ్య, దద్దాల రమణయ్య, బైలడుగు ఎల్లయ్యలు తెలిపారు. ఎకరానికి సుమారు మూడు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయారు. ఒడ్డుపాలెంలో మహిళా రైతు భీమిశెట్టి యోగమ్మ సాగు చేసిన రెండెకరాల అరటితోట నేలవాలింది. కాగా నష్టపోయిన పంటలను వీహెచ్ఏ నాగజ్యోతి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా ఈ వర్షంతో కంకణాలపల్లి చెరువుకు నీరుచేరి జలకళ సంతరించుకుంది. వర్షం గాలుల ప్రభావంతో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలవాలడంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.


మధ్యలోకి విరిగి రోడ్డుకు అడ్డంగా ఒరిగిన విద్యుత్ స్తంభం

## నిర్మాణానికి నోచని నడిమి వాగు వంతెన

ఇబ్బందిపడుతున్న ఆరికట్లవారిపాలెం గ్రామస్థులు


ఆరికట్లవారిపాలెం, చందలూరు మధ్య నడిమి వాగుపై కూలిన వంతెన

పంగులూరు, మే 19 : నడిమి వాగుపై కూలిన వంతెనను తిరిగి నిర్మించలేదు. దీంతో రాకపోకలకు ఆరికట్లవారిపాలెం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం గ్రామం నుంచి చందలూరు వైపు వెళ్లే రహదారిలో దశాబ్దకాలం కిందట వరద తాకిడికి నడిమి వాగుపై వంతెన కూలిపోయింది. నాటి నుంచి వంతెన నిర్మాణం జరగక పోవడంతో వంట పొలాలలో పనులు చేసుకునేందుకు గ్రామ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి దక్షిణం వైపున వాగుకి ఎగువ భాగంలో ఉన్న పొలాలలో పంట సాగు కష్టంగా ఉందని, వ్యవసాయ పనులు చేసుకోవాలన్నా, ఎరువులు తీసుకెళ్లాలన్నా తీవ్ర కష్టాలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘం ద్వారా వ్యవసాయ రుణాల కోసం, స్వయం సహాయక సంఘ మహిళలు బ్యాంక్ రుణాలు పొందేందుకు చందలూరు బ్యాంక్‌కు వెళ్లాలంటే ఈ రహదారే ఆధారం. నడిమి వాగుపై వంతెన కూలడం, దానికి దశాబ్దకాలంగా మరమ్మతులు లేకపోవడంతో రైతులు, మహిళలు పనుల నిమిత్తం పొలాలకు వెళ్లాలన్నా, చందలూరు చేరుకోవాలన్నా రెట్టింపు దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకుంది. పంట సాగు సమయంలో పొలాలకు కూళీలను చేరవేయాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై వంతెనను పునర్ నిర్మిస్తే కూతవేటు దూరంలో పొలాలకు, మూడు కిలోమీటర్ల దూరంలో చందలూరు చేరుకునే అవకాశం ఉంది. తక్షణమే నడిమి వాగుపై వంతెన పునర్ నిర్మించి తమ బాధలు తొలగించాలని గ్రామస్థులు, రైతులు వేడుకుంటున్నారు.

## అధ్వానంగా రక్షిత పథకాలు

- ఐదేళ్లుగా మరమ్మతుల గురించి పట్టించుకోని అధికారులు


పూడిపోయిన దర్శి ఎస్‌పీపీ చెరువు

దర్శి, మే 19: దర్శి నియోజకవర్గంలో రక్షిత మంచినీటి పథకాలు అస్తవ్యస్తంగా మారాయి. గత ఐదేళ్లుగా కనీస మరమ్మతులు కూడా చేయకపోవటంతో నీటి పంపిణీ సక్రమంగా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలం చెల్లిన పైపులైన్లు తరచూ పగిలిపోతూ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ప్రధానంగా దర్శి ఎస్‌పీపీ రక్షిత మంచినీటి పథకం అధ్వానంగా మారింది. 1980లో ఏర్పాటుచేసిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో ఇప్పటివరకు పూడిక తీయలేదు. దీంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. అధికారులు 2540 మిలియన్ లీటర్ల నిల్వ సామర్థ్యం ఉందనే లెక్కలు చెబుతున్నా 40 శాతం మేర అడుగున మట్టి పేరుకుపోవటంతో నీటి నిల్వ తక్కువగా ఉంటుంది. స్కీమ్ పరిధిలో జనాభా రెట్టింపు కావటం, సమ్మర్ స్టోరేజీ నిల్వ సామర్థ్యం తగ్గిపోవటంతో అన్నీ ప్రాంతాలకు సరిపడా నీరు సరఫరా చేయటం లేదు. రెండు రోజులకు కొన్ని గ్రామాలకు, శివారు ప్రాంతాలకు మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్నారు.

### పనిచేయని ఫిల్టర్ బెడ్లు

నీటిని శుద్ధిచేసే ఫిల్టర్‌బెడ్లు పనిచేయటం లేదు. స్కీమ్ నిర్మాణ సమయంలో ఏడు ఫిల్టర్‌బెడ్లు నిర్మించారు. పొరలు పొరలుగా ఇసుక, కంకర తోలి అద్భుతమైన విధానం ద్వారా ఫిల్టర్‌బెడ్లు రూపొందించారు. చాలాకాలం వాటి ద్వారా స్వచ్ఛమైన నీరు ప్రజలకు అందించారు. నిర్ణీత సమయంలో ఇసుకపై పేరుకున్న మట్టిని తొలగించి కొత్త ఇసుకను పోసి మరమ్మతులు చేయాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో గత కొంతకాలంగా ఫిల్టర్‌బెడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. ఇసుక ఫిల్టర్లు పనిచేయకపోవటంతో అధికశాతం గ్రామాలకు రా వాటర్ విడుదల చేస్తున్నారు. ఎంతోకాలం నిల్వ ఉన్న రా వాటర్ తాగలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# స్వామికార్యాలు వద్దు.. స్వకార్యాలే ముద్దు..!

● టీటీడీ కల్యాణ మండపంలో వాణిజ్య కార్యక్రమాలు ● నిబంధనలకు పాతరేసి అద్దెకిచ్చుకుంటున్న సబ్‌కాంట్రాక్టర్




కల్యాణ మండపం పేరు కానరాకుండా ఏర్పాటు చేసినఫ్లెక్సీ

మార్కాపురం, మే 19 : తిరుమల తిరుపతి దేవస్థానం స్థానిక పెద్దల ఆర్థిక సహకారంతో ఎక్కడికక్కడ కళ్యాణ మండపాలు నిర్మించింది. పేద, మధ్య తరగతి హిందువులు శుభకార్యక్రమాలు నిర్వహించుకోవడమే ప్రధాన లక్ష్యం. పేదవర్గాల వారు తక్కువ ఖర్చుతో పెళ్లిళ్ళ, బారసాల తదితర కార్యక్రమాలు జరుపుకోవచ్చు. అంతేకాక హిందూ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు కూడా ప్రాధాన్యత ఉంది. కానీ మార్కాపురంలోని టీటీడీ కళ్యాణ మండపం నిర్వహణ తీరు అందుకు భిన్నంగా ఉంది. ప్రధాన లక్ష్యానికి తూట్లు పొడుస్తూ వాణిజ్య కార్యక్రమాలకు తెరలేపింది. నిబంధనలను మరిచి ప్రైవేటు కళ్యాణ మండపాల తరహాలో శుభ కార్యాలకు అద్దెకిచ్చి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ప్రధాన కాంట్రాక్టర్ దగ్గర సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి మరో అడుగు ముందుకేసి రెండు నెలలుగా ఓ ఎగ్జిబిషన్ సేల్ వారికి అద్దెకిచ్చాడు. సాధారణ ప్రజలు కూడా అటువైపు వెళ్లకుండా ఆంక్షలు విధిస్తూ సబ్ కాంట్రాక్టర్ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడు.

**ప్రజల భాగస్వామ్యంతో నిర్మాణం**

మార్కాపురంలో టీటీడీ ఇక్కడి ప్రజల భాగస్వామ్యంతో 2020లో కళ్యాణ మండపాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. పదుల కోట్లు విలువైన పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలాన్ని 2013లో ప్రజల అవసరార్థం మున్సిపాలిటీ సేకరించి టీటీడీకి అప్పగించింది. అంతేకాక నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉండటంతో టీటీడీ స్థానిక ప్రజల నుంచి సుమారు రూ.30 లక్షలు సేకరించింది. స్థానికంగా అన్ని రాజకీయ పక్షాలు సహక రించడంతో కళ్యాణ మండప నిర్మాణం పూర్తయింది. అనంతరం ఇక్కడి కళ్యాణ మండప నిర్వహణ కోసం టెండర్లు స్వీకరించి కర్నూలు జిల్లాకు చెందిన సుబ్రహ్మ ణ్యం అనే కాంట్రాక్టర్‌కు అప్పగించింది.

**నిబంధనలతో మాకేంటి పని**

వాస్తవానికి టెండర్ దక్కించుకున్న వాళ్లే కల్యాణ మండపం నిర్వహణ చూసుకోవాలి. ముఖ్యంగా శుభ కార్యాలు నిర్వహించుకొనే ధరలు పేద, మధ్యతరగతి వారికి ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. కానీ టెండర్ దక్కించుకున్న వ్యక్తి స్థానికంగా ఉండే ఒక టెంట్‌హౌస్ నడుపుకునే వ్యక్తికి అనధికారికంగా అద్దెకు ఇచ్చాడు. ఆయన్ను మేనేజర్‌గా చూపిస్తున్నాడు. సబ్ లీజ్‌కు తీసుకున్న వ్యక్తి కళ్యాణ మండపాన్ని ఇష్టారాజ్యంగా వినియో గించడం మొదలుపెట్టాడు. ఆయనకు సంబంధిం చిన టెంట్‌హౌస్ సామాగ్రి మొత్తాన్ని కల్యాణ మండపంలోనే ఉంచుతున్నాడు. అంతేకాక ఒక శుభ కార్యక్రమానికి రూ.14,500లకు మించి వసూలు చేయడానికి వీలులేదు. కానీ టెంట్‌హౌస్ నిర్వహించే వ్యక్తి మాత్రం అనధికారికంగా లక్ష రూపాయాలకు పైగానే ఒక్కో శుభకార్యక్రమానికి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆర్థిక స్థోమతలేని హిందువుల కోసం కట్టించిన కల్యాణ మండపం నేడు వారికి అందుబాటులో లేకుండాపోయింది. వాస్తవా నికి పెళ్లిళ్ల సీజన్‌లేని సమయా ల్లో ఖాళీగా అయినా ఉండవచ్చుకానీ ఎలాంటి ప్రైవేటు కార్యకలాపాలకు వాడటానికి వీలులేదు. కానీ సబ్ లీజుకు తీసుకున్న వ్యక్తిమాత్రం నిబం ధనలకు పాతరేసి తన ఇష్టానుసారంగా వ్యాపార దృక్పథంతో రాజకీయ సభలకు, సన్మాన కార్యక్రమాలు, ఎగ్జిబిషన్ సేల్ తదిత రాలకు అద్దెకిస్తున్నాడు. సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన నామినేషన్ కార్యక్రమానికి వైసీపీ అభ్యర్థి ఇతర జిల్లాల నుంచి మనుషుల్ని రప్పించాడు. వైసీపీ అభ్యర్థి నుంచి డబ్బులు తీసుకున్న సబ్‌లీజుదారుడు దూరప్రాంతం నుంచి వచ్చిన వారికి టీటీడీ కల్యాణ మండపంలో ఆశ్రయమిచ్చాడు. అంతేకాక చీకటి పడితే కళ్యాణ మండపంలోని కార్యాలయ గదుల్లో అసాంఘిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదేం పద్ధతని ఎవరైనా ప్రశ్నిస్తే తాను అధికార పార్టీకి చెందిన వాన్ని నా ఇష్టం వచ్చినట్లు కళ్యాణ మండపాన్ని నిర్వహిస్తానని తెగేసి చెబుతున్నాడని పలువురు వాపోతున్నారు. టీటీడీ అధికారులు ఈ వ్యవహారాలపై దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కల్యాణ మండపంలో జరుగుతున్న అమ్మకాలు

**కాంట్రాక్టర్‌పై తప్పక చర్యలు తీసుకుంటాం**

మార్కాపురంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు గతంలోనే పలు ఫిర్యాదులు అందాయి. కేవలం హిందువులు కల్యాణాలు, బారసాలలు జరుపుకోవచ్చు. అంతేకాక ధార్మిక ప్రవచనాలు, భజనా కార్యక్రమాలు తదితరాలు నిర్వహించుకోవచ్చు. కాంట్రాక్ట్ తీసుకున్న వాళ్లు సబ్‌లీజుకు ఇవ్వడానికి లేదు. ఇప్పటికే కాంట్రాక్టర్‌ను హెచ్చరించాం. తీరు మార్చుకోకుంటే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్ట్‌ను రద్దుచేస్తాం

**- ఎస్.రవి, ఏఈవో, టీటీడీ కళ్యాణ మండపాల నిర్వహణ, తిరుపతి**

## అవీ..ఇవీ..

### ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా శ్రీనివాసులు

గిద్దలూరు, మే 19 : ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా గిద్దలూరుకు చెందిన వై.శ్రీనివాసులు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే జిల్లా అదనపు కార్యదర్శిగా ఎస్.హెచ్.కబీర్‌ను జిల్లాశాఖ ఉపాధ్యక్షులుగా టి.పాండురంగ స్వామి, జిల్లా కార్యదర్శిగా జి.పాండు, జిల్లా అకాడమిక్ కమిటీ సభ్యులుగా డి.వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారని ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్షులు బి.దేవసహాయం, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీనివాసులు తెలిపారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

గిద్దలూరు, మే 19 : సగర (ఉప్పర) సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కాళికాంబ ఆలయంలో సభ్యులు సమావేశమై గిద్దలూరు జోన్ సగర సేవా సంఘం కన్వీనర్‌గా కె.మూర్తయ్య, కో-కన్వీనర్‌గా దండూరి సోమయ్య, సభ్యులుగా కొప్పుల నరసింహులు, జి.రామసుబ్బయ్య, జి.కాశయ్య, దండబోయిన పెద్దరమణ, మద్దులేటి కృష్ణమూర్తి, తదితరులను సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సగర వంశస్తుల కులదైవమైన భగీరథ ఆలయ అభివృద్ధి, నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవాలయం వద్ద అన్నదాన సత్ర నిర్మాణం గురించి చర్చించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జూటూరు చిన్న సుబ్బరాయుడు, ఎస్.రామకృష్ణ, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



ఇంగ్లీష్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు

గిద్దలూరు, మే 19 : పట్టణంలోనిశాఖ గ్రంథాలయం ఆవరణలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ప్రతిరోజు స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్‌లపై ఉపాధ్యాయులు అవ గాహన కల్పిస్తున్నారు. ఆదివారం ఉపాధ్యాయుడు పోలిరెడ్డి స్పోకెన్ ఇంగ్లీషు ప్రాముఖ్యత గురించి, నేర్చుకునే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎస్.ఎం.ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి ఆంగ్లంలో రాయడం, చదవడం నేర్పించారు. పలు కథలు, ఆటలపోటీలు నిర్వహించారు.

**చిన్ననాటి నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలి**

పొదిలి : చిన్ననాటి నుండే విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవడం ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవచ్చని పొదిలి గ్రంథపాలకుడు శాంసన్ అన్నారు. పొదిలి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిబిరంలో విద్యార్థులకు ఆదివారం పలు విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించిన ఆయన నిపుణులతో యోగా సాధన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీతికథల ద్వారా అనేక విషయాలు నేర్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో హుస్సేన్‌పాష్యా, బాబు, సుబ్రహ్మణ్యం, సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

### ధ్యానయోగాతో రుగ్మతలు దూరం

పొదిలి, మే19: ప్రతిరోజు ధ్యానయోగా సాధన చేయడం ద్వారా అనేక రుగ్మతలను దూరం చేసుకోవచ్చని ధ్యాన గురువు సౌజన్య చెప్పారు. పొదిలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తూరు, పాతూరులలోని సాయిబాబా దేవాలయంలో ఉచిత ధ్యానయోగ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ధ్యానం చేసే విధానంపై ఆమె అవగాహన కల్పించారు.. ధ్యానంతో మనసు ఉత్తేజమవుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.శ్రీనివాసులు, ఎ.శ్రీనివాసులు, వై.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

### చెస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

పొదిలి, మే 19: ఒంగోలులో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో పొదిలికి చెందిన చిన్నారులు ప్రతిభ కనబరిచారు. అండర్-7 ఓపెన్ విభాగంలో ఏపీజీబీ మేనేజర్ సునీల్‌గుప్త కుమార్తె పాన్యశీవల్లి, కుమారుడు విఙ్ఞేష్‌గుప్తలు రజిత పతకాలను సాధించారు. గతంలోనూ వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో చిన్నారులు జిల్లాస్థాయిలో పతకాలు సాధించినట్లు తండ్రి సునీల్‌గుప్త తెలిపారు. పతకాలు సాధించిన చిన్నారులను పలువురు అభినందించారు.

### రైల్వే ట్రాక్‌పైకి పశువులు రాకుండా జాగ్రత్త వహించాలి



రాయవరంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

మార్కాపురం రూరల్, మే 19: రైల్వే ట్రాక్‌పైకి పశువులు రాకుండా పశువుల యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలని నరసరావుపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర పశువుల యాజమానులకు సూచించారు. ఆర్‌పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ సత్యహరి ప్రసాద్ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వేట్రాక్ పై సంచరిస్తూ రైలు కింద పశువులు పడితే యజమానులపై రైల్వే యాక్ట్ ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా సీఐ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. పశువుల యజమానులకు పలు సూచనలు చేశారు. పశుపోషకుల నిర్లక్ష్యంతో గత వారం రోజుల్లో 20 గేదెలు మృతిచెందాయన్నారు. కార్యక్రమంలో మార్కాపురం ఆర్పీఎఫ్ కానిస్టేబుల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పీడిత ప్రజల ఆశాజ్యోతి సుందరయ్య



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, మే 19: పీడిత ప్రజల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డీకేఎం రఫి అన్నారు. స్థానిక సుందరయ్య కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య 39వ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రఫి మాట్లాడుతూ.. పీడిత ప్రజల విముక్తి కోసం కడ వరకు పోరాడిన కమ్యూనిస్టు గాంధీ సుందరయ్య అన్నారు. ప్రజాసేవకు అంకితమై ఆడంబరాలు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ ఆరు దశాబ్దాలకు పైగా రాజకీయ జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రూబెన్, కాశయ్య, విక్టర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : స్థానిక సీపీఎం కార్యాలయం, చిన్నగుడిపాడు గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కార్యదర్శి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు గోదా దావీదు, పిచ్చయ్య, రాజాకృష్ణ, వెంకటేశ్వర్లు, శివాచారి పాల్గొన్నారు.

**సుందరయ్య జీవితం ఆదర్శనీయం**

పొదిలి : పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజా సంక్షేమానికి నేటితరం నాయకులు కృషి చేయాలని సీపీఎం నాయకులు ఎం.రమేష్ అన్నారు. ఆదివారం సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సీఐటీయూ నగర పంచాయతీ నాయకులు కోటేశ్వరరావు, నరసింహం, సుబ్బయ్య నాగేంద్రం, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

**చోద్యంచూస్తున్న అధికారులు**

గిద్దలూరు, మే 19 : నియోజకవర్గంలో మట్టి మాఫియా చెలరేగుతోంది. వారు విదిల్చే కాసులకు ప్రభుత్వ అధికారులు కక్కుర్తి పడుతున్నారు. దీంతో మట్టిని అక్రమంగా తరలించే అక్రమార్కులకు బ్రేకులు వేసేవారే కనిపించడం లేదు. రాచర్ల మండలంలోని యడవల్లి పెద్దచెరువు నుంచి ఇష్టారాజ్యంగా మట్టిని తవ్వి తీసుకొని వెళుతున్నారు. ఇటుకల బట్టీలలో వాడేందుకు, రియల్‌ఎస్టేట్ వెంచర్లలో రోడ్లు వేసేందుకు ఈ మట్టి ఉపయోగపడుతుండడంతో చెరువులోని మట్టిని ఎక్కడ పడితే అక్కడ ఎక్సకవేటర్లతో తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే కొమరోలు మండలంలోని పలు చెరువుల నుంచి కూడా అక్రమార్కులు మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. రెడ్డిచెర్ల చెరువులో కూడా ఇటీవల అక్రమ మట్టి తవ్వకాలు విపరీతంగా జరిగాయి. గిద్దలూరు ప్రాంతంలో కొండలను కొల్లగొట్టి గ్రావెల్‌ను బయటకు తీసి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీ స్థాయిలో గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి అందులో వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, గ్రామ కార్యదర్శులు, పోలీసులు గ్రామస్థాయిలోనే ఉంచినప్పటికీ మట్టి తవ్వకాలు మాత్రం బహిరంగంగా జరుగుతున్నప్పటికీ పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఫిర్యాదులు వస్తే ఒకటిరెండు ట్రాక్టర్లను సీజ్ చేసి ఫైన్ వేసి చేతులు దులుపుకుంటున్నారు. అక్రమార్కులకు స్థానిక వైసీపీ నేతల అండదండలు ఉండడంతో ప్రభుత్వ సిబ్బంది కూడా ఇచ్చిన కాడికి పుచ్చుకొని తమకెందుకులే అన్నట్లు ప్రవర్తిస్తున్నారు. దానికి తోడు ఎన్నికల వేళ కావడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రెవిన్యూ అధికారులు ఎన్నికలు కాగానే తాము ఎలాగూ బదిలీ అవుతారు కాబట్టి ఈ సమయంలో ఇటువంటి పంచాయతీలు మనకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. తమకు ఎన్నికల విధులు ఉన్నాయంటూ ఫిర్యాదులను దాటవేస్తున్నారు. ఇదే అదునుగా మట్టి మాఫియా రెచ్చిపోయి విచ్చలవిడిగా చెరువుల్లో, కొండ తిప్పల్లో మట్టిని అక్రమంగా తవ్వుతూ అమ్ముకుంటూ సొమ్ము చేసుకొంటోంది.



యడవల్లి పెద్దచెరువులో మట్టిని తవ్వుతున్న ఎక్సకవేటర్



చెరువులోని మట్టిని తీసుకుని వెళుతున్న ట్రాక్టర్

# వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశీస్సులు ప్రజలకు ఉండాలి

**టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు**

ఎర్రగొండపాలెం, మే 19 : ప్రజలకు కాలజ్ఞానం అందించి ప్రజల్లో అజ్ఞానాన్ని పారద్రోలిన వీరబ్రహ్మేందస్వామి ఆశీస్సులకు నియోజకవర్గ ప్రజలకు ఉండాలని, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆదివారం అమానిగుడిపాడులోని వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం ముందుగా నైరుతి రుతుపవనాల రాకతో సమృద్ధిగా వర్షాలు కురిసి నియోజకవర్గంలో గ్రామాలు పాడిపంటలతో కళకళలాడాలని పూజలు చేశారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం ఎమ్మెల్యేగా మంచి మెజార్టీతో విజయం సాధించి నియోజకవర్గ ప్రజలకు సేవచేస్తానన్నారు. కార్యక్రమంలో డాక్టరు మన్నె రవిచంద్ర, టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు చిట్యాల వెంగళరెడ్డి, వడ్లమూడి లింగయ్య కంచర్ల సత్యనారాయణగౌడ్, జాగర్లమూడి గాలెయ్య, ఒంగోలు ఆదిరెడ్డి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామివారి ఆశీస్సులు అందుకుంటున్న ఎరిక్షన్‌బాబు

**వైభవంగా సత్యదేవుని కల్యాణం**

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని తొమ్మిదోవార్డులో వెలసిన రమాసహిత సత్యనారా యణ స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు రెంటచింతల గౌరీ శంకరశర్మ, కళ్యాణఘట్టాలు పురస్కరించుకుని రమాసత్యనారాయణ స్వామి ఉత్సవమూర్తులను అత్యంత శోభాయమానంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. ఎదురుకోల ఉభయదాతలు బొగ్గరపు చెంచు వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు స్వామి వారివైపు చెక్కా చినమాలకొండ నరసింహారావు అమ్మవారి వైపు పాల్గొన్నారు. కల్యాణ శాశ్వత ఉభయదాత ఎస్.ప్రభుదాసు కటుంబ సభ్యులు స్వామికి ముత్యాల తలంబ్రాలు, పువ్వాడ సత్యనారాయణ, అనిల్‌లు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సుధాకర్, కార్యదర్శి చిన్నసుబ్బారావు తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.



కల్యాణమూర్తిగా సత్యదేవుడు

## పోలేరమ్మకు ఆదివారం జాతర



మార్కాపురం వన్‌టౌన్, మే 19: మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహిం చారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పూలమాలలతో అలంక రించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## ఆక్రమణ చెరలో వీధులు

● కుంచించుకుపోతున్న వీధులు ● రోడ్లు, కాలువలపై నిర్మాణాలు
● వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ● పట్టించుకోని అధికారులు



ఆక్రమణలతో కుంచించుకుపోయిన వీధి

కంభం, మే 18 : కాదేది ఆక్రమణలకు అనర్హం అన్నరీతిన కంభం, కందులాపురంలలో ఆక్రమణలకు హద్దులు దాటుతున్నాయి. దాదాపు అన్ని వీధుల్లో గృహ యజమానులు రోడ్లు, కాలువలను యథేచ్ఛగా ఆక్రమించుకుంటున్నారు. వాటిపై అరుగులు, మెట్లు నిర్మించడంతో వీధులు కుచించుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో కాలువల్లో పేరుకుపోతున్న చెత్తను తీసేందుకు సైతం వీలు ఉండడం లేదు. ఇంత జరుగుతున్నా అధికారులు చలించడం లేదు. ఏ వీధి చూసినా ఆక్రమణలతో కనిపిస్తున్నాయి. సొంత స్థలం నుంచి హద్దులు దాటి మరీ ముందుకు వచ్చి కాలువలు, రోడ్లపై ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు. వర్షాకాలంలో మురికి నీరు పారే పరిస్థితి కనిపించడం లేదు. చెత్త పేరుకుపోయి వర్షం నీరు, మురికినీరు రోడ్లమీదే ప్రవహిస్తూ రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దాదాపు అన్ని వీధుల్లో ఆటోలు తప్ప కార్లు వెళ్లలేని పరిస్థితి. ముఖ్యంగా సంఘవీధి, మెయిన్ బజార్, జామియా మసీదు సెంటర్, శీలం వీధి, తెలుగు వీధి, జయప్రకాశ్‌వీధి, నెహ్రూనగర్ 2, 3 వీధులు, కందులాపురంలోని జాతీయ రహదారిలోని ఫుట్‌పాత్‌లపై, తదితర ప్రాంతాల్లో కాలువలపై నిర్మాణాలు చేపట్టారు. రెండు వాహనాలు ఎదురుగా వచ్చినపుడు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించి రోడ్లను వెడల్పు చేయాలని కోరుతున్నారు.

## కొండెక్కిన కోడి ధర !

● ఒంగోలులో కిలో రూ.310

ఒంగోలు (కలెక్టరేట్), మే 19 : కోడి మాంసం ధర కొండెక్కింది. కిలో రూ. 310కి చేరింది. గత ఆదివారం స్కిన్ లెస్ కిలో రూ.270 వరకూ ఉండగా ఇప్పు డు రూ.40 పెరిగింది. ఎండల తీవ్రతతో ఫారాల్లో కోళ్ల పెంపకం తగ్గిపోయింది. అదేసమయంలో కోడి పిల్లలు చనిపోతున్నాయి. ఉత్పత్తి తగ్గిపోవడం, కొను గోళ్ల పెరగడం ధరల పెరుగుదలకు కారణమైంది. మన జిల్లాకు నెల్లూరు, చిలకలూరిపేట, గుంటూరు నుంచి ఎక్కువగా కోళ్లు దిగుమతి అయ్యేవి. ప్రస్తు తం అక్కడ నుంచి సరఫరా తగ్గిపోయింది. రాజమండ్రి, విజయవాడ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణా ఖర్చులు కూడా అధికమ వుతున్నాయి. ఇది కూడా ధరల పెరుగుదలకు ఒక కారణమని వ్యాపారులు అంటున్నారు. మరో పక్షం రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని, ధరలు ఇంకా పె రిగే అవకాశం ఉందని వారు చెప్తున్నారు.






కంకణాల పల్లెలో రైస్ మిల్లు గోడ కూలడంతో పిల్లర్లు పడి ధ్వంసమైన ఇల్లు, రోడ్డుపై అడ్డంగా ఒరిగిన స్తంభం, ధ్వంసమైన బొప్పాయితోట, నేలకొరిగిన విద్యుత్ స్తంభం

# గాలివాన బీభత్సం

- పడిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్
- నేలమట్టమైన బొప్పాయి, అరటి తోటలు
- రేకుల ఇల్లుపై కూలిన రైస్ మిల్లు ప్రహరీ

త్రిపురాంతకం, మే 19: మండలంలోని పలుగ్రామాల్లో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వీచిన గాలులకు, కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లు నేలకొరిగాయి. బొప్పాయి, అరటి తోటలు నేలమట్టమయ్యాయి. త్రిపురాంతకంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని రైస్‌మిల్లు గోడకూలి పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడడంతో ఇళ్లు పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న వృద్ధురాలికి అదృష్టవశాత్తు ఏమీ కాలేదు. కంకణాలపల్లిలో ప్రధాన రహదారిపై విద్యుత్‌స్తంభం మధ్యలోకి విరిగి తీగలతో సహా రోడ్డుపై వాలింది. పొలాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లు నేలవాలాయి. సోమేపల్లి, కంకణాలపల్లి గ్రామాల పరిధిలో నేలవాలిన సుమారు 50 స్తంభాలు, ఎనిమిది ట్రాన్స్‌పార్మర్లను ఇన్నటివరకు గుర్తించామని, వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని విద్యుత్ ఏఈఈ సురేష్‌రెడ్డి తెలిపారు. కంకణాలపల్లిలో వర్షం, గాలుల దాటికి తొమ్మిది ఎకరాలలోని బొప్పాయి తోటలు పూర్తిగా నేలవాలాయని రైతులు బత్తుల గురవయ్య, దద్దాల రమణయ్య, బైలడుగు ఎల్లయ్యలు తెలిపారు. ఎకరానికి సుమారు మూడు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయారు. ఒడ్డుపాలెంలో మహిళా రైతు భీమిశెట్టి యోగమ్మ సాగు చేసిన రెండెకరాల అరటితోట నేలవాలింది. కాగా నష్టపోయిన పంటలను వీహెచ్‌ఏ నాగజ్యోతి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా ఈ వర్షంతో కంకణాలపల్లి చెరువుకు నీరుచేరి జలకళ సంతరించుకుంది. వర్షం గాలుల ప్రభావంతో స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లు నేలవాలడంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.



వర్షపు నీటితో కళకళలాడుతున్న కంకణాలపల్లి చెరువు

## పత్తాలేని ఉద్యానశాఖాధికారులు

తర్లుపాడు, మే 19: మండలంలో ఇటీవల పెను గాలులు, భారీ వర్షాలతో బొప్పాయి తోటలు నేలకొరిగాయి. ఎక్కువగా గానుగపెంట, ఓబాయపల్లెలో సుమారు 25 ఎకరాల బొప్పాయి తోటలు నేలకొరిగాయి. ఆరుగాలం శ్రమించిన పంట చేతికొచ్చే దశలో పెనుగాలల బీభత్సానికి చెట్లు మొత్తం ఒరిగాయి. దీంతో బొప్పాయి రైతులు భారీగా నష్టపోయారు. ఈ విషయాన్ని ఉద్యాన శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. ఎకరాకు సుమారు రూ.1.50లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఇప్పటికైనా ఉద్యానవనశాఖ అధికారులు స్పందించి నేలకొరిగిన బొప్పాయి తోటలను పరిశీలించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బొప్పాయి రైతులు కోరుతున్నారు.



వర్షాలకు దెబ్బతిన్న బొప్పాయి తోట


కంభాలదిన్నె గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ రామానాయక్

## అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించం

పామూరు, మే 19: అల్లర్లకు ఎవరైన పాల్పడితే ఉపేక్షించేదిలేదని సీఐ ఎం.రామానాయక్ హెచ్చరించారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో ఆదివారం ఉదయం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా గ్రామంలో జరిగిన ఘర్షణ నేపథ్యంలో కౌంటింగ్ ముగిసే వరకు ఎవరూ రెచ్చగొట్టే పనులు చేపట్టరాదని హెచ్చరించారు. ఈసందర్భంగా అనుమానాస్పద ఆయుధాలు ఉన్నాయేమోనన్న అనుమానంతో ప్రతి ఇంటిని, వాహనాలను, పాటుపడిన ఇళ్లను, గడ్డివాముల ప్రాంతాలను తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పామూరు, సీఎస్‌పురం, వెలిగండ్ల ఎస్ఐలు ఎం.సైదుబాబు, ప్రేమ్‌కుమార్, శివ, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కల్గిస్తే కఠిన చర్యలు

తాళ్లూరు, మే 19: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వైవీ రమణయ్య హెచ్చరించారు. ఆదివారం స్థానిక స్టేషన్‌లో కొర్రపాటివారిపాలెం, తాళ్లూరు, తదితర గ్రామాలకు చెందిన ఇరుపార్టీల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చిన్న, చిన్న విషయాలపై అనవసర రాద్ధాంతాలు చేసి ప్రజలను ఇబ్బందులు పెట్టినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా, అసాంఘిక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తరువాత కూడా గ్రామల్లో శాంతికి విఘాతం లేకుండా చూడాలని, లేకుంటే చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బాటిళ్లలో పెట్రోల్ నింపితే చర్యలు

పామూరు, మే, 19: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదివారం నుంచి వచ్చెనెల 10వ తేదివరకు వాహనాలకు మాత్రమే అవసరమైన మేరకు పెట్రోల్ నింపాలని పోలీసులు తెలిపారు. ఖాళీ వాటర్ బాటిళ్లు, క్యాన్‌ల్లో పెట్రోల్, డీజిల్ నింపారాదంటు ఎన్నికల కమిషన్ ఆదేశాలప్రకారం పెట్రోల్ బంకు యజమానులకు పోలీసులు హెచ్చరికలు జారిచేశారు. బంకుల నుంచి బాటిళ్లకు, డ్రమ్ములకు, పెట్రోల్ నింపితే చర్యలు తీసుకొంటామని హెచ్చరిస్తూ పెట్రోల్ బంకులవద్ద నోటీసులు అతికించారు. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో వాహనదారులు నిలిచిపోయిన తమ వాహనాల కోసం పెట్రోల్, డీజిల్ బాటిళ్లు తీసుకొని బంకుల వద్దకు వెళ్ళిన వారికి నిరాశ ఎదురవుతుంది. పోలీసుల నోటీసులు చూపిస్తూ పెట్రోల్ ను బాటిళ్లలో నింపబోమని స్పష్టం చేస్తున్నారు.

## చిన్నయ్యకు ఉగాది జాతీయ పురస్కారం


తెలుగు వెలుగు ఉగాది జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న చిన్నయ్య

తాళ్లూరు, మే 19: మండలంలోని వెలుగువారిపాలెంకు చెందిన గర్నెపూడి చిన్నయ్యకు ఉగాది జాతీయ పురస్కారంతో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆదివారం ఘనంగా సత్కరించింది. చిన్నయ్య తాళ్లూరులోని ఏబీసీ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. తెలుగు కీబోర్డ్ ప్లేయర్‌గా ఆయనకు ప్రావీణ్యం వుంది. దీనిని గుర్తించిన సాహితీ వేదిక చిన్నయ్యను ఉగాది జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. ఆదివారం ఒంగోలులో జరిగిన పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అప్పినపల్లి భాస్కరాచారి, వ్యవస్థాపక చైర్మన్ పి.రాజ్‌కుమార్, రాష్ట్ర కన్వీనర్ తులసి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ముండ్లమూరులో మోస్తరు వర్షం

ముండ్లమూరు, మే 19: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు వర్షం కురవటంతో పొలాలు పదునవుతాయని రైతులు పేర్కొన్నారు. మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం, చింతలపూడి, పసుపుగల్లు, ఉల్లగల్లు, రెడ్డినగర్, బసవాపురం, పులిపాడు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో అరగంట పాటు భారీ వర్షం కురిసింది.

# అధ్వానంగా రక్షిత పథకాలు

- ఐదేళ్లుగా మరమ్మతుల గురించి పట్టించుకోని అధికారులు
- మంచినీటి చెరువులో తగ్గిన నిల్వ సామర్థ్యం
- తరచూ పగిలిపోతున్న పైపులైన్లు
- కూలేదశకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకులు


దర్శి ఎన్ఏపీ చెరువు

దర్శి, మే 19: దర్శి నియోజకవర్గంలో రక్షిత మంచినీటి పథకాలు అస్తవ్యస్తంగా మారాయి. గత ఐదేళ్లుగా కనీస మరమ్మతులు కూడా చేయకపోవటంతో నీటి పంపిణీ సక్రమంగా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలంచెల్లిన పైపులైన్లు తరచూ పగిలిపోతూ నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ప్రధానంగా దర్శి ఎన్ఏపీ రక్షిత మంచినీటి పథకం అధ్వానంగా మారింది. 1980లో ఏర్పాటుచేసిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో ఇప్పటివరకు పూడిక తీయలేదు. దీంతో నీటి నిల్వ సామర్థ్యం పూర్తిగా తగ్గిపోయింది. అధికారులు 2540 మిలియన్ లీటర్లు నిల్వ సామర్థ్యం ఉందనే లెక్కలు చెబుతున్నా 40 శాతం మేర అడుగున మట్టి పేరుకుపోవటంతో నీటి నిల్వ తక్కువగా ఉంటుంది. స్కీమ్ పరిధిలో జనాభా రెట్టింపు కావటం, సమ్మర్ స్టోరేజీ నిల్వ సామర్థ్యం తగ్గిపోవటంతో అన్నీ ప్రాంతాలకు సరిపడా నీరు సరఫరా చేయటం లేదు. రెండు రోజులకు కొన్ని గ్రామాలకు, శివారు ప్రాంతాలకు మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్నారు.

### పనిచేయని ఫిల్టర్ బెడ్లు


పనిచేయని ఫిల్టర్ బెడ్లు

నీటిని శుద్ధిచేసే ఫిల్టర్‌బెడ్లు పనిచేయటం లేదు. స్కీమ్ నిర్మాణ సమయంలో ఏడు ఫిల్టర్‌బెడ్లు నిర్మించారు. పొరలు పొరలుగా ఇసుక, కంకర తోలి అద్భుతమైన విధానం ద్వారా ఫిల్టర్‌బెడ్లు రూపొందించారు. చాలాకాలం వాటి ద్వారా స్వచ్ఛమైన నీరు ప్రజలకు అందించారు. నిర్ణీత సమయంలో ఇసుకపై పేరుకున్న మట్టిని తొలగించి కొత్త ఇసుకను పోసి మరమ్మతులు చేయాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో గత కొంతకాలంగా ఫిల్టర్‌బెడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో అదనంగా ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్లు ఏర్పాటుచేశారు. ఆర్ఎస్ఎఫ్ ఫిల్టర్లు ద్వారా దర్శి పట్టణంతో పాటు అతికొద్ది గ్రామాలకు ఫిల్టర్ అయిన నీరు విడుదల చేస్తున్నారు. ఇసుక ఫిల్టర్లు పనిచేయకపోవటంతో అధికశాతం గ్రామాలకు రా వాటర్ విడుదల చేస్తున్నారు.


శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంకు

ఎంతోకాలం నిల్వ ఉన్న రా వాటర్ తాగలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### కాలంచెల్లిన పైపులైన్లు

సుమారు 45 సంవత్సరాల క్రితం నిర్మించిన పైపులైన్లు సామర్థ్యం కోల్పోయి తరచూ పగిలిపోతున్నాయి. అంచెలంచెలుగా రోడ్లు అభివృద్ధి చెందటంతో పైపులైన్లు ఐదు అడుగల లోతులో ఉన్నాయి. మంచినీరు విడుదల చేసినప్పుడు పైపులైను బలహీన పడటంతో తరచూ పగిలిపోయి నీరు వృథాగా పోతుంది. గ్రామాలకు నీరు చేరటం లేదు. భూమిలో ఐదు అడుగుల లోతులో ఉన్న పైపులైను ఎక్కడ పగిలాయో తెలుసుకొని మరమ్మతులు చేసేందుకు సిబ్బంది అవస్థలు పడాల్సి వస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా నూతన పైపులైన్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు విడుదల కాలేదు. ఫలితంగా, దెబ్బతిన్న పైపులైన్‌తో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

### కూలేదశకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకులు

ఎన్ఏపీ స్కీమ్ పరిధిలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు సామర్థ్యం కోల్పోయి కూలేదశకు చేరాయి. పిల్లర్లు దెబ్బతిని నెర్రలు ఇచ్చాయి. దర్శి పట్టణంలో నిర్మించిన ఐదు లక్షల లీటర్లు నీటి సామర్థ్యం కల్గిన ట్యాంకు పూర్తిగా దెబ్బతింది. పిల్లర్లు అనేకచోట్ల నెర్రలు ఇచ్చాయి. ఎప్పుడు కూలుతుందోనని అక్కడ పనిచేసే సిబ్బంది భయపడుతున్నారు. అనేకచోట్ల నిర్మించిన ట్యాంకులు దెబ్బతిన్నాయి. ఈ రక్షిత మంచినీటి పథకాన్ని పూర్తిగా అభివృద్ధి పర్చకపోతే మరికొంత కాలానికి పూర్తిగా దెబ్బతిని మంచినీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగే ప్రమాదం ఉంది. 122 గ్రామాల్లోని సుమారు రెండు లక్షల మంది ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కోవాల్సి ఉంటుంది.



# గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మే 19: పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గుంటి గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో భక్తులతో సందడిగా మారింది. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, విజయలక్ష్మిలు అమ్మవారికి పూజలు నిర్వహించారు. పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎం.భాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు. మంగళవారం ఆలయంలో లలితా సహస్రనామ పూజలు జరుగనున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో కార్తీక్ కోరారు.

### వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

కనిగిరి, మే 19: బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు సందర్భంగా స్థానిక దొంతులమ్మ దేవాలయంలో ఆదివారం పోలేరమ్మ తిరునాళ్ల నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి పొంగళ్ల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విశేష అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని నలుమూలల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి పోలేరమ్మకు పొంగళ్ళు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వీరబ్రహ్మేంద్రస్వామి, పోలేరమ్మ ఉత్సవ విగ్రహాలను నగర పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, నృత్యభజనలు, వివిధ దేవతామూర్తుల వేషధారణలతో ఊరేగింపులో జరిగిన నృత్యరూపకాలు పురప్రజలను అలరించాయి. ఆలయకమిటీ భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కాపు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామయ్యనాయుడు, ఆయన సతీమణి డాక్టర్ టి.ఆదిలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గఫార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.


విశేష అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు


విశేష అలంకారరూపంలో గంగమ్మ తల్లి

### ఘనంగా దేవస్థాన వార్షికోత్సవం

పామూరు, మే 19: మండలంలోని చట్టుమడుగు, దాదిరెడ్డిపల్లి గ్రామాల సమీపంలో వెలసియున్న శ్రీపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థాన ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా దేవస్థాన ప్రధాన అర్చకులు ఆకుమళ్ల సుధాకర్ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, అభిషేకాలు, భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. సాయంత్రం మేళతాళాలతో స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు.


పామూరు: పూజలు చేస్తున్న భక్తులు

**మిట్టపాలెంలో..** సీఎస్‌పురం మండలం మిట్టపాలెంలోని నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వార్లకు మేళతాళాలతో దేవస్థాన నిర్వాహకులు, భక్తులు గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించారు. ఆనంతరం స్వామి మూలవిరాట్‌వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు ఆదినారాయణ, ఈవో, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదర్శనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య


పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సందు వెంకటేశ్వర్లు, తదితరులు

దర్శి, మే 19: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటితరానికి ఆదర్శనీయమని సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం పుచ్చలపల్లి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ చిన్న నాటినుంచే సుందరయ్య అంటరానితనానికి వ్యతిరేకంగా ముందుకు సాగారన్నారు. 1932లో వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి కూలీరేట్లు పెంచాలని ఉద్యమాలు చేశారని గుర్తుచేశారు.

కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ మహిళా సంఘ నాయకులు ఉప్పు నారాయణ, నాగేశ్వరరావు, జాన్‌సామ్యేల్, ఆదినారాయణ, లక్ష్మి, పద్మావతి, రంగమ్మ, రమణ, మోహన్‌రావు, రంగనాయకులు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

**ముండ్లమూరులో..** ముండ్లమూరు, మే 19: మండలంలోని శంకరాపురం, మారెళ్ళ, ముండ్లమూరు గ్రామాల్లో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెల్లంపల్లి ఆంజనేయులు, బోడపాటి హనుమంతరావు, పంటా ఏడుకొండలు, ఎర్రయ్య సత్యనారాయణ, మదన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

**పామూరులో..** పామూరు, మే 19: పుచ్చలపల్లి సుందరయ్యను నేటితరం రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కె.మాల్యాద్రి అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం తొలితరం కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లభక్ష్, సయ్యద్ గౌస్‌బాషా, ఆర్.సింహాద్రి, కె.శంకర్, సీహెచ్ వెంకటేశ్వర్లు, రామయ్య, షేక్ మదార్‌బీ, తదితరులు పాల్గొన్నారు.


**కనిగిరిలో..** కనిగిరి, మే 19: పేదల పెన్నిది పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం కార్యదర్శి పీసీ కేశవరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. ఈసందర్భంగా కేశవరావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతికై అహర్నిశలు శ్రమించి వారి జీవితాల్లో పుచ్చలపల్లి వెలుగులు నింపారన్నారు. పెత్తందారీ వ్యవస్థలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక, ప్రజానీకానికి అండగా నిలిచి ఎన్నో ఉద్య మాలు చేపట్టారన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు.

కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాలకొండయ్య, ఏడుకొండలు, కాశయ్య, వెంకటరెడ్డి, ఎస్కే బషీరా, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసు ఫిర్యాదుతో విచారణ

ముండ్లమూరు, మే 19: మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారంలో ఈనెల 13న జరిగిన పోలింగ్‌లో ఓటు వేయటానికి వచ్చిన కొందరిని క్యూలో నిలబడమనగా, కులం పేరుతో దూషిస్తూ గొడవ పడ్డారని ఆగ్రామ మహిళా పోలీసు అనూష ఫిర్యాదు చేసింది. అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆంజనేయులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు కూడా అనూష తమపై అనుచితంగా ప్రవర్తించిందని ఫిర్యాదు చేశారు. రెండు కేసులు నమోదు చేయగా, దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆదివారం గ్రామానికి వెళ్ళి విచారణ చేపట్టారు.

విచారణలో వాస్తవాలు తేలితే అందుకు బాధ్యులైన వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. చిన్నచిన్న విషయాలకు కేసులు పెట్టుకొని అనవసరంగా ఇబ్బందులు పడొద్దని డీఎస్పీ పేర్కొన్నారు.





కారంపూడి పోలీస్‌స్టేషన్లో ఫైల్స్‌ను పరిశీలిస్తున్న సిట్ అధికారులు

# అరాచకాలపై ఆ..రా..గ్రహం

జిల్లాలో కొనసాగుతున్న సిట్ విచారణ

- హింసాత్మక కేసులు, సెక్షన్లపై పరిశీలన
- పరారీలో ఉన్న వారందరినీ పట్టుకు రావాలి
- నరసరావుపేట, కారంపుడి, దాచేపల్లిలో దర్యాప్తు



దాచేపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న సిట్ అధికారులు

నరసరావుపేట, కారంపూడి, దాచేపల్లి, రెంటచింతల, మే 19: పోలింగ్ విధ్వంసాలు, ఆ తర్వాత జరిగిన హింసలపై సిట్ బృందం రెండో రోజు ఆదివారం జిల్లాలో విచారణ కొనసాగించింది. అరాచకాలు జరిగిన తీరు.. నమోదైన కేసులు.. అరెస్టుల వివరాలు తెలుసుకున్న సిట్ ఆయా ఘటనలను ఎందువల్ల కట్టడి చేయలేకపోయారని స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాల పనితీరులో చోటుచేసుకున్న లోపం కూడా అల్లర్లకు కారణమని సిట్ గుర్తించినట్లు సమాచారం. జిల్లాలో పోలింగ్ రోజు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై సిట్ విచారణ రెండో రోజు ఆదివారం కొనసాగింది. స్థానిక పోలీసు అధికారుల వైఫల్యాన్ని గుర్తించడంతో పాటు కేసుల నమోదులో అవసరమైన మార్పులు.. చేర్పులు, సెక్షన్ల మార్పుపై చర్యలు చేపడుతున్నారు. రెంటచింతల, నరసరావుపేట రెండో పట్టణ పోలీసు స్టేషన్లలో విచారణ శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఆదివారం ఉదయం తిరిగి దర్యాప్తును ప్రారంభించింది. నరసరావుపేట ఒకటో పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లలో సిట్ అధికారి సౌమ్యలత విచారణ చేశారు. నరసరావుపేటలో జరిగిన అరాచకాలపై వీడియో ఫుటేజ్‌ను పరిశీలించారు. కార్ల ధ్వంసం, కారు దహనం, మున్సిపల్ ఉన్నత పాఠశాల వద్ద వైసీపీ మూకల దాడులు, గుంటూరు రోడ్డులో జరిగిన పరస్పర దాడులకు సంబంధించిన వివరాలను సేకరించారు. ఈ సంఘటలను జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో పోలీసుల వైఫల్యాన్ని గుర్తించినట్లు సమాచారం. నమోదైన ఎఫ్ఐఆర్‌లపై పోలీసు అధికారులను ప్రశ్నించారు. ఆయా కేసులను పునః సమీక్షించనున్నారు. నరసరావుపేటలో రబ్బరు బుల్లెట్లతో కాల్పులు జరపడానికి కారణాలపై సదరు పోలీసు అధికారులను ప్రశ్నించారు.

## అధికారుల పాత్రపై విచారణ..

కొన్ని చోట్ల పోలీసు అధికారుల సాయంతోనే అల్లర్లు, విధ్వంసాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో సదరు అధికారుల కాల్ డేటా ఆధారంగా సిట్ సమాచారం సేకరిస్తోంది. ఇటువంటి అధికారులపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సిట్ బృంద సభ్యులు శనివారం రాత్రి రెంటచింతలకు చేరుకుని స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాల పనితీరును పరిశీలించినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో జరిగే ఘర్షణలు, నేతల కదలికలు, ఎత్తుగడలను పసిగట్టి అధికారులకు తెలియచేయాల్సిన స్పెషల్ బ్రాంచ్ విభాగం ఆ పని చేయలేదని జరిగిన సంఘటనలు బలపరుస్తున్నాయని సిట్ బృందం అంచనా వేసినట్లు సమాచారం. ఇక స్వతంత్రంగా పనిచేసే ఇంటెలిజెన్సు పనితీరు లోపాలపై సిట్ అధికారులు దృష్టి పెట్టారు.

## వెంకట్రామిరెడ్డిపై కేసుల నమోదు పరిశీలన

కారంపూడిలో పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సిట్ బృందం విచారణ చేపట్టింది. ఇరువర్గాలు చేసిన విధ్వంస కాండపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఫైల్స్‌ను బృందంలోని అధికారులు పరిశీలించారు. దాడులకు సంబంధించి ఎంతమందిని అదుపులోకి తీసుకున్నారు.. ఎందరిని కోర్టులో హాజరుపరిచారు అనే అంశాలను పరిశీలించారు. ఘర్షణలో పాల్గొని ప్రస్తుతం పరారీలో ఉన్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. వారందరినీ అదుపులోకి తీసుకోవాల్సిందేనని స్థానిక అధికారులకు సిట్ బృందం సూచించింది. వైసీపీ మూకలు మారణాయుధాలతో స్వైరవిహారం చేయడం, టీడీపీ కార్యాలయం ధ్వంసం, దాడుల వీడియో దృశ్యాలను కూడా పరిశీలించినట్లు తెలిసింది. దాడుల్లో స్వయంగా పాల్గొన్న ఎమ్మెల్యే సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై కేసుల నమోదు అంశం కూడా ప్రస్తావించినట్లు సమాచారం. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సిట్ అధికారులు రికార్డులను పరిశీలించారు. తంగెడ పోలింగ్ కేంద్రంపై వైసీపీ మూకలు పెట్రో బాంబుల తో దాడిపై సిట్ స్థానిక పోలీసు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. బాంబు దాడులకు పాల్పడితే బందో బస్తులో ఉన్న సిబ్బంది ఏం చేస్తున్నారని నిలదీసినట్లు సమాచారం. దాచేపల్లిలో కనిశెట్టి నరేంద్ర, కేశానుపల్లిలో నెల్లూరి రామకోటయ్యపై దాడి చేసి గాయపరచడం, ఇరికేపల్లిలో వైసీపీ, టీడీపీ పరస్పర దాడులకు సంబంధించి వివరాలు తీసుకున్నారు. గాయపడిన వ్యక్తులను విచారించారు. దాచేపల్లి సీఐ సురేంద్రబాబు, ఎస్ఐలు శివనాగరాజు, అమీవుద్దీన్‌లను విచారించారు. ఆయా గ్రామాలకు చెందిన బాధితులు స్టేషన్‌కు చేరుకుని జరిగిన సంఘటనలపై అధికారులకు వివరాలు అందజేశారు. సిట్ బృందంలో ఓ డీఎస్పీ, ముగ్గురు సీఐలు ఉన్నారు. శనివారం రాత్రి రెంటచింతలకు చేరుకున్న సిట్ బృందం కొన్నిగంటల పాటు దాడుల ఘటనలకు సంబంధించి సీసీ ఫుటేజ్‌ను పరిశీలించి ఎవరెవరూ ఎలాంటి హడావుడి చేశారనే దానిపై పేర్లతో సహా ఒక నిర్ధారణకు వచ్చింది. నిందితుల ఆనవాళ్లు గుర్తించడంతో పాటు వారి ఆధారాలను సేకరించింది.



దుర్గి :మించాలపాడులో పోలీసులు స్వాధీనం చేసుకున్న రికార్డులు లేని బైకులు



ఉపాధి పనుల్లో కూలీలు

# ఉపాధికి ఊతం

| పని దినాల వివరాలు.. | |
|---|---|
| పల్నాడు | 87,48,695 |
| బాపట్ల | 74,26,878 |
| గుంటూరు | 30,71,889 |

- మూడు జిల్లాల్లో 1.92 కోట్ల పని దినాలు
- కూలీల వలసల కట్టడికి చర్యలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూలీల వలసల నివారణకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్నారు. వారికి పనులు కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో 1.92 కోట్ల పనిదినాలు కల్పించనున్నారు. గత ఏడాది ఇదే స్థాయిలో పని దినాలను కల్పించారు. జాబ్ కార్డుల ఆధారంగా పనిదినాలను నిర్ధారించారు. ఏడాది మొత్తంలో నెలల వారీగా ఏ నెలలో ఎన్ని పనిదినాలు కల్పించాలన్న లక్ష్యాలను రూపొందించి నివేదికలు సిద్ధం చేశారు.

గ్రామాల్లో నిధులులేక ప్రగతి పనులు నిర్వహించలేని దుస్థితి నెలకొంది. పల్లెల్లో ప్రగతి పనులు, మరమ్మతుల వంటి పనులు చేపట్టేందుకు ఉపాధి పథకం వరంగా మారింది. గామాల్లో కూలీలకు పని కల్పించి ఉపాధి అందిస్తున్నారు. ప్రగతి పనులకు మెటీరియల్ విభాగం కింద నిధుల విడుదలతో అభివృద్ధికి అవకాశాలు ఏర్పడుతున్నాయి. కూలీలకు ఉపాధితో పాటు అభివృద్ధి పనులకు సాకారం ఏర్పడుతోంది. గతంలో సిమెంట్ రోడ్లు, ప్రభుత్వ భవనాలు నిర్మించిన విషయం తెలిసిందే. జలసంరక్షణ పనులకు ప్రాధాన్యం కల్పించారు. అధ్వాన్నంగా ఉన్న పంట కాలువలను పునరుద్ధరణ పనులు ఈ పథకం కింద విస్తృతంగా చేపడుతున్నారు. చెరువుల్లో పూడికతీత, నీటికుంటల తవ్వకం, వాగుల్లో పూడికతీత, పొలాల రహదారుల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నారు. ఈసారి మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. గతంలో రోడ్ల పక్కన మొక్కలు నాటారు. వీటిని సంరక్షించ టంలో నిర్లక్ష్యం వలన 25 శాతం మొక్కలు కూడా మిగలలేదు.

పల్నాడు జిల్లాలో నీటి వనరుల అభివృద్ధికి సంబంధించి ఇప్పటి వరకు 50,833 పనులు చేపట్టనున్నారు. వీటిలో 18,608 పనులు జరుగుతున్నాయి. వీటిలో 884 పనులు పూర్తి చేశారు. ఆయా పనులకు 192.31 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 1039 పనులు చేపడు తున్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు కూడా ప్రాధాన్యం ఇచ్చారు. పారిశుధ్యం, రోడ్లు, భవనాలు, ఆహార ఉత్పత్తుల నిల్వకు గోదాములు తదితర పనులు 223.24 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. 21,930 పనులు చేపట్టగా 4,861 పనులు పురోగతిలో ఉన్నాయి. బాపట్ల జిల్లాలో జలవనరులు అభివృద్ధికి సంబంధించి 45,394 పనులను రూ.161.13 కోట్ల వ్యయంతో చేపట్టగా 1069 పనులు పూర్తయ్యాయి. 21,281 పనులు కొనసాగు తున్నాయి. గ్రామీణ మౌలిక సదుపాయల కల్పన కోసం 19,665 పనులు 20.85 కోట్ల వ్యయంతో చేపట్టగా 20 పనులు పూర్తి కాగా 4,344 పనులు కొనసాగుతున్నాయి. గుంటూరు జిల్లాలో జలవనరుల నిర్వహణకు సంబంధించిన పనులు 19,306 పనులు 66.30 కోట్ల వ్యయంతో చేపట్టగా 564 పనులు పూర్తి కాగా 7,508 పనులు కొనసాగుతున్నాయి. గ్రామీణ మౌలిక సదుపాయల కల్పన కోసం 12.64 కోట్ల వ్యయంతో 13,226 పనులు చేపట్టగా 1,594 పనులు కొనసాగుతున్నాయి.



# ఓటుకు ఇంధనం

- ఎన్నికల్లో నల్లధన ప్రవాహం
- రూ.2,000 కోట్లు ప్రజా వినియోగంలోకి
- రూ.1,000 నుంచి రూ.4 వేలకు ఓటు కొనుగోలు
- మద్యం కొనుగోళ్ళకు నల్లధనమే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికల్లో నల్లధనం ప్రవాహించింది. ఓట్లు, మద్యం కొనుగోళ్లకు నల్లధనాన్నే వినియోగించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.1,700 కోట్లు ప్రజా వినియోగంలోకి వచ్చాయి. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఇదే అత్యంత ఖరీదైన ఎన్నికలని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఓటు రేటు రూ.1,000 నుంచి రూ.4 వేలు పలికింది. మద్యం, డబ్బు విచ్చల విడిగా నియోజకవర్గాల్లో పంపిణీ చేశారు. ఒక్కో నియోజకవర్గంలో అభ్యర్థుల ఖర్చు రూ.60 కోట్ల నుంచి రూ.100 కోట్లు వరకు ఉంది. యథేచ్ఛగా ఓట్ల కొనుగోలు జరిగినా ఎన్నికల అధికారులు చోద్యం చూశారు. ఏ నియోజక వర్గంలో నామమాత్రపు చర్యలు కూడా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోలేదు. ఎక్కడా చర్యలు కన్పించక పోవటం తో పగటి పూట కూడా బహిరంగంగానే డబ్బు పంపి ణీ చేశారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై క నీస నిఘా ఏర్పాటు చేయటంలో ఎన్నికల అధికారులు ఘోరంగా విఫలమయ్యారు.

అభ్యర్థులు ఓట్ల కొనుగోలుకు రూ.కోట్లు కుమ్మరించారు. ఇవేవి ఏ శాఖ లెక్కల్లో కన్పించవు. ఏడాదిగా పోగు చేసిన నల్లధనాన్ని అభ్యర్థులు ఓట్ల కొనుగోలుకు వినియోగించారు. ప్రధాన పార్టీలు ఓట్ల కొనుగోలుకు పోటీ పడ్డాయి. ఓట్ల కొనుగోలుకు వినియోగించిన డబ్బు ఎక్కడా లెక్క చూపించిన దాఖలాలు లేవు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు ఓట్లు కొనుగోలు చేశాయి. ఇలా ప్రతి నియోజకవర్గంలో మూడు నుంచి నాలుగు లక్షల ఓట్లు కొనుగోలు చేశాయి. రూ.2 వేలు చొప్పున నియోజక వర్గంలో మూడు లక్షల ఓట్లు కొనుగోలు చేసి ఉంటే ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖర్చు రూ.60 కోట్లు అవుతుంది. అయితే ఇదిలా ఉంటే పది రోజుల పాటు విచ్చలవిడిగా మద్యం పంపిణీ చేశారు. ఒక్కొక్క నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు ఒక్కో పార్టీ రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు మద్యం పంపిణీకి వినియోగించింది. అలాగే పదిరోజుల పాటు వందల సంఖ్యలో భోజనాలు, ప్రచారంలో పాల్గొనే వారికి కూలీ కింద ఇచ్చే డబ్బు ఇలా వివిధ రకాల ఖర్చు అభ్యర్థులు చేశారు. పట్టణాల్లో ఓటుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు, పల్లెల్లో ఓటుకు రూ.1500 నుంచి రెండు వేల వరకు పంపిణీ చేశారు.

పల్లె ఓటరు కంటే పట్టణ ఓటు గిరాకీ అధికంగా ఉంది. పల్నాడులో ఓటు రేటు అధికంగా ఉంది. తెనాలి ప్రాంతంలో ఓటు రేటుతక్కువగా ఉంది. ఇక్కడ రూ.1000 నుంచి 2వేల వరకు కొనుగోలు చేస్తే పల్నాడులో కొన్ని చోట్ల రూ.4వేల వరకు ఓటు రేటు పలికింది. పలు నియోజకవర్గాల్లో పట్ట ణ ఓటర్లకు రూ.2,000 నుంచి రూ.2,500 వరకు పంపిణీ చేశారు. అత్యధికంగా పెదకూరపాడు నియోజకవర్గంలో ఓటుకు రూ.4వేల వరకు పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధికంగా ఈ నియోజకవర్గంలోనే ఓటు రేటు ఉంది.

## రూ.200 నుంచి రూ 4 వేలకు

ఎన్నికల్లో ఓటు రేటు ప్రతి ఎన్నికలకు మారుతూ వస్తున్నది. 2004లో జరిగిన ఎన్నికల్లో కొన్ని నియోజక వర్గాల్లో రూ.200కు ఓటు కొనుగోలు చేశారు. 2009లో ఓటు రేటు రూ.500కు పెరిగింది. 2014 ఎన్నికల్లో ఏకంగా ఓటు రేటు వెయ్యి నుంచి రూ.1,500లు పలికింది. 2019 ఎన్నికల్లో ఓటు రేటు రూ.2వేల వరకు నెలకొంది. ఈ ఎన్నికల్లో రూ.1000 నుంచి రూ.4000 ఓట్ల కొనుగోలు జరగడం చర్చనీయాంశమైంది. ప్రతి ఎన్నికల్లో ఓటు రేటు దాదాపు రెట్టింపు అవుతూ వస్తోంది. ఓటు కొనుగోలు చేయటంలో ప్రధాన పార్టీల అభ్యర్థులెవ్వరూ వెనకడుగు వేయటం లేదు. ఒక కుటుంబంలో ఐదు ఓట్లు ఉంటే పట్టణంలో ఇరు పార్టీలు రూ.2వేలు చొప్పున డబ్బు ఇస్తే ఆ కుటుంబానికి రూ.20వేలు వచ్చినట్లే. కొన్ని చోట్ల డబ్బు పంపిణీలో జాప్యం జరిగితే ఓటర్లు అభ్యర్థుల ఇళ్ళకు వెళ్ళి మరీ తమకు డబ్బు ఇవ్వలేదని నిలదీసిన సంఘటనలు ఉన్నాయి. ఓట్ల కొనుగోలు మాట ఇలా ఉంటే మద్యం పంపిణీకి కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. కుబేరులు మాత్రమే ఇక జరగబోయే ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి. సామాన్యులు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో పోటీచేసి గెలవలేని పరిస్థితులు నెలకొన్నాయి. ధనం, మద్యం అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఊహకు అందని రీతిలో నల్లధనం వినియోగంలోకి వచ్చిందని చెప్పవచ్చు.

# ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

## ఆర్‌వోలు, డీఎస్పీలతో ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్



బాపట్ల, మే 19: ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. కౌంటింగ్ సెంటర్లలో ఏర్పాట్లకు సంబంధించి ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు వారు పలుసూచనలు చేశారు. అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. కౌంటింగ్ రోజు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ రోజు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల కాంపౌండ్ నుంచి 100 మీటర్ల బయట బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని, వాహనాల్ని లోపలికి అనుమతించరాదన్నారు. ప్రధాన ద్వారం వద్ద అభ్యర్థులను, కౌంటింగ్ ఏజెంట్లను, కౌంటింగ్ సిబ్బందిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించాలన్నారు. ఆర్‌వోలు ముందుగానే ఏజెంట్లకు, అభ్యర్థులకు గుర్తింపుకార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గ కౌంటింగ్‌లో సంబంధిత ఆర్‌వోనే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారని తెలిపారు. కౌంటింగ్ సెంటర్ల బయట మూడంచల భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న పరిణామాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఇప్పటికే పలు ఘటనలపై కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున జూన్ 6 వరకు ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం నిషేధమని తెలిపారు. పెట్రోల్ బంకుల యాజమాన్యాలు లూజుగా క్యాన్లు, బాటిళ్లలో విక్రయాలు చేయరాదని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ విఠలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యలంక తీరంలో పర్యాటకుల సందడి



సూర్యలంక తీరంలో సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

బాపట్ల, మే 19: ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరంలో గత రెండు రోజులుగా పర్యాటకుల సందడి నెలకొని ఉంది. బాపట్ల పరిసరప్రాంతాలు నుంచే కాకుండా ఇతర ప్రాంతాలు నుంచి కూడా పర్యాటకులు పెద్దఎత్తున ప్రత్యేక వాహనాలలో వచ్చి సముద్రస్నానాలు చేస్తూ సరదాగా గడుపుతున్నారు. శని, ఆదివారాలల్లో పర్యాటకులు పెద్దసంఖ్యలో రావటం జరుగుతుంది. ప్రస్తుతం వేసవి సెలవు దినాలు కావటంతో ఎప్పటి కంటే ఎక్కువగా పర్యాటకులు విచ్చేసి సందడి చేస్తూ సముద్రస్నానాలు ఆచరిస్తూ సరదాగా గడుపుతున్నారు. ఆదివారం సూర్యలంక తీరానికి వచ్చిన పర్యాటకులు గుర్రపు స్వారీ, బైక్‌పై తిరగటం వంటి వాటితో సరదాగా గడిపారు.

# శంకుస్థాపనలతోనే సరి

- రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే
- నిలిచిన ఇండోర్ స్టేడియం పనులు
- నత్తనడకన రైతుబజార్ నిర్మాణాలు

రేపల్లె, మే 19: రెండేళ్లు అవు తుంది.. అయినా అభివృద్ధి పనులు ఒక కొలిక్కిరాలేదు. ఇండోర్ స్టేడియం, రైతుబజార్ నిర్మాణాలకు శంకుస్థాపన చేయగా.. ఇప్పటికీ అవి పూర్తి కాలేదు. ఎంపీ నిధుల నుంచి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఇండోర్ స్టేడియానికి రూ.1 కోటి, రైతుబజార్ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేశారు. వీటికి మంత్రి కొట్టు సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మేరుగ నాగార్జునలు 2022 సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేశారు. అయితే ఇండోర్ స్టేడియం పనులు సగంలో ఆగిపోగా, రైతుబజార్ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. జరుగుతున్న పనులు చూస్తే ఇప్పట్లో ఇవి పూర్తై వినియోగం లోకి వచ్చే పరిస్థితి లేదనిపిస్తోంది. రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు పనులు పూర్తి స్థాయిలో అయిన దాఖలాలు లేవు. ఇండోర్‌స్టేడియం పనులు సగంలోనే కాంట్రాక్టర్ నిలిపివే శారు. పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులు రాని కారణంగానే పనులు చెయ్యలేకపోతున్నామని కాంట్రాక్టర్ వాపోతున్నారు. శంకుస్థాపన సభలో మంత్రులు మండలానికో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారని, కానీ ఒక్క దాని పనులనే పూర్తి చేయలేకపోయారంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

- తీరంలోని రైతులు తాము పండించిన కూరగాయలు అమ్ముకునేందుకు రూ.2 కోట్లతో రైతుబజార్‌ను నిర్మిస్తున్నామని మంత్రులు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో పట్టణంలోని పండ్ల మార్కెట్ వద్ద రైతుబజార్‌కు శంకుస్థాపన చేశారు. రెండేళ్లు కావస్తున్నా రైతు బజారు నేటికీ అటు రైతులకు, ఇటు వినియోగదారులకు అందు బాటులోకి రాలేదు. నిర్మాణ పనులు బేస్‌మెంట్ దశలోనే ఉన్నాయి. రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు కూడా నాశిరకం గా ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారని తెలిపారు.



జూనియర్ కళాశాల ప్రాంగణంలో అసంపూర్తిగా ఇండోర్ స్టేడియం నిర్మాణం



నత్తనడకన సాగుతున్న రైతుబజార్ భవనం



జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ కార్యాలయం (ఫైల్)

# డీసీఎంఎస్ పాలకవర్గం రద్దు

● అధికార పీఐసీగా జేసీ ● అకౌంటెంట్ సస్పెన్షన్

ఒంగోలు (విద్య), మే 19 : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) పాలకవర్గాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. అధికార పీఐసీగా జాయింట్ కలెక్టర్ గోపాల కృష్ణను నియమించింది. ఈమేరకు రాష్ట్ర సహకార శాఖ కార్యదర్శి ఎ.బాబు ఉత్తర్వులు జారీ చేశారు. డీసీఎంఎస్‌లో భారీ కుంభకోణం చోటుచేసుకుంది. రైతులకు ఎరువులు సరఫరా చేసినందుకు ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపీఎల్) కంపెనీకి చెల్లించేందుకు పొగాకు బోర్డు విడుదల చేసిన రూ.3.5 కోట్లను డీసీఎంఎస్ అకౌంటెంట్ రామచంద్రరావు విడతల వారీగా తన బ్యాంకు సేవింగ్ ఖాతాకు మళ్లించారు. ఆతర్వాత ఐపీఎల్ కంపెనీ నుంచి ఒత్తిళ్లు రావడంతో ఆయన దశల వారీగా రూ.2.26 కోట్లను ఆకంపెనీ ఖాతాకు జమ చేశారు. ఇంకా నికరంగా రూ.52 లక్షలు ఐపీఎల్‌కు చెల్లించాల్సి ఉంది. ఈనేపథ్యంలో డీసీఎంఎస్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పాలకవర్గాన్ని ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని కలెక్టర్ సంజాయిషీ నోటీసులు ఇచ్చారు. మరోవైపు నిధుల దుర్వినియోగంపై అప్పటి డీసీవో వి.రాజశేఖర్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఈనేపథ్యంలో ఏడుగురు సభ్యుల డీసీఎంఎస్ పాలకవర్గంపై ప్రభుత్వం వేటు వేసింది. ప్రస్తుతం సొసైటీ చైర్మన్‌గా రావి పద్మావతి, సభ్యులుగా సూరసాని మోహన్‌రెడ్డి, స్వర్ణ వంశీకృష్ణ, షేక్ హుస్సేన్, సారె వెంకటనాయుడు, గంగవరపు శౌరమ్మ, వేమిరెడ్డి చెన్నారెడ్డిలు వ్యవహరిస్తున్నారు. వీరంతా సొసైటీ నిర్వహణలో విఫలమైనందున ప్రభుత్వం పాలకవర్గాన్ని రద్దు చేసింది. సొసైటీలో నిధుల స్వాహాకు ప్రధాన కారకుడైన అకౌంటెంట్ బి.రామచంద్రరావును సస్పెండ్ చేసినట్లు జిల్లా సహకార అధికారి బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.



గొడవలు చేలరేగినప్పుడు ఆందోళన కారులు రాళ్లు విసిరినప్పుడు ఎలా ఎదుర్కోవాలో తెలియజేస్తున్న పోలీసులు

## 'డేర్' డ్రిల్!

ఒంగోలు ఆర్టీసీ డిపో వద్ద ఉన్న సాగర్ హోటల్ సెంటర్‌కు ఆదివారం సాయంత్రం కొందరు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం రాళ్లు రువ్వడం ప్రారంభించారు. అంతలోనే పోలీసులు అక్కడికి వచ్చారు. వాటర్ కెనాన్‌ను ఉపయోగించారు. అల్లరి మూకలు వెనక్కి తగ్గకపోవడంతో టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. అనంతరం లాఠీ చార్జి చేశారు. పరిస్థితి అదుపుకాకపోవడంతో గాలిలోకి కాల్పులు జరిపారు. దీంతో కొద్దిసేపు ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అనంతరం అదంతా నిజం కాదని.. పోలీసుల మాక్ డ్రిల్ అని తెలుసుకొని ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తవడం, త్వరలో కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో అసాంఘిక శక్తులు అల్లర్లకు పాల్పడితే అదుపు చేసే విధానాన్ని ఎస్పీ గరుడ్ సుమిత్ ఆధ్వర్యంలో పోలీసులు కళ్లకుకట్టినట్లు చూపించారు. గాలిలోకి కాల్పుల సమయంలో డమ్మీ బుల్లెట్లను వినియోగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల్లో ధైర్యం కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించామని తెలిపారు. ప్రజల శాంతియుత జీవనానికి ఎవరు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏఆర్ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- ఒంగోలు (క్రైం)



భైరవ కోనలో జలపాతం

## జల..జల..జలపాతం

సీఎస్‌పురం మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన భైరవకోన వద్ద జలపాతం కనువిందు చేస్తోంది. వేసవి కావడంతో నిన్నటి వరకూ చుక్కనీరు కనిపించని ఇక్కడ శనివారం రాత్రి కురిసిన వర్షానికి జలకళ సంతరించుకుంది. దీంతో జలపాతాన్ని చూసేందుకు ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి భైరవకోనకు వస్తున్నారు. దీంతో భక్తుల తాకిడి పెరిగింది. జలపాతం వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా దేవస్థాన నిర్వాహకులు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

- సీఎస్‌పురం(పామూరు)

## గవినివారిపాలెంలో కార్డన్‌సెర్చ్

చీరాల, మే 19 : మండల పరిధిలోని గవినివారిపాలెంలో ఆదివారం ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా జరిగిన హింసాత్మక సంఘటనల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో లా అండ్ ఆర్డర్ పోలీసులు, ఏపీఎస్‌పీ పోలీసులు మొత్తం 150 మంది అధికారులు, సిబ్బంది పాల్గొని గ్రామంలో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో రూరల్, అద్దంకి రూరల్, వన్‌టౌన్ సీఐలు, నిమ్మగడ్డ సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, శేషగిరిరావు పాల్గొన్నారు.

# కాయ్ రాజా కాయ్

జిల్లాలో బెట్టింగ్‌ల జోరు

రాష్ట్రంలో కూటమి వైపు పెరిగిన పందేలు

ఇక్కడా మెజారిటీ స్థానాలు లభిస్తాయని కూడా..

రాష్ట్రంలో వైసీపీ, టీడీపీలకు లభించే సీట్లపై బెట్టింగ్‌లు

కడుతున్న పందెంరాయుళ్లు

జిల్లాలో దర్శి, చీరాల, కందుకూరు ఆతర్వాత ఒంగోలుపైనే అధికం

ఇప్పటికే రూ.వందల కోట్లు దాటిన వైనం



ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు ఊపందుకున్నాయి. ఇటు టీడీపీ కూటమి, అటు వైసీపీ రాష్ట్రస్థాయి నేతల స్పందనలు కూడా అందుకు దోహదపడ్డాయి. రెండు రోజుల నుంచి జిల్లాలో పందేల జోరు పెరిగింది. ఇప్పటికే వందల కోట్ల బెట్టింగ్ జరిగింది. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేజిక్కించుకుంటుందన్న వైపు అధికంగా పందేలు నడుస్తున్నాయి. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు లభించే స్థానాలపై కూడా బెట్టింగ్‌లు పెరిగాయి. జిల్లాలో ఏపార్టీకి ఎన్ని స్థానాలు వస్తాయన్న విషయంపైనా పందేలు కాస్తున్నారు. కిందిస్థాయిలో దర్శి, కందుకూరు, ఒంగోలు, చీరాల లాంటి స్థానాల్లో ఎవరు విజయం సాధిస్తారన్న దానిపై బెట్టింగ్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. మిగిలిన నియోజకవర్గాల్లో గెలుపోటములకన్నా ఆధిక్యతలపైనే పందేలు కడుతున్నారు. కొన్నిచోట్ల డబ్బుతోపాటు వారిచేతిలో ఉన్న పదవులపైనా పందేలు నడుస్తుండటం విశేషం. ఒంగోలు లోక్‌సభ స్థానంలో గెలుపోటములపై కూడా బెట్టింగ్‌లు పెరిగాయి.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌లు జోరుగా నడుస్తున్నాయి. రాష్ట్రస్థాయిలో గెలుపోటములపై సీఎం జగన్ ప్రకటన అనంతరం ఇవి మరింత ఊపందుకున్నాయి. ఎన్నికల సమరం ప్రారంభానికి ముందు రాష్ట్రంలో టీడీపీ కూటమికి 88 స్థానాలు కూడా రావని వైసీపీ అనుకూల బెట్టింగ్ సాగింది. ఒంగోలు నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు కొందరు ముందుకొచ్చి రూ.కోటి పందెం కాశారు. అనంతరం వైసీపీ అనుకూల బెట్టింగ్‌లు తగ్గాయి. తిరిగి జగన్ సిద్ధం సభల నిర్వహణ తర్వాత వైసీపీ అనుకూల పందేలు పెరిగాయి. నామినేషన్‌ల దాఖలు కార్యక్రమం అనంతరం వారివైపు నుంచి తగ్గాయి. ఎన్నికల ప్రచార కార్యక్రమం ముమ్మరంగా జరిగేటప్పుడు వైసీపీ శ్రేణులు మరోసారి బెట్టింగ్‌లకు ముందుకొచ్చాయి. పోల్ చివరికొచ్చేసరికి వెనుకడుగు వేశారు. పోలింగ్ రోజు కూడా ఇదే పరిస్థితి కనిపించింది. అయితే ఐప్యాక్ ప్రతినిధులతో సీఎం జగన్ సమావేశం అనంతరం రాష్ట్రంలో వైసీపీ గెలుస్తుందన్న పందేలు పెరిగాయి. టీడీపీ కూటమి వైపు పందెంరాయుళ్లు తగ్గకపోవడంతో మళ్లీ వారిలో ఆలోచన ప్రారంభమైంది. తాజాగా రాష్ట్రస్థాయిలో గెలుపోటములను పక్కనపెట్టి కూటమిలో టీడీపీకి వచ్చేసీట్ల కన్నా వైసీపీకి అదనంగా వస్తాయంటూ వైసీపీ అనుకూలురు బెట్టింగ్‌లు ప్రారంభించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఈ ఈవ్యవహారం సాగుతోంది. మొత్తం రాష్ట్రస్థాయి గెలుపోటములపై టీడీపీ కూటమి గెలిస్తే రూ.లక్షలకు లక్ష, వైసీపీ గెలిస్తే లక్షకు లక్షన్నర అన్న పందెం నడుస్తోంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి వైసీపీ అనుకూల బెట్టింగ్‌దారులు పంథాను మార్చి కూటమితో సంబంధం లేకుండా టీడీపీకన్నా వైసీపీకి ఒక్క సీటైనా అధికంగా వస్తుందంటూ పందేలు కట్టడం ప్రారంభించారు. ఈ విషయంలోనూ బెట్టింగ్‌లు జోరందుకోవడంతో రాష్ట్రస్థాయిలో అధికారం ఎవరిదన్న విషయంలో కూటమి వైపే ఎక్కువ బెట్టింగ్‌లు జరుగుతున్న విషయం తేటతెల్లమైంది.

### జిల్లాలో మెజారిటీ స్థానాలపై ఎక్కువగా పందేలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలుండగా వాటిలో మెజారిటీ స్థానాలు ఎవరికి వస్తాయన్న అంశంపై ఎక్కువగా పందేలు జరుగుతున్నాయి. పోలింగ్‌కు ముందు ఉమ్మడి జిల్లాలో టీడీపీకి 7 స్థానాలు వస్తాయా? రావా? అన్న దానిపై బెట్టింగ్‌లు సాగాయి. టీడీపీ అనుకూలురు లక్ష పందెం కాస్తే వైసీపీ అనుకూలురు కూడా సమాన స్థాయిలో పెట్టేందుకు ముందుకు వచ్చారు. తాజాగా టీడీపీకి ఉమ్మడి జిల్లాలో 7 స్థానాలు రావు అన్న విషయంలో వైసీపీ వారు బెట్టింగ్‌లకు రాకపోతుండటం గమనార్హం. అయితే ఆదివారం మధ్యాహ్నం నుంచి వైసీపీ అనుకూలురు జిల్లాలో అత్యధిక స్థానాలను పక్కనపెట్టి వైసీపీకి ఐదు స్థానాలు వస్తాయన్న విషయంపై బెట్టింగ్‌లకు దిగారు. ఆప్రకారం టీడీపీకి 7, వైసీపీకి 5 అన్న స్థాయిలో వారి పందెం కనిపించింది.

### నియోజకవర్గాల వారీ ఇలా..

జిల్లాలో నియోజకవర్గాల వారీ చూస్తే దర్శి, కందుకూరు, చీరాల, ఒంగోలు లాంటి అసెంబ్లీ స్థానాలపైనే గెలుపోటములపై బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. ఒంగోలులో వైసీపీ అభ్యర్థి బాలినేని గెలుస్తారని గతంలో ముందుకు వచ్చిన వారు తాజాగా ఒకటికి ఒకటిన్నర పెడితేనే బెట్టింగ్ కాస్తామని చెప్తున్నారు. దర్శిలో ఇరుపార్టీల మధ్య గెలుపోటములపై పందేలు జోరుగా సాగుతున్నాయి. అందులో దర్శి మండలంపై పెరిగాయి. తొలి రెండురోజుల్లో వైసీపీకి 10వేలు మెజారిటీ వస్తుందని బెట్టింగ్‌లు కాసినవారు తాజాగా 2వేలు మెజారిటీపై పందెం కడుతున్నారు. టీడీపీ అనుకూల బెట్టింగ్‌లు కాసేవారు మాత్రం ఆరంభం నుంచి ఇప్పటి వరకు విజయంపై బెట్టింగ్‌లలో ముందున్నారు. కందుకూరు, చీరాలలో గెలుపోటములపై కూడా స్థానికంగా పందేలు అధికంగా జరుగుతున్నాయి. పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు, కొండపి, కనిగిరి నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి గెలుపు ఖాయమని, ఆధిక్యతలపైన మాత్రమే బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. వెలిగండ్ల మండలంలో ఎన్నడూ లేనివిధంగా ఇరు పార్టీలకు చెందిన నాయకులు గెలుపోటములపై తమ పదవులకు సైతం రాజీనామా చేయడానికి అగ్రిమెంట్లు సైతం రాసుకున్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీ గెలుపునకు అనుకూలంగా ఎక్కువగా పందెం కడుతున్నారు. గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో పోటాపోటీ బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. గిద్దలూరు విషయంలో మాత్రం విభిన్న రకాల బెట్టింగ్‌లు సాగుతున్నాయి. కింది స్థాయిలో మండలాల వారీ, గ్రామాల వారీ కూడా బెట్టింగ్ రాయుళ్ల పందేల జోరుపెంచడం కనిపిస్తోంది.

# త్రిపురాంతకంలో గాలివాన బీభత్సం

పడిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్

నేలమట్టమైన బొప్పాయి, అరటి తోటలు

రేకుల ఇల్లుపై కూలిన రైస్ మిల్లు ప్రహరీ గోడ



కంకణాలపల్లిలో నేలమట్టమైన బొప్పాయి తోట

త్రిపురాంతకం, మే 19: మండలంలోని పలుగ్రామాల్లో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వీచిన గాలులకు, కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. బొప్పాయి, అరటి తోటలు నేలమట్టమయ్యాయి. త్రిపురాంతకంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని రైస్‌మిల్లు గోడకూలి పక్కనే ఉన్న రేకుల ఇంటిపై పడడంతో ఇళ్లు పూర్తిగా ధ్వంసమైంది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న వృద్ధురాలికి అదృష్టవశాత్తు ఏమీ కాలేదు. కంకణాలపల్లిలో ప్రధాన రహదారిపై విద్యుత్‌స్తంభం మధ్యలోకి విరిగి తీగలతో సహా రోడ్డుపై వాలింది. పొలాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలవాలాయి. సోమేపల్లి, కంకణాలపల్లి గ్రామాల పరిధిలో నేలవాలిన సుమారు 50 స్తంభాలు, ఎనిమిది ట్రాన్స్‌ఫార్మర్లను ఇన్నటివరకు గుర్తించామని, వీటి సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని విద్యుత్ ఏఈఈ సురేష్‌రెడ్డి తెలిపారు. కంకణాలపల్లిలో వర్షం, గాలుల దాటికి తొమ్మిది ఎకరాలలోని బొప్పాయి తోటలు పూర్తిగా నేలవాలాయని రైతులు బత్తుల గురవయ్య, దద్దాల రమణయ్య, బైలడుగు ఎల్లయ్యలు తెలిపారు. ఎకరానికి సుమారు మూడు లక్ష



మధ్యలోకి విరిగి రోడ్డుకు అడ్డంగా ఒరిగిన విద్యుత్ స్తంభం

ల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయారు. ఒడ్డుపాలెంలో మహిళా రైతు భీమిశెట్టి యోగమ్మ సాగు చేసిన రెండెకరాల అరటితోట నేలవాలింది. కాగా నష్టపోయిన పంటలను వీహెచ్‌ఏ నాగజ్యోతి పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా ఈ వర్షంతో కంకణాలపల్లి చెరువుకు నీరుచేరి జలకళ సంతరించుకుంది. వర్షం గాలుల ప్రభావంతో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలవాలడంతో ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

# విషాదం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

నెల్లూరు జిల్లాలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

వెలిగండ్ల మండల వాసులు ఇద్దరు దుర్మరణం

శుభకార్యాలకు వచ్చి వెళ్తుండగా ఘటన

కనిగిరి వద్ద ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరి మృతి

మరో ఇరువురి పరిస్థితి విషమం



మృతుడు డేవిడ్ (ఫైల్)



బస్సు ప్రమాదంలో గాయాలతో ప్రయాణికులు



మృతురాలు మరియమ్మ (ఫైల్)

వెలిగండ్ల/కనిగిరి, మే 19 : అర్ధరాత్రి.. అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా దడేల్‌మని పెద్దశబ్దం.. కళ్లు తెరిచి చూసేలోపు కేకలు, అరుపులు.. కాపాడామని ఆర్తనాదాలు.. బస్సు నిండా క్షతగాత్రులు.. నెల్లూరు జిల్లా కోవూరు మండల పరిధిలోని గంగవరం రోడ్డు సమీపంలో ఆర్టీసీ బస్సు టైరు పక్చర్ అయి అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొన్న సమయంలో అక్కడ నెలకొన్న పరిస్థితి ఇదీ. ఈ ప్రమాదంలో వెలిగండ్ల మండలానికి చెందిన ఇద్దరు వలస కూలీలు మృతి చెందారు. గన్నవరం గ్రామానికి చెందిన వేమవరపు మరియమ్మ (46), కంకణంపాడుకు చెందిన వేమవరపు డేవిడ్ (50), ఆయన భార్య విశ్రాంతమ్మ చెన్నైకు వలస వెళ్లి అక్కడ కూలీలుగా పనిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం గ్రామాల్లో జరిగిన వేర్వేరు శుభకార్యాలకు వీరు హాజరయ్యారు. శనివారం చెన్నైకు తిరుగుప్రయాణమయ్యారు. రాత్రి 8 గంటలకు వెలిగండ్లలో ఆర్టీసీ బస్సు ఎక్కారు. బస్సు నెల్లూరు జిల్లా గంగవరం రోడ్డు సమీపంలోకి వెళ్లే సరికి రాత్రి ఒంటి గంట సమయంలో టైరు పక్చర్ అయ్యింది. దీంతో అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మరియమ్మ, డేవిడ్ అక్కడికక్కడే మృతి చెందారు. డేవిడ్ భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మరో 10 మందికి గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో 47 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది.





ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, ఆటో (ఇన్‌సెట్లో) మృతిచెందిన విష్ణునారాయణ (ఫైల్)

### అతివేగం ఇద్దరు ప్రాణాలు తీసింది

కనిగిరి, మే 19 : కారు డ్రైవర్ అతివేగం ఇద్దరి ప్రాణాలను తీసింది. మరో ఇద్దరి పరిస్థితిని విషమంగా మార్చింది. ఆదివారం తెల్లవారుజామున పట్టణ సమీపంలోని దేవాంగనగర్ వద్ద ఆటోను కారు ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. పట్టణ సమీపంలోని కాశిరెడ్డికాలనీకి చెందిన బత్తుల విష్ణునారాయణ (57), అమ్మనబ్రోలు కస్తూరి (25)తోపాటు రామకృష్ణ, గుండ్లతోటి గురవమ్మలు ఆటోలో కనిగిరి నుంచి పొదిలి రోడ్డులో తమ ఇంటికి తిరిగి వెళ్తున్నారు. ఈక్రమంలో పొదిలి వైపు నుంచి కనిగిరి వస్తున్న కారు మలుపు వద్ద అతివేగంతో నియంత్రించలేక ఎదురుగా రోడ్డుకు రెండో వైపు వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విష్ణునారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. కస్తూరి రెండు కాళ్ళు విరిగిపోయి, ఛాతిపైన తీవ్రంగా ఒత్తిడై పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు రామకృష్ణ, గురవమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. కారులో ఉన్న బెలూన్‌లు తెరుచుకోవడంతో డ్రైవర్‌తోపాటు మరోవ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు.

## బాటిళ్లలో పెట్రోల్ నింపితే చర్యలు

పామూరు, మే, 19: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఆదివారం నుంచి వచ్చెనెల 10వ తేదివరకు వాహనాలకు మాత్రమే అవసరమైన మేరకు పెట్రోల్ నింపాలని పోలీసులు తెలిపారు. ఖాళీ వాటర్ బాటిళ్లు, క్యాన్‌ల్లో పెట్రోల్, డీజిల్ నింపారాదంటు ఎన్నికల కమిషన్ ఆదేశాలప్రకారం పెట్రోల్ బంకు యజమానులకు పోలీసులు హెచ్చరికలు జారిచేశారు. బంకుల నుంచి బాటిళ్లకు, డ్రమ్ములకు, పెట్రోల్ నింపితే చర్యలు తీసుకొంటామని హెచ్చరిస్తూ పెట్రోల్ బంకులవద్ద నోటీసులు అతికించారు. పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో వాహనదారులు నిలిచిపోయిన తమ వాహనాల కోసం పెట్రోల్, డీజిల్ బాటిళ్లు తీసుకొని బంకుల వద్దకు వెళ్ళిన వారికి నిరాశ ఎదురవుతుంది. పోలీసుల నోటీసులు చూపిస్తూ పెట్రోల్ ను బాటిళ్లలో నింపబోమని స్పష్టం చేస్తున్నారు.



## కొండెక్కిన కోడి ధర

● ఒంగోలులో కిలో రూ.310

● ఎండల తీవ్రతతో తగ్గిన కోళ్ల ఉత్పత్తి

● మున్ముందు ఇంకా పెరిగే అవకాశం



ఒంగోలు (కలెక్టరేట్), మే 19 : కోడి మాంసం ధర కొండెక్కింది. కిలో రూ.310కి చేరింది. గత ఆదివారం స్కిన్ లెస్ కిలో రూ.270 వరకూ ఉండగా ఇప్పుడు రూ.40 పెరిగింది. ఎండల తీవ్రతతో ఫారాల్లో కోళ్ల పెంపకం తగ్గిపోయింది. ఆదేసమయంలో కోడి పిల్లలు చనిపోతున్నాయి. ఉత్పత్తి తగ్గిపోవడం, కొనుగోళ్లు పెరగడం ధరల పెరుగుదలకు కారణమైంది. మన జిల్లాకు నెల్లూరు, చిలకలూరిపేట, గుంటూరు నుంచి ఎక్కువగా కోళ్లు దిగుమతి అయ్యేవి. ప్రస్తుతం అక్కడ నుంచి సరఫరా తగ్గిపోయింది. రాజమండ్రి, విజయవాడ ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణా ఖర్చులు కూడా అధికమవుతున్నాయి. ఇది కూడా ధరల పెరుగుదలకు ఒక కారణమని వ్యాపారులు అంటున్నారు. మరో పక్షం రోజులు ఇదే పరిస్థితి ఉంటుందని, ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని వారు చెప్తున్నారు.

## బాకీ చెల్లించలేదని బాలుడి కిడ్నాప్

● రాత్రి సమయంలో కారులో వచ్చిన దుండగులు

● గ్రామంలో కలకలం

కావూరివారిపాలెం(చీరాలటౌన్), మే 19 : బాకీ చెల్లించలేదని బాలుడిని వ్యాపారి కిడ్నాప్ చేసిన ఘటన ఆదివారం రాత్రి చీరాల మండల పరిధిలోని కావూరివారిపాలెంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మూకిరి నయోమి స్వూవర్టుపురానికి చెందిన ఓ వ్యాపారి వద్ద గతకొంత కాలం కిందట రూ.లక్ష అప్పు తీసుకున్నారు. ఈనేపథ్యంలో ఆ బాకీకు సంబంధించి వడ్డీ రూ.70వేలకు చేరింది. దీంతో వ్యాపారి పలుమార్లు బాకీ చెల్లించమని బెదిరింపులకు పాల్పడ్డాడు. అయినా బాకీ చెల్లించకపోవడంతో ఆదివారం రాత్రి కారులో మరో ఇద్దరు వ్యక్తులతో వచ్చి ఇంటిముందు ఆడుకుంటున్న నయోమి మనవడు (15సంవత్సరాల) పాల్సన్‌ను కారులో బలవంతంగా తీసుకెళ్లి పోయారు. అయితే దీనిపై బాధిత కుటుంబ సభ్యులు పెద్దల సహకారంతో వెదుకులాట ప్రారంభించారు. దీనిపై పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. అయితే ఈ సంఘటన ఒక్కసారిగా గ్రామంలో కలకలం రేపింది.

# నిల్వ చేయలేం ..అమ్ముకోలేం..!

- తగ్గిన మిర్చి ధరలు
- గుంటూరు యార్డ్‌కు సెలవులు
- సిండికేట్‌గా మారుతున్న వ్యాపారులు
- అకాల వర్షాలతో దిక్కుతోచని స్థితిలో రైతులు



కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసేందుకు ట్రాక్టర్‌లో తెచ్చిన మిర్చి టిక్కీలు

చీరాల, మే 19 : ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డ్ నడవడం లేదు. యార్డ్‌కు వార్షిక సెలవులు ప్రకటించారు. ఈ క్రమంలో ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా మారారు. ధరలను నియంత్రిస్తున్నారని మిర్చి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండించిన పంటను నిల్వ చేయలేం. విక్రయించలేమని వాపోతున్నారు. పర్చూరు, ఇంకొల్లు ప్రాంతాల్లోని కోల్డ్ స్టోరేజీలలో ఆర్థిక పరిపుష్టి ఉన్నవారు నిల్వ చేస్తున్నారు. మిగిలినవారు అయినకాడికి తెగనమ్ముతున్నారు. ఈ పరిస్థితులను ప్రైవేటు వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దీంతో అన్ని రకాల మిర్చి ధరలు సగానికి సగం దిగజారాయి. విక్రయించలేం.. నిల్వ ఉంచలేమని రైతులు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయం నిలకడగా ఉండటం లేదు. ఎప్పుడు ఏ పంటకు గిట్టుబాటు ధర ఉంటుందో అర్థం కాని పరిస్థితి. గతేడాది మిర్చి ధరలు ఒకింత ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో పర్చూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది సుమారు 20వేల హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. సాగు తొలినాళ్లలో ప్రతికూల పరిస్థితుల ఎదురయ్యాయి. ఆ తరువాత తెగుళ్ల బెడదతో పెట్టుబడులు పెరిగాయి. మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వేల ఎకరాల్లో మర్చి పైరు దెబ్బతింది. మిగిలిన పైరుకు బెట్టకొచ్చిన సమయంలో తడులు ఇచ్చేందుకు సాగుదారులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాల్సి వచ్చింది. ఎండు మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండడంతో సాగుదారులు అప్పుచేసి మరీ పెట్టుబడులకు వెనకడుగు వేయకుండా ముందుకు సాగారు.

### కోతల తొలినాళ్లలో ఆశాజనకంగా ధరలు

ఎండు, పచ్చి మిర్చి ధరలు పంట చేతికొచ్చే సమయానికి ఆశాజనకంగా ఉన్నాయి. ప్రైవేటు వ్యాపారులు కూడా పోటీపడి కళ్లాల్లోనే ఎండుమిర్చిని కొనుగోలు చేశారు. తేజ, బాడిగ, సూపర్ టెన్ తదితర రకాలు రకాన్ని బట్టి క్వింటా రూ.10వేల నుంచి రూ.30వేల వరకు ధర పలికాయి. అయితే పూర్తిస్థాయిలో సరుకు చేలల్లో నుంచి వచ్చే సమయానికి ధరలు తగ్గుముఖం పట్టాయి.

### ఆగిన గుంటూరు మిర్చి యార్డ్

ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డ్ నడవటం లేదు. యార్డ్‌కు వార్షిక సెలవులు ప్రకటించారు. దీంతో మిర్చి ధరలు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుతం రకాన్ని బట్టి రూ.9వేల నుంచి రూ.12వేల ధరలు పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు తక్కువ ధరలకు విక్రయించలేక కోల్డ్ స్టోరేజీలలో నిల్వచేయలేక సతమతమవుతున్నారు. ఒకింత చేమెల్లా ఉన్న రైతులు కోల్డ్‌స్టోరేజీలకు తమ సరుకును తరలించారు. తరలిస్తున్నారు. అయితే ఆర్థిక పరిపుష్టి లేనివారు, ప్రస్తుత పెట్టుబడుడులకు డబ్బు అవసరమైనవారు విక్రయిస్తున్నారు.



కోల్డ్ స్టోరేజీలో నిల్వచేసిన మిర్చి టిక్కీలు

### సిండికేట్‌గా మారిన వ్యాపారులు

కోల్డ్ స్టోరేజీలలో సరుకును నిల్వ చేసేందుకు అవకాశం లేనివారు, డబ్బు అవసరమైన రైతులు తమ సరకును ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో ప్రైవేటు వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను నియంత్రిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగుదారులకు గిట్టుబాటు ధర లభించేవిధంగా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం యంత్రాంగంపై ఎంతైనా ఉంది.

### అకాల వర్షం .. అనుకోని నష్టం

నాలుగైదు రోజులుగా అడపాదడపా కురిసిన అకాల వర్షాలతో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప చేలల్లో చివరి కోతలు జరుగుతున్నాయి. కళ్లాల్లో కొంత సరుకు ఉంది. అందులో కాయలను గ్రేడ్ చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షంతో నష్టం మూటగట్టుకోవల్సి వచ్చిందని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో కనీసం గిట్టుబాటు ధరలు ఉంటే నష్టాలు లేకుండా వచ్చే ఏడాది సాగు చేయగలుతామని, లేదంటే సాగుకు స్వస్తి చెప్పాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

---



స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

## వైభవంగా స్వామివారి శాంతి కల్యాణం

కారంచేడు(పర్చూరు), మే 19 : కారంచేడు గ్రామంలోని శ్రీ భూనీల సమేత శ్రీ ప్రయాగ మాధవస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలను పురస్కరించుకొని స్వామివారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం వేకువ జాము నుండే ఆలయంలో స్వామివారిని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివార్లకు సుప్రభాత సేవ, అర్చనలు, భగవత్ ప్రార్థనలు గావించారు. అనంతరం స్వామివారికి లక్ష తులసి దళార్చన చేసి భక్తిని చాటుకున్నారు. మాధవ స్వామివారికి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారి శాంతి కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, భక్తులు చూసి తరించారు. అనంతరం ప్రసాద వినియోగాలు చేపట్టారు. కార్యక్రమం అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం గ్రామోత్సవం నిర్వహించారు.

## శబరిమలలో గొట్టిపాటి పూజలు



అయ్యప్పకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి, మిత్రులు

అద్దంకి, మే 19 : శబరిమలలో అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ స్నేహితులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు రెండు నెలలుగా ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా ఉన్న గొట్టిపాటి మూడు రోజుల క్రితం శ్రీశైలం వెళ్లారు. అనంతరం స్నేహితులతో కలిసి శనివారం సాయంత్రం శబరిమల వెళ్లి అయ్యప్పస్వామి ని దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

## హెచ్‌ఐవీపై ప్రజలను చైతన్యపరచాలి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అద్దంకిటౌన్, మే 19 : హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి బారినపడి ప్రజలు మరణించకుండా చైతన్య పరచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అద్దంకి సీహెచ్‌సీ ఐసీటీసీ కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ స్మారక దినం సందర్భంగా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి, ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో వ్యాధితో చనిపోయిన వారికి సంతాపంగా వారి ఆత్మకు శాంతి కలగాలని ర్యాలీ నిర్వహించారు. బాధితుల పట్ల వివక్ష చూపించకూడదని, వారిపట్ల ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలని తెలిపారు. సమాజంలో వ్యాధి ప్రబలకుండా వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా మందులు వాడకుంటూ పోషకాహారం తీసుకుంటే వ్యాధి అంత ప్రమాదకరం కాదన్నారు. మాదకద్రవ్యాలు వినియగం ద్వారా యువత విచక్షణ కోల్పోయి శృంగారం చేయడం ద్వారా చాలా మంది వ్యాధి బారిన పడుతున్నారన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు ప్రజల భాగస్వామ్యం, సమన్వయంతో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఓఆర్‌డబ్ల్యూ ఔట్రీచ్ వర్కర్స్ కరుణ, శ్రావణి, , పీఈ కే మల్లీశ్వరి, పార్వతి, శివపార్వతి పాల్గొన్నారు.

## రైలులో మద్యం అక్రమ రవాణా

- నిందితుల అరెస్టు
- తెలంగాణకు చెందిన 99 క్వార్టర్ సీసాలు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ

చీరాలటౌన్, మే 19 : రైళ్లల్లో అక్రమ రవాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జీఆర్పీ ఎస్సై కొండయ్య హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైళ్లల్లో ఆదివారం రాత్రి తనిఖీలు చేస్తుండగా చీరాల మరియమ్మ పేటకు చెందిన కొడాలి రాఘవ, కారంచేడుకు చెందిన కనికమళ్ల చిన్నబాబు తెలంగాణకు చెందిన 99 క్వార్టర్ మద్యం సీసాలు చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలులో చీరాలకు తరలిస్తు ప్లాట్‌ఫాం నెం.3పై పట్టుబడ్డారు. దీంతో వారి వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. అసాంఘిక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

# అలంకారప్రాయంగా ఫిల్టర్ బెడ్‌లు

- కలుషిత నీటితో ప్రజలకు ఇక్కట్లు
- శుద్ధి చేయకుండానే కొళాయిల ద్వారా సరఫరా
- చర్మ వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజల ఆందోళన
- కన్నెత్తిచూడని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

పర్చూరు, మే 19 : ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు గ్రామాల్లో లక్షల రూపాలయ నిధులతో ఏర్పాటు చేసిన ఫిల్టర్ బెడ్‌లు అలంకార ప్రాయంగా మారింది. మండలంలో ఎక్కడ చూసినా ఫిల్టర్ బెడ్‌లు పనిచేయకపోవడంతో శుద్ధి చేయకుండానే నీటిని పంచాయతీ కొళాయి ద్వారా సరఫరా చేసున్నారు. దీంతో కలుషితంగా రంగుమారి దుర్గంధం వెదజల్లుతున్న నీటితో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందాన అసలే ఫిల్టర్ బెడ్‌లు పని చేయక పోవడం, కనీసం బ్లీచింగ్ కూడా వినియోగించకుండా నీటిని సరఫరా చేస్తుండడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల్లోని ఫిల్టర్ బెడ్‌లతో కనీసం ఇసుకను కూడా మార్చలేని విధంగా పరిస్థితి నెలకొంది. ఫిల్టర్ బెడ్‌లను మెరుగు పరిచి వారిని సక్రమంగా వినియోగంలోకి తీసుకు వచ్చి ప్రజలకు సురక్షిత నీటిని అందించాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కనీసం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో కలుషిత నీటితో ప్రజలు కాలం వెల్లబుచ్చాల్సిన దుస్థితి నెలకొంది. మరో పక్క మంచినీటి చెవులను అభివృద్ధి చేయక పోవడంతో ఏళ్ల తరబడి తామర తూటి ఆకుతో పేరుకుపోయి నీరు కలుషితంగా ఉండడంతో సమస్య మరింత జఠిలంగా మారింది. ఒక పక్క దుర్గంధం మరో పక్క రంగుమారి కలుషితంగా ఉన్న నీటితో ఎలాంటి చర్మవ్యాధులు ప్రబలు తాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన పర్చూరు, నూతలపాడు, ఉప్పుటూరు, అడుసుమల్లి, చెరుకూరు, నాగులపాలెం, కొల్లావారిపాలెం, పోతుకట్ల, వీరన్నపాలెం తదితర గ్రామాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దీనిపై దృష్టిసారించి అలంకార ప్రాయంగా మారిన ఫిల్టర్ బెడ్‌లను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలని ప్రజలు కోరుతున్నారు. ఆ దిశగా ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అలంకారప్రాయంగా పర్చూరులోని ఫిల్టర్ బెడ్‌ల పరిస్థితి



పని చేయని ఫిల్టర్ బెడ్ నుంచి ట్యాంకులకు చేరుతున్న నీరు. రంగుమారి కంపుకొడుతున్న ఫిల్టర్ బెడ్‌లోని నీరు

# చట్టం దృష్టిలో అందరూ సమానమే

- నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు
- ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరిక



చీరాలటౌన్, మే 19 : చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, నేరాలకు పాల్పడితే ఎవ్వరినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఆదివారం ఈపూరుపాలెం, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లను ఎస్పీ జిందాల్ పరిశీలించారు. ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్లపై చర్చించారు. అంతేకాకుండా ఎన్నికల నేపథ్యంలో నమోదయిన కేసులకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దాదాపుగా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అయితే ఆ సమయంలో కొన్నిచోట్ల ఏర్పడిన సమస్యలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే నేర చరిత్ర కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. కౌంటింగ్ సమయంలో కూడా అల్లర్లు జరిగే అవకాశం ఉందని చెప్పారు.

ఈ నేపథ్యంలో సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు వివరించారు. పదేపదే కేసుల్లో ఉన్నవారిని జిల్లా నుంచి బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ బేతపూడి ప్రసాద్, ఎస్బీ సిఐ మల్లికార్జునరావు, స్థానికల సీఐలు సోమశేఖర్, శేషగిరిరావు, సత్యనారాయణ, ఎస్సైలు ఇతర సిబ్బంది ఉన్నారు.

# నిర్మాణానికి నోచుకోని నడిమి వాగు వంతెన

ఇబ్బందిపడుతున్న ఆరికట్లవారిపాలెం గ్రామస్థులు



ఆరికట్లవారిపాలెం, చందలూరు మధ్య నడిమి వాగుపై కూలిన వంతెన

పంగులూరు, మే 19 : నడిమి వాగుపై కూలిన వంతెనను తిరిగి నిర్మించలేదు. దీంతో రాకపోకలకు ఆరికట్లవారిపాలెం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఆరికట్లవారిపాలెం గ్రామం నుంచి చందలూరు వైపు వెళ్లే రహదారిలో దశాబ్ద కాలం కిందట వరద తాకిడికి నడిమి వాగుపై వంతెన కూలిపోయింది. నాటి నుంచి వంతెన నిర్మాణం జరగక పోవడంతో పంట పొలాలలో పనులు చేసుకునేందుకు గ్రామ రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి దక్షిణం వైపున వాగుకి ఎగువ భాగంలో ఉన్న పొలాలలో పంట సాగు కష్టంగా ఉందని, వ్యవసాయ పనులు చేసుకోవాలన్నా, ఎరువులు తీసుకెళ్లాలన్నా తీవ్ర కష్టాలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘం ద్వారా వ్యవసాయ రుణాల కోసం, స్వయం సహాయక సంఘ మహిళలు బ్యాంక్ రుణాలు పొందేందుకు చందలూరు బ్యాంక్‌కు వెళ్లాలంటే ఈ రహదారే ఆధారం. నడిమి వాగుపై వంతెన కూలడం, దానికి దశాబ్దకాలంగా మరమ్మతులు లేకపోవడంతో రైతులు, మహిళలు పనుల నిమిత్తం పొలాలకు వెళ్లాలన్నా, చందలూరు చేరుకోవాలన్నా రెట్టింపు దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకుంది. పంట సాగు సమయంలో పొలాలకు కూలీలను చేరవేయాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగుపై వంతెనను పునర్ నిర్మిస్తే కూతవేటు దూరంలో పొలాలకు, మూడు కిలో మీటర్ల దూరంలో చందలూరు చేరుకునే అవకాశం ఉంది. తక్షణమే నడిమి వాగుపై వంతెన పునర్ నిర్మించి తమ బాధలు తొలగించాలని గ్రామస్థులు, రైతులు వేడుకుంటున్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

## సుందరయ్యకు నివాళి

గంగవరం(ఇంకొల్లు), మే 19 : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు వై.సిద్దయ్య అన్నారు. మండలంలోని గంగవరంలో సుందరయ్య వర్ధంత సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, సీఐటీయూ మండల కన్వీనర్ నాగండ్ల వెంకట్రావు, మాదాల అంజియ్య, గోవిందరెడ్డి, రమేష్‌కుమార్, భవనం శ్రీనివాసరెడ్డి, గోవింద్ పాల్గొన్నారు.

మార్టూరు, మే 19 : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బత్తుల హనుమంతరావు మాట్లాడుతూ నీతి నిజాయతీతో విలువలు గలిగిన రాజకీయ జీవితం గడిపిన వ్యక్తి సుందరయ్య నేటి పాలకులకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పుచ్చలపల్లి సుందరయ్య సేవలను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో వై.రాంబాబు, సూరిబాబు, ఎస్‌కే గఫూర్, ఎస్‌కే షరీఫ్, వీరవల్లి కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, బాబు, మోహనరావు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు

మార్టూరు, మే 19 : విద్యార్థులు పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోగలరని స్థానిక శాఖ గ్రంథాలయ గ్రంథ పాలకుడు రామారావు అన్నారు. వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ఆదివారం బాల బాలికలకు పుస్తక పఠనంపై తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా నీతి కథలు, విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలు, జాతీయ నాయకుల జీవిత చరిత్ర తదితర పుస్తకాలను పిల్లలతో చదివించారు. పుస్తకాలను ఇప్పటి నుంచే చదవడం అలవర్చుకుంటే భవిష్యత్‌లో మేధావులుగా రాణిస్తారని రామారావు తెలిపారు. అనంతరం కారంబోర్డు, చెస్ తదితర ఆటలను ఆడించారు. సెల్‌ఫోన్‌ల మోజులో పడి విద్యార్థులు పుస్తకాలు చదవడం మానేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నప్పటి నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి ఉండేలా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.

## నేడు ప్రకాశం పంతులు వర్ధంతి

550 మార్కులు సాధించిన టెన్త్ విద్యార్థులకు బహుమతులు

అద్దంకిటౌన్, మే 19 : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి సందర్భంగా అద్దంకిలోని ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వాసవీనగర్‌లోని శ్రీనివాస కల్యాణ మండపంలో వర్ధంతి కార్యక్రమం జరుగుతుందని మిత్రమండలి అధ్యక్ష, కార్యదర్శులు ఇలపావులూరి శేషతల్పసాయి, షేక్ మహమ్మద్ రఫీ ఆదివారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా అద్దంకి మండలంలో పదివ తరగతిలో 550 మార్కులు, ఆపైన సాధించిన 143 మంది విద్యార్థులకు బహుమతి ప్రదానం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి టంగుటూరి ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి ముఖ్య అతిథిగా హాజరవుతారని మిత్రమండలి సభ్యులు, ఇతర సంస్థల సభ్యులు అందరు హాజరు కావాలని కోరారు.

## 132 మందికి ఉచిత వైద్య సేవలు



వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

గంగవరం(ఇంకొల్లు), మే 19 : మండలంలోని గంగవరం మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ కల్యాణ మండపలంలో గంగవరం ఆరోగ్య, సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 132 మందికి ఉచితంగా వైద్య సేవలందించారు. బీపీ, షుగర్ పరీక్షలను చేశారు. డాక్టర్ మంచాల రమేష్‌కుమార్, అన్నంరాజు సాంబయ్య, డాక్టర్ ఈశ్వరరావు రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. మంచాల వెంకట్రామయ్య, రంగమ్మ, అనంతలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబసభ్యుల ఆర్థిక సాయంతో రూ.200లకే రెండు నెలలకు సరిపడా మందులను సమకూర్చారు. కార్యక్రమంలో వేదిక కన్వీనర్ కరి బాలచందర్, రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, ఏపీ సుబ్బారావు, జ్యోతి, నాగండ్ల వెంకట్రావు, రామారావు పాల్గొన్నారు.

## వ్యక్తిపై మందుబాబుల దాడి

ద్విచక్ర వాహనం లాక్కొని పరార్



చికిత్స పొందుతున్న అనిల్

కొత్తపేట(చీరాలటౌన్), మే 19 : మద్యం మత్తులో వాహనాన్ని ఢీకొట్టడమే కాకుండా ద్విచక్ర వాహనాన్ని కూడా లాక్కుని పరారైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం చీరాల సమీపంలోని కొత్తపేట మూడు రోడ్లు సెంటర్‌లో జరిగింది. బాధితుడు రామిశెట్టి అనిల్ తెలిపిన వివరాల ప్రకారం ఇతను ఓ ప్రైవేటు వైద్యశాలలో ఉద్యోగి. లక్ష్మీశ్రీనివాస కాలనీ నివాసం. ఈక్రమంలో ఆదివారం మధ్యాహ్నం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా మూడు రోడ్లు సెంటర్‌లో మద్యం మత్తులో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొట్టారు. దీంతో కింద పడిన అనిల్ ముఖానికి రక్త గాయాలు అయ్యాయి. వెంటనే పైకి లేచి అనీనిల్ వారిని నిలదీయగా అతడిని బెదిరించి ద్విచక్ర వాహనాన్ని కూడా లాక్కుని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతుండగా పోలీసులు వివరాలు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే వారిని ఇప్పటికే గుర్తించినట్లు సమాచారం.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

చీరాలటౌన్, మే 19 : గుర్తుతెలియని సుమారు 45 సంవత్సరాలు గల వ్యక్తి మండల పరిధిలోని జాండ్రపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు రైలు కింద పడి మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. అతని ఎడమ చేతిపై విశ్రాంతమ్మ అనే పేరుతో పచ్చబొట్టు ఉంది. ఇతర ఎలాంటి ఆధారాలు లభించలేదు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు 9440627646 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.



గోనుపల్లిలో అత్తవారింట పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు



స్వామివారికి ఇష్ట నైవేద్యాన్ని సమర్పిస్తున్న గిరిజనులు





గోనుపల్లి నుంచి కోనకు పల్లకీలో బయలు దేరిన స్వామి, దేవేరులు

# పెంచలోరికి జై

## శ్రీవారి బ్రహ్మోత్సవాల ప్రారంభం

- గోనుపల్లి నుంచి ఊరేగింపుగా కోనకు ఉత్సవమూర్తుల రాక
- గిరిజనవాడల్లో అంబరాన్నంటిన సంబరాలు
- వైభవంగా అంకురార్పణ పూజలు
- ఘనంగా సేనాధిపతి ఉత్సవం

**రాపూరు(డక్కిలి), మే 19 :** రాపూరు మండలం గోనుపల్లి, గోనుపల్లి గిరిజనవాడలు ఆదివారం ఉదయం గోవింద నామస్మరణతో మారుమోగాయి. తప్పెట్లు, తాళాలు, గిరిజన నృత్యాలు, బాజాభజంత్రీల మధ్య ఉభయ దేవేరులతో కలిసి పెంచలస్వామి బ్రహ్మోత్సవాలు జరుపుకునేందుకు గోనుపల్లిలోని అత్తారింటి నుంచి పెంచలకోనకు పయనమయ్యారు. తొలుత గ్రామంలోని పెంచలోరి ఆలయం నుంచి పల్లకీలో చెంచులక్ష్మి అమ్మవారి ఇంటికి చేరుకున్నారు. కొత్త అల్లుడి రాకతో గోనుపల్లి గిరిజనవాడలో ఘనంగా సంబరాలు జరుపుకొన్నారు. ఇంటికి వచ్చిన అల్లుడికి గిరిజనులు తమ ఆచారం ప్రకారం పుట్టతేనె, ఇంజేటి గడ్డలు, నార మొలతాడును సారెగా ఇచ్చారు. గిరిజనవాడలోని ప్రతి ఇంటి వద్ద నేరేడు ఆకులతో పందెళ్ల వేసి, ఇంటి ముంగిట రంగవళ్లులు తీర్చిదిద్ది వధూవరులకు ఘనంగా స్వాగతం పలికారు. అత్తారింటికి చేరుకొన్న వరుడిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొన్నారు.అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం ముత్తైదువులు గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. ప్రత్యేక పూల అలంకరణ చేసిన పల్లకీలో దేవేరులతో కలిసి స్వామివారు గ్రామ శివారులోని గొల్లబోయి ఆలయానికి చేరుకుని గొల్లబోయికి తొలిదర్శనం ఇచ్చారు. అనంతరం బోయలు పల్లకీ మోసుకుంటూ కాలినడకన కోనకు చేరుకొన్నారు. ఉదయం 9 గంటలకు గోనుపల్లిలో బయలుదేరిన స్వామివారు మధ్యాహ్నం 12 గంటలకు కోనకు చేరకున్నారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు, ప్రధాన అర్చకులు రామయ్యస్వామి, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. కాగా బ్రహ్మోత్సవాలు జరిగే ఐదురోజులు కూడా గోనుపల్లి వాసులు నియమ,నిష్టలతో మాంసాహారాలకు దూరంగా ఉంటారు. కాగా కోనకు చేరుకున్న స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు.

**వైభవంగా అంకురార్పణ**

కోనలోని శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంకురార్పణ పూజలతో మొదలయ్యాయి. ఆలయంలోని అలంకార మండపంలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక యాగశాల ఏర్పాటుచేసి నిత్య హోమాలను ప్రారంభించారు. అర్చకులు పుట్ట మన్నును తీసుకువచ్చి, అందులో నవధాన్యాలు కలిపి కలశస్థాపన చేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు. ఎలాంటి ఆటంకాలు జరగకుండా విజయవంతంగా ఉత్సవాలు జరిగేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కోన వీధుల్లో సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు

# సింహ వాహనంపై లక్ష్మీనరసింహుడు

**వేదగిరిపై బ్రహ్మోత్సవ శోభ**

**నెల్లూరు రూరల్, మే 19:** వేదగిరిపై లక్ష్మీ నరసింహుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేసి మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మండపానికి తోడ్కొని వచ్చారు. అక్కడ అర్చక బృందం శోభాయమానంగా స్వామివారిని అలంకరించి అనంతరం సింహవాహనంపై ఆశీనులను చేశారు. తదుపరి ఆలయ వీధులతోపాటు గిరిప్రదక్షిణ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకలను భక్తులు కనులార వీక్షించి పులకించిపోయారు. కాగా ఆలయ గోశాలకు దాతలు బహూకరించిన 8 గరుకు స్తంభాలను గోశాలలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఓట్లా.. వాపసా!

- ఓటుకు నోటిచ్చిన వైసీపీ నేతల డిమాండ్
- తిరిగి తీసుకుంటున్న వైనం
- ఎమ్మెల్యే అనుచరుల తీరుపై వృద్ధుల ఆగ్రహం

**గత సార్వత్రిక ఎన్నికల్లో రెండుసార్లు గెలిచి, ఈ దఫా మూడోసారి పోటీచేసిన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నియోజక వర్గానికి చేసింది ఏమి లేకపోవటంతో ఓటమి భయం పట్టుకుంది. దీంతో నియోజక వర్గంలోని మారుమూల గ్రామాల్లో సైతం కలియతిరిగి పాఠశాలలు, ఆలయాలు, దర్గాలు, చర్చిల నిర్మాణాలకు తాయిలాలు అందజేశారు. ఎమ్మెల్యేపై వ్యతిరేకత ఎక్కువగా ఉన్న తీరప్రాంత గ్రామాలకు అర్ధరాత్రి తమ అనుచరులను పంపి నయానో .. భయానో లొంగదీసుకునే ప్రయత్నం చేశారు. ఇందుకు పలుచోట్ల ఓటర్లకు రూ.2000 వంతున నగదు కూడా పంపిణీ చేశారు.**

**కావలి రూరల్, మే 19 :** కావలి మండలం చెంచుగానిపాలెం జడ్పీటీసీ సభ్యుడు జంపాని రాఘవులు స్వగ్రామం. దీంతో ఆయన సార్వత్రిక ఎన్నికల్లో తన సత్తా చాటాలని నిర్ణయించుకున్నాడు. పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వలస వెళ్లినవారిని సైతం ఓట్లు వేసేందుకు గ్రామానికి రప్పించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కు ఓటు వేయాలని గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేయడమేకాక వృద్ధులకు ఓటుకు నోటు పంపిణీ చేయించారు. ఎమ్మెల్యేపై, ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో ఎన్నికల్లో అనుకున్న స్థాయిలో వైసీపీకి ఓట్లు పడలేదు. పైగా టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి గెలుపు ఖాయమన్న సంకేతాలు వెలువడ్డాయి. విషయం గమనించిన జడ్పీటీసీ సభ్యుడు పోలింగ్ అనంతరం ఓటర్ల వద్దకు వెళ్లి 'మీరు ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ఓటేసి ఉంటే ప్రమాణం చేయండి. లేకుంటే మా వద్ద తీసుకున్న నగదు తిరిగి ఇవ్వాలని పేద వృద్ధులను, అనారోగ్యంతో ఉన్న వారిని సైతం వేధించారు. ఆయనిచ్చిన నగదును వాపసు తీసుకున్నారు. ఇలా చేయడంపై గ్రామంలో విమర్శలు వెల్లువెత్తాయి. సదరు జడ్పీటీసీ జేబులో నుంచి ఏమైనా నగదు తీసి మాకిచ్చాడా...? మేము ఓటు వేసింది.. లేనిది ఆయనకు ఎలా తెలుస్తుంది...? ఆయనకు నగదు ఎందుకు తిరిగి ఇవ్వాలని ఒకరిద్దరు అన్నా... ఒత్తిళ్లకు లొంగి ఇవ్వక తప్పలేదు.

'మీరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కచ్చితంగా ఓటేసి ఉంటే ప్రమాణం చేయండి. లేదంటే మేమిచ్చిన రూ.2,000 తిరిగి మాకు ఇచ్చేయండి'
- కావలి రూరల్ మండలంలో వైసీపీ నేతల బెదిరింపుల పర్వం

**బలవంతంగా లాగేసుకున్నారు..**

మీరు మాకు ఓటు వేయలేదంటూ.. అనారోగ్యంతో బాధపడుతున్న చెంచుగానిపాలెంకు చెందిన పోసిన రమణమ్మ, వృద్ధురాలు అయిన దద్దాల శాంతమ్మ ఇళ్లకు వెళ్లి వారిచ్చిన నగదును తిరిగి లాగేసుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన ఉప్పాల వెంకటేశ్వర్లు, ఆయన భార్య కామేశ్వరి ఖమ్మంలో జ్యూస్ షాపు నిర్వహిస్తూ ఓటు వేసేందుకు స్వగ్రామానికి వచ్చారు. అప్పటికే గ్రామంలో ఉన్న వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు లక్ష్మమ్మ, పోలయ్య వద్దకు వెళ్లి మీ ఇంట్లో నలుగురూ వైసీపీకి ఓట్లు వేయాలని రాఘవులు నాలుగు ఓట్లకు నగదు అందజేశాడు. పోలింగ్ అనంతరం ఓటు వేసినట్లు ప్రమాణం చేయమనడంతో వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా వినకుండా ఇచ్చిన నగదును జడ్పీటీసీ లాగేసుకున్నాడు. అలాగే ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోయిన దద్దాల నాగార్జున అనే పేరు గల ఇద్దరికి ఫోన్లు చేసి, మీరు మాకు ఓటేసినట్లు గ్యారెంటీ ఏంటి...? నగదు తిరిగి ఇవ్వాలని దూషించాడు. దీంతో గ్రామంలోని వారివారి కుటుంబ సభ్యులు నగదును తిరిగి ఇచ్చేశారు. కాగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ముందుగా గ్రామాల్లో ఓటుకు నగదు పంపిణీ చేయించి, పోలింగ్ అనంతరం ఓటమి భయంతో ఇచ్చిన నగదును తన అనుచరులతో తిరిగి వసూలు చేయిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెంచుగానిపాలెం





దద్దాల శాంతమ్మ | పోసిన రమణమ్మ | మంచానికే పరిమితమైన ఉప్పాల పోలయ్య

# ఈసీ ఆదేశాల మేరకే విధులు

- కలెక్టర్ హరినారాయణన్

**నెల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకే జిల్లాలో ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేసి విధులు కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌ను పూర్తి స్థాయిలో నియమించామని, అలానే ఎస్ఎస్‌టీలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజలు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

# సై అంటే సై..!

- కందుకూరులో జోరుగా పందేలు
- బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఇరుపక్షాలు
- ఉసిగొల్పుతున్న మధ్యవర్తులు

**కందుకూరు, మే 19:** ఎన్నికల ఫలితాల పై కందుకూరులో బెట్టింగ్‌లు జోరందుకుంటున్నాయి. ఎన్నికలు ముగిశాక మూడు,నాలుగు రోజులు లెక్కల్లో మునిగిన నేతలు గత రెండు రోజులుగా పందేలకు సై అంటున్నారు. నియోజకవర్గంలో పోటాపోటీగా ఎన్నిక జరిగిందన్న అంచనాతో జయాపజయాలపై పందేలు వేసేందుకు ఇరుపార్టీల కార్యకర్తలు, అభిమానులు ఆచితూచి అడుగు వేస్తున్నారు. అయితే జిల్లాలో ఫలానా పార్టీకి ఇన్ని సీట్లకు మించి రావు, రాష్ట్రంలో ఫలానా పార్టీ అధికారంలోకి రాదు.. అన్న అంశాలపై పందేలు వేయటంతోపాటు రాష్ట్రంలో ప్రముఖులు పోటీచేసిన నియోజకవర్గాల్లో జయాపజయాలు, వారికి వచ్చే మెజారిటీపై కూడా పెద్దఎత్తున పందేలు కాస్తున్నారు. కందుకూరులో ఇరుపార్టీలలోనూ వెన్నుపోటు రాజకీయాలు నడిచాయన్న చర్చ విస్తృతంగా జరుగుతోంది. అటు వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పరాజయం చెందాలన్న లక్ష్యంతో ఓవర్గం నాయకులు పనిచేశారని, ఎన్నికల అనంతర పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అదేసమయంలో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకు వ్యతిరేకంగా కూడా కొంతమేరకు టీడీపీ వర్గీయులు పనిచేశారన్నది స్పష్టమవుతోంది. ఈ పరిణామాలతో ఏ వర్గానికి ఎంత నష్టం జరిగింది, ఫలితం ఎలా ఉండబోతుంది...? అన్న అంశాలపై లోతైన విశ్లేషణలు చేస్తూ పందేలు కడుతున్నారు.

**మధ్యవర్తుల వద్ద నగదు**

పందేలు కాసినవారు డబ్బును మధ్యవర్తుల వద్ద ఉంచారు. సేకరించిన సమాచారం మేరకు కందుకూరులో ఇప్పటివరకు వివిధరూపాల్లో కాచిన పందేలలో రూ.2 కోట్ల వరకు డబ్బు మధ్యవర్తుల వద్దకు చేరినట్లు సమాచారం. అందులో 10 శాతం మాత్రమే కందుకూరులో అభ్యర్థుల గెలుపోటములపై పందేలు కాసినట్లు సమాచారం. ఎన్నికల తర్వాత సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం, ఇతరత్రా రాజకీయ నాయకులు చేస్తున్న ప్రకటనలతో వైసీపీ క్యాడర్ తిరిగి జగనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాడన్న అంశంపై పందేలు కాసేందుకు సైఅంటున్నారు. ఎట్టిపరిస్థితుల్లో రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటుచేసి తీరుతాడన్న సంపూర్ణ విశ్వాసంతో ఉన్న టీడీపీ క్యాడర్ ఈ పందేనికి లక్షకు లక్షన్నర నుంచి రెండులక్షలు కూడా ఇచ్చేందుకు సిద్ధపడుతుండటంతో పెద్దఎత్తున పందేలు జరుగుతున్నాయి. అంతేకాదు రాష్ట్రంలో ప్రధాన నాయకులు, పార్టీల అధినేతలు పోటీ చేసిన నియోజకవర్గాలైన కుప్పంలో చంద్రబాబునాయుడు, పిఠాపురంలో పవన్ కల్యాణ్, హిందూపురంలో బాలకృష్ణ, మంగళగిరిలో లోకేష్, పులివెందులలో జగన్ మెజారిటీలపై కూడా జోరుగా పందేలు జరుగుతున్నాయి. ఒకరిపై ఒకరు పోటీకి, అధిక మొత్తంలో వచ్చే నగదు ఆశపడి పలువురు ఈ బెట్టింగులలో పాల్గొంటున్నారు.

**మధ్యవర్తుల ప్రోత్సాహం**

కాగా కందుకూరులో బెట్టింగ్‌రాయుళ్లను ఉసిగొల్పి పందేలు కట్టించటంతో కొందరు మధ్యవర్తులు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. ఇరుపక్షాలకు మాట్లాడి పందెం సెట్ చేయటంతోపాటు ఆ డబ్బుకు బాధ్యత వహించాల్సింది కూడా మధ్యవర్తే కావటంతో వీరికి 5 శాతం కమీషన్ ముట్టజెబుతారు. అంటే కోటి రూపాయలు పందెం సెట్ చేయగలిగితే రూ. 5 లక్షలు ఆదాయం వచ్చే పరిస్థితి కావటంతో మధ్యవర్తులు అదేపనిగా ఇరుపక్షాలను రెచ్చగొట్టి మరీ పందేలు కాయిస్తున్నారు. కందుకూరులోనే కనీసం 20 మంది మధ్యవర్తులు బిజీగా ఉండటంతో జోరుగా పందేలు సాగుతున్నాయి. రానున్న వారం పదిరోజుల్లో ఈ పందేల జోరు మరింత ఊపందుకునే అవకాశం ఉంది. రాజకీయ నాయకులు కూడా బెట్టింగ్ రాయుళ్లను ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. గతంలో ఎన్నికల సమయంలో అనేక కుటుంబాలు ఈ బెట్టింగ్‌ల కారణంగా ఆర్థికంగా చితికిపోయిన ఉదంతాలు కళ్ల ముందే కనిపిస్తున్నా బెట్టింగ్‌రాయుళ్ల మాత్రం వెనక్కు తగ్గడం లేదు.



# పుచ్చలపల్లి సేవలు మరువలేనివి

● సుందరయ్య వర్ధంతి సందర్భంగా నేతల ఘన నివాళి

**ఆత్మకూరు, మే 19:** కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిని సీపీఎం, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం పట్టణంలోని డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారకభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య సేవలు మరువలేవని పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన గొప్ప నాయకుడని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.డేవిడ్‌రాజు, జి.లక్ష్మీపతి, ఆత్మకూరు నాగయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి కె.డేవిడ్‌రాజు, నాగేంద్ర, సీఐటీయూ నాయకులు శివప్రసాద్, కొండమూరి హజరత్తయ్య, రైతు సంఘం కార్యదర్శి లక్కుప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని, యస్దానీ, సాలారుద్దీన్, ఆళ్ల హజరత్తయ్య, ప్రజానాట్య మండలి కళాకారులు గద్దర్‌బాబు పాల్గొన్నారు.

**ఉదయగిరి రూరల్:** నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని స్థానిక సీపీఎం కార్యాలయంలో పార్టీ మండల కార్యదర్శి షేక్ ఫరీద్దీన్‌బాష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. జిల్లాలోని అలగానిపాడులో 1913లో జన్మించారని గుర్తుచేసుకున్నారు. సైకిల్‌పై చట్టసభలకు వెళ్లిన నిరాడంబరుడని, నిస్వార్థంగా ప్రజాసేవ చేసి చరిత్ర పుటల్లో నిలిచారన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో విజయం సాధించి లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి పెట్టిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో బండగాని పల్లి ఎంపీటీసీ కాకు విజయమ్మ, రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య, సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి, రంతూజాని, శ్యామ్‌ప్రసాద్, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఉదయగిరి: సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**అనంతసాగరం:** పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సీపీఎం నాయకులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంగలి పుల్లయ్య, అన్వర్‌బాష, సుబ్బరాయుడు, గాడి సుధాకర్, వేము పెంచలయ్య పాల్గొన్నారు.

## వైభవంగా కలశ స్థాపన



పాండురంగ విఠలేశ్వర స్వామికి హారతిస్తున్న పూజారి ఉమామహేశ్వర శర్మ

**సీతారామపురం, మే 19:** పంద్రంగి సమీపంలో వెలసిన పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రిత్వికుల ఆధ్వర్యంలో కలశ స్థాపన, గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి సీతారామపురం కోట వీధివాసులతో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు.

## వివాదాలకు తావు లేకుండా ప్రశాంతంగా ఉండాలి



వరికుంటపాడు: మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటరమణ

**వరికుంటపాడు, మే 19:** గ్రామంలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రతిఒక్కరూ ప్రశాంత వాతావరణంలో కలిసి మెలిసి ఉండాలని కావలి డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. ఆదివారం జడదేవిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో త్వరలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. గెలుపోటములను దృష్టిలో ఉంచుకొని అనవసరమైన ఆవేశాలతో గొడవలకు దిగకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పెద్దలు బాధ్యతగా తీసుకొని తమ పిల్లలు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. తనకు తెలిసి ఇంతవరకు గ్రామంలో గొడవలు జరిగినట్లు ఫిర్యాదులు అందలేదన్నారు. ప్రస్తుతం అదే స్ఫూర్తితో వ్యవహరించి ఆదర్శంగా నిలవాలన్నారు. ఒకసారి తప్పు జరిగినట్లు రికార్డుల్లో నమోదైతే శాశ్వతంగా చెడ్డపేరు వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ గిరిబాబు, ఎస్ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

## యువనేస్తం ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న రెడ్‌క్రాస్ నిర్వాహకులు

**సంగం, మే 19:** సిద్దీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన యువనేస్త సేవా ఫౌండేషన్ సభ్యులు ఆదివారం రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. నెల్లూరు రెడ్‌క్రాస్ నిర్వాహకులు యువకుల నుంచి రక్తం స్వీకరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రెడ్‌క్రాస్ నిర్వాహకులు ప్రతిఏడాది రక్తదానం యువకులను అభినందించి రెడ్‌క్రాస్ తరుపున సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో యువనేస్తం సేవా ఫౌండేషన్ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధ్యానంతో శక్తిసామర్థ్యాలు పెరుగుతాయి



మాట్లాడుతున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ బండి శ్రీనివాసరావు

**ఆత్మకూరు, మే 19:** ధ్యాన సాధనతోనే రోగాలు దూరమవుతాయని, మనిషిలో ప్రశాంతత పెరిగే కొద్దీ అతని విజయాలు, శక్తిసామర్థ్యాలు పెరుగుతాయని సీనియర్ పిరమిడ్ మాస్టర్లు బండి శ్రీనివాసరావు, సుజనాదేవి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండుకు ఎదురుగా ఉన్న శ్రీషిర్డీసాయి పిరమిడ్ కేంద్రంలో ఆదివారం ఆత్మజ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవిత లక్ష్యాలు, నమ్మకాలు, ఆలోచనలు, సంకల్పాలు తదితర అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. బుద్ధభగవానుడి అష్టాంగమార్గం మనశ్శాంతికి, ముక్తికి మంచిమార్గమన్నారు. మనశ్శాంతి పొందాలంటే మనస్సును సాత్వికగుణంలో ఉంచుకోవాలని, అందుకు ధ్యానం ఒక్కటే మార్గమని తెలిపారు. ధ్యానంతో బుద్ధిబలం పెరగడంతో పాటు శరీరంలో నాడిశుద్ధి జరిగి రోగాలు దూరమవుతాయన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి శాఖాహారం ఉపయుక్తమని తెలిపారు. సర్వజీవులను ప్రేమతో, కరుణతో ఆదరించి జీవహింసను రూపుమాపేందుకు ధ్యానసాధకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు డాక్టర్ చంద్రా సుబ్రహ్మణ్యం, సీహెచ్ విజయ, మూరంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, పలువురు ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆత్మీయ సమావేశం



సమావేశమైన పూర్వవిద్యార్థులు

**సంగం, మే 19:** స్థానిక జీబీకేఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 2004 -2005లో పది చదివిన విద్యార్థులు ఒకటై పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నాడు చదివిన తరగతి గదులు, ఆటలాడిన క్రీడా మైదానం కలియ తిరిగి విద్యార్థిగా చేసిన చిలిపి పనులకు గుర్తు చేసుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. నాడు చదువు చెప్పిన గురుకులను సత్కరించారు.

## 10వ తరగతి ప్రతిభా విద్యార్థులకు పురస్కారం

**ఆత్మకూరు, మే 19:** పదో తరగతిలో 475మార్కులు తెచ్చుకున్న యాదవ విద్యార్థులకు ఈ నెల 26న ఉదయం 8 గంటల నుంచి నెల్లూరులోని అపోలో హాస్పటల్ ఎదురుగా ఉన్న జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవన్‌లో ప్రతిభా పురస్కారం ఇవ్వనున్నట్లు యాదవ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య తెలిపారు. ఆదివారం ఈ విషయంపై వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని యాదవ విద్యార్థులందూ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అర్హులందరూ ముందుగా సెల్: 95731 05305, 97058 00794 నెంబర్లుకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ నాయకులు గాలిబోయిన అయ్యన్న, కఠారి సుధాకర్, వెటర్నరీ డాక్టర్ కృష్ణయ్య తెలిపారు. శ్రీకృష్ణ సేవాసమితి నాయకులు పి.రమణ, మహేష్ పాల్గొన్నారు.

## పైపైకి కూరగాయల ధరలు

● కాకర, క్యాప్సికం కిలో రూ.120
● కేజీ పచ్చి మిర్చి రూ.100 ● మిగిలినవి ఏవైనా రూ.60పై మాటే...!



కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి

**ఉదయగిరి, మే 19:** రోజురోజుకు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పదిరోజులు వరకు నిలకడగా ఉన్న ధరలు ఇప్పుడు చుక్కలు చూపిస్తున్నాయి. ఓవైపు ఎండ తీవ్రత, మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో కూరగాయల సాగుపై ప్రభావం పడింది. సరైన దిగుబడి లేక వీటి ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. ఇదే అదునుగా వ్యాపారులు ధరలు పెంచి నిలువు దోపిడీ చేస్తున్నారు. పచ్చిమిర్చి ధర మంట పుట్టిస్తోంది. నిన్నటివరకు మార్కెట్‌లో కిలో రూ.40లు ఉండగా, ఇప్పుడు రూ.100లకు చేరింది. బెండకాయలు రూ.20 నుంచి రూ.60కి, బంగాళదుంపలు రూ.25నుంచి రూ.50, దొండకాయలు రూ.30 నుంచి రూ.70, బీరకాయలు రూ.40 నుంచి రూ. 80, వంకాయ రూ.40 నుంచి రూ.80, బీట్రూట్ రూ.40నుంచి రూ.60లకు, ఉల్లిపాయలు రూ.20 నుంచి రూ.30, దోసకాయ రూ.30, క్యారెట్ రూ.40లు, టమోటా రూ.30లు, క్యాప్సికం రూ.120లు పలుకుతున్నాయి. ఆకు కూరల ధర సైతం పెరగడంతో వినియోగదారులు విలవిలల్లాడుతున్నారు. గతంలో రూ.10లకు ఐదు కట్టల చొప్పున ఇస్తున్న తోట, చిర్రి, పొన్న గంటి ఆకుకూర కట్టలు ప్రస్తుతం రూ.20లకు ఐదు కట్టలు ఇస్తున్నారు. సామాన్యులు కూరగాయలు కొనలేక పచ్చడి మెతుకులతోనే సరిపెట్టుకుంటున్నారు.

**ఏమీ కొనలేం..**



ప్రస్తుతం మార్కెట్‌లో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కూరగాయలు కొనే పరిస్థితి లేదు. ధరలు విపరీతంగా పెరగడంతో పచ్చడి మెతుకులతోనే సరిపెట్టుకుంటున్నాం.

**-రమణమ్మ, ఉదయగిరి**

## భగవద్గీతపై ప్రచారం

**ఉదయగిరి రూరల్, మే 19:** దుత్తలూరు త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి, ఇందుజ్ఞాన వేదిక సభ్యులు ఆదివారం గండిపాళెంలో భగవద్గీతపై కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు జి.ప్రసాద్, సభ్యులు కె.వెంకటేశ్వర్లు, జి.పెంచలరత్నం, కె.నరసింహులు, ఎం.నాగమ్మ, డి.రమణయ్య, ఎస్.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.



దుత్తలూరులో ప్రచారం చేస్తున్న ఇందు జ్ఞాన వేదిక సభ్యులు



## అస్తవ్యస్త డ్రైనేజీతో అవస్థలు



రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

**వింజమూరు, మే 19:** పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నా ప్రజలకు కనీస అవసరాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతుంది ముఖ్యంగా పట్టణంలో మురుగు కాలువల పరిస్థితి దారుణంగా ఉంది. కాలువలల్లో పూడిక తీయక పోవడంతో మురుగునీరు రోడ్డు మీదికి చేరి పాదచారులకు అసౌకర్యం కలిగిస్తుంది. అలాగే దోమలు కూడా విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా వైశ్య బజార్, మెయిన్ రోడ్డు కాలువలలో పూడిక తీయకపోవడంతో రోడ్డు మీద నీరు పారుతోంది. పంచాయతీ అధికారులకు చెప్పినా స్థానికులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారే కానీ కనీస అవసరాలను పట్టించుకోవడం లేదని చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

## అనివేటి మండపం నిర్మాణానికి విరాళాలు

**కందుకూరు, మే 19:** గ్రామదేవత అంకమ్మ ఆలయం అనివేటి మండపం నిర్మాణం కోసం దామా లక్ష్మీనారాయణ, సుజాత దంపతులు రూ. 10116, దామా వెంకటసాయినరేంద్ర, ప్రవల్లిక దంపతులు రూ. 2116 విరాళంగా ఆలయ కమిటీ సభ్యుడు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు.

# కామ్రేడ్ పుచ్చలపల్లి జీవితం ప్రజాసేవకు అంకితం



కావలిటౌన్: సుందరయ్య చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు, అభిమానులు

**కావలిటౌన్, మే 19:** కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య అధ్యక్షతన ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో జరిగిన కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ సుందరయ్య జీవితం ప్రజాసేవకు, కమ్యూనిష్టు ఉద్యమానికి అంకితమిచ్చారన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుబ్బరాయశర్మ, మల్లికార్జునరావు, మధుసూదన్‌రావు, తిరుపాల్, కృష్ణయ్య, కల్లయ్య పాల్గొన్నారు.

**బిట్రగుంట:** పుచ్చలపల్లి సుందరయ్య పేద ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా నాయకురాలు షేక్ రెహనాబేగం అన్నారు. బోగోలు మండలం ఇబ్రహీంపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ బాదుల్లా, చిన్నకొండయ్య, ఎన్ రామయ్య, ఉప్పాల ఎల్లయ్య, డమ్ము భాస్కర్, రంతుల్లా, శంకరయ్య, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

**జలదంకి:** స్థానిక సిపిఎం కార్యాలయం సూరే చెంచురెడ్డి భవన్‌లో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తాళ్ళూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి, గడ్డం మాల్యాద్రి, గడ్డం విజయలక్ష్మీ, మేలంగి ఆంథోనీ, సిపిఐ నాయకులు దమ్ము దర్గాబాబు పాల్గొన్నారు.

**గుడ్లూరు:** మండల కేంద్రమైన గుడ్లూరుతోపాటు చేవూరు, నరసాపురం, గుడ్లూరు విద్యుత్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో సుందరయ్య వర్ధంతిని ఆదివారం వివిధ ప్రజాసంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గుడ్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన వర్ధంతి కార్యక్రమంలో భాగంగా సీపీఎం జెండాను సీనియర్ నాయకులు దామా కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల సీపీఎం కన్వీనర్ గంటెనపల్లి వెంకటేశ్వర్లు, దామా కృష్ణ, ఎం జాలయ్య, ఎం వెంకటేశ్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వలేటివారిపాలెం:** మండలంలోని అంకభూపాలపురంలో ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు కుమార్, సిపిఎం నాయకులు సాధు చెన్నకేశవులు, సుబాను, వెంకటేశ్వర్లు, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ భవనం నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దామా వెంకటేశ్వర్లు

**కందుకూరు, మే 19:** పట్టణంలోని అయ్యప్పస్వామి గుడివద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త దామా వెంకటేశ్వర్లు, రమాదేవి దంపతులు రూ. 50వేలు విరాళంగా అందజేశారు. ఆదివారం అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పసేవాసంఘం కమిటీ సభ్యులకు ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో నలబోతుల మురళీ, మాదాల వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జీవ ఎరువుల వినియోగంపై అవగాహన సదస్సులు

**కందుకూరు, మే 19:** పీఎం ప్రణం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు జీవ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వి రాము ఒక ప్రకటనలో తెలిపారు. 20న మాచవరం, మోపాడు, 21న కొండముడుసుపాలెం, కంచరగుంట, 22న కోవూరు, పందలపాడు, 23న విక్కిరాలపేట, కొండికందుకూరు, 24న మహదేవపురం, పలుకూరు, 25న ఆనందపురం, ఓగూరు, 27న పాలూరు, వెంకటాద్రిపాలెం, 28న జి. మేకపాడు గ్రామాలలో ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, జిల్లా వనరుల కేంద్రం అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. రైతులు ఈ సదస్సులకు హాజరుకావాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు జేవీవీ ప్రతిభా పురస్కారాలు

**కావలిటౌన్, మే 19:** జేవీవీ ఆధ్వర్యంలో ఆదివారం పాతూరులోని రవి నర్సింగ్‌హోమ్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు పురస్కారాలతో సత్కరించి అభినందించారు. జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవి కుమార్, ప్రముఖ చిన్నపిల్లల వైద్యనిపుణులు మనోహర్ బాబు, డాక్టర్ శివప్రసాద్ పాల్గొని విద్యార్థులను నగదు పురస్కారాలతో అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని నీరజను శాలువాతో సత్కరించారు. అతిథులు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణకు జేవీవీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

## వైద్యులకు సన్మానం



మాట్లాడుతున్న వైద్యులు ఏడుకొండలు, సుధాకర్

**బిట్రగుంట, మే 19:** బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వర్ణన్‌రాజ్ ఆధ్వర్యంలో మన ఊరు మన వైద్యులకు సన్మానం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైల్వే వైద్యులు సుధాకర్, ప్రముఖ వైద్యులు ఏడుకొండలు, విజయేంద్ర, చంద్రశేఖర్, ఆనందసాగర్, తిరుపతమ్మ, తదితరులను వాకర్స్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు, జీవన్‌కుమార్, కుందుర్తి శ్రీనివాసులు, సత్యనారాయణ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో టీడీపీ విజయం తథ్యం

● కావ్య క్రిష్ణారెడ్డికి కమ్మవారి సేవాసమితి సన్మానం



కావ్య క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న కమ్మవారి సేవాసమితి సభ్యులు

**కావలి, మే 19:** కావలిలో టీడీపీ విజయం తథ్యమని, ఇందులో కమ్మవారి కృషి అనిర్వచనీయమని ఎన్డీఏ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కమ్మవారి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా కమ్మవారి సేవాసమితి నాయకులు మాట్లాడుతూ కావ్య క్రిష్ణారెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని, కావలిలో అరాచక పాలన, రౌడీయిజం పోయి ప్రశాంతత రాబోతుందన్నారు. కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం జెండా తమదిగా భావించి నిద్రాహారాలు మాని కావలిలో టీడీపీకి పట్టంకట్టి చంద్రబాబుకు కావలిని కానుకగా ఇవ్వబోతున్న కమ్మ సోదర సోదరీమణులకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి రాజకీయ పదవులలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ ఐక్యతతో పనిచేసి కావలిలో క్రిష్ణారెడ్డిని గెలిపిస్తున్నామని, అందుకు దోహదపడ్డ ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్మవారి సేవాసమితి కావలి శాఖ అధ్యక్షుడు మాకినేని మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, కోశాధికారి రాయుడు, గుత్తికొండ కిషోర్, బొట్లగుంట శ్రీహరినాయుడు, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, వ్యోశాంతి రమణయ్య, చల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఘనంగా దత్తాత్రేయస్వామి ఆరాధనోత్సవం



ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న దత్తాత్రేయస్వామి

**లింగసముద్రం, మే 19:** మండలంలోని మొగిలిచెర్ల సమీపంలోని మన్నేరు ఒడ్డున ఉన్న దత్తాత్రేయస్వామి ఆరాధన మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. స్వామిని దర్శించుకొనేందుకు భక్తులు ఉదయం 6 గంటల నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలి వచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ మంచినీరు, అన్నదానం ఏర్పాటుచేశారు. అలాగే రాత్రి దత్తదీక్ష మాలాధారణ స్వాములచే పండరి భజన, అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లూరు సీఐ బివివి సుబ్బారావు, ఎస్సై ఎం బాజీబాబు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## చిన్నారులకు ఖోఖో పోటీలు



ఖోఖో ఆడుతున్న చిన్నారులు

**ఉలవపాడు, మే 19 :** వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు ఖోఖో పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం గ్రంథాలయానికి విచ్చేసిన 35 మంది విద్యార్థులకు తొలుత పుస్తక పఠనం చేయించి, జనరల్ నాలెడ్జ్‌పై సామర్థ్యాలను పరీక్షించినట్లు చెప్పారు. పిల్లల మానసిక వికాసం కోసం రోజుకో క్రీడతో వారికి శారీరక, మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తున్నట్లు గ్రంథపాలకుడు తెలిపారు. అనంతరం చిన్నారులకు శీతల పానీయాలు అందచేశామన్నారు.

## సీనియర్ రాజకీయవేత్త శ్యాంసుందరనాయుడు మృతికి సంతాపం



గొట్టిపాటి శ్యాంసుందర నాయుడు(ఫైల్)

**జలదంకి, మే 19:** కావలి మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి కొండపనాయుడు సోదరుడు శ్యాంసుందరనాయుడు (80) శనివారం కావలి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో గుండెపోటుతో మృతిచెందారు. చింతల పాలెంలోని ఆయన స్వగృహంలో మృతదేహాన్ని వివిధ పార్టీలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, జలదంకి మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, కేశవరం, కమ్మవారిపాలెం సర్పంచ్‌లు రావి ప్రసాద్‌నాయుడు, తమ్మినేని సతీష్‌నాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

# అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు : సీఐ



కావలి రూరల్: వైకుంఠపురంలో స్వాధీనం చేసుకున్న వాహనాలు

**కావలి రూరల్, మే 19:** కావలి పట్టణం ఇస్లాంపేట, వైకుంఠపురంలోని పలు ఇళ్లల్లో ఆదివారం 1వ, 2వ పట్టణ, సిఐలు రాజేష్, కొండవీటి శ్రీనివాసరావులు స్పెషల్‌పార్టీ పోలీసులతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎలాంటి అలజడులు సృష్టించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలలో వైకుంఠపురంలో ఎలాంటి పత్రాలు లేని 9 బైకులు, ఇస్లాంపేటలో 13 బైక్‌లు, 2 ఆటోలు, కత్తులు, గొడ్డళ్లవంటి కొన్ని మారణాయుధాలు స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

**కప్పరాళ్లతిప్పలో...**

**బిట్రగుంట :** బోగోలు మండలం కప్పరాళ్ళ తిప్పలో రూరల్ సీఐ నాగభూషణం ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో ఎటువంటి గొడవలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా ఇళ్ల తనిఖీ చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ధ్రువీకరణ పత్రాలు లేని 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, వాటి పత్రాలు చూపించినట్లయితే తిరిగి ఇచ్చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దగదర్తి ఎస్సై మర్రినాయుడు, అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది ఉన్నారు.

**ఓగూరులో...**

**కందుకూరు :** ఓగూరు ఎస్సీ కాలనీలో ఆదివారం ఉదయం కందుకూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కందుకూరు టౌన్, రూరల్, ఉలవపాడు ఎస్ఐలు సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఓగూరులో పెద్దఎత్తున ఇతర రాష్ట్రాల మద్యం అక్రమ నిల్వలు ఉన్నట్లు అందిన సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించగా కాలనీకి చెందిన దార్ల క్రాంతికుమార్ ఇంట్లో 90 మద్యం సీసాలు లభించాయి. క్రాంతికుమార్ పెద్దఎత్తున ఇతర రాష్ట్రాల మద్యం తెప్పించి ఇక్కడ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆ మద్యాన్ని స్వాధీనం చేసుకుని క్రాంతికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.